www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 23-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 54 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 7.23 తదుపరి పాడ్యమి; నక్షత్రం: విశాఖ ఉ. 9.14 తదుపరి అనూరాధ; వర్జ్యం: మ.1.23-3.08; దుర్ముహూర్తం: ఉ.10.02-10.54, మ.3.12-4.04; అమృతఘడియలు: రా.11.21-1.01; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.39 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## 14 ఏళ్ల ఓబీసీ సర్టిఫికెట్ల రద్దు!

బెంగాల్‌లో 2010 తర్వాత జారీ చేసిన 'కులధ్రువీకరణ' పత్రాల రద్దు

కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు

కొత్తగా ఓబీసీల జాబితాను రూపొందించాలని ఆదేశాలు 2

ఇప్పటికే ప్రయోజనం పొందినవారికి ఇబ్బంది లేదని వెల్లడి





కోర్టు ఉత్తర్వులను
### ఆమోదించం

కోటా కొనసాగుతుంది

సీఎం మమతా బెనర్జీ 2




# హద్దు దాటొద్దు

ప్రచారంలో శ్రుతి మించొద్దని మీ 'స్టార్ క్యాంపెయినర్ల'కు చెప్పండి

బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులకు ఎన్నికల కమిషన్ హెచ్చరిక




కులం, మతం, జాతి, భాషలపై రెచ్చగొట్టే ప్రసంగాలు

ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడం సరికాదు

మతపరమైన ప్రచారం తప్పంటూ ఈసీ ఆగ్రహం

ముస్లింలీగ్, శక్తి వంటి పదాల వాడకంపై అభ్యంతరం

రక్షణదళాలను రాజకీయాల్లోకి లాగొద్దని సూచన

"ఎన్నికల ప్రచారంలో 'హద్దు' దాటొద్దని మీ 'స్టార్ క్యాంపెయిన ర్ల'కు చెప్పండి" అంటూ ఎన్నికల కమిషన్ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు హెచ్చరిక జారీ చేసింది. ఇరు పార్టీల స్టార్ క్యాంపెయినర్లు చేస్తున్న ప్రసంగాలు గాడితప్పుతున్నా యంటూ.. ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించకుండానే ఆగ్రహం వ్యక్తం చేసింది. క్యాంపెయినర్లు ఎన్నికల నియమావళిని పాటించేలా చూడాల్సిన బాధ్యత పార్టీల అధ్యక్షులపైనే ఉన్నదని గుర్తు చేసింది.

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్‌లు తమ తమ స్టార్ క్యాంపెయినర్ల ప్రసంగాల్లో కనీస మర్యాద పాటించేలా చూడాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. పార్టీల నేతల ప్రసంగాల తీరుపై లోక్‌సభ ఎన్నికల్లో ఐదో దశ ముగిసిన తర్వాత ఈసీ స్పందించింది. కాంగ్రెస్ గెలిస్తే దేశ సంపదను ముస్లింలకు పంచేస్తుందంటూ మోదీ.. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రాహుల్ గాంధీ.. ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై ఇరు పార్టీలూ ఈసీకి ఫిర్యాదులు చేశాయి. వాటిపై వివరణ ఇవ్వాలంటూ రెండు పార్టీలకూ ఈసీ గతంలో ఆదేశాలు జారీ చేసింది. వాటిపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇచ్చిన వివరణలను తిరస్కరిస్తూ.. తాజాగా వారికి లేఖలు రాసింది. కులం, మతం, జాతి, భాషల ఆధారంగా రెచ్చగొట్టే ప్రసంగాలు, వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న నేతలు సంయమనం పాటించేలా చూడాలని ఆ లేఖల్లో సూచించింది. వివిధ కులాలు, మతాలు, తెగలు, భాషలకు చెందిన ప్రజల నడుమ ఇప్పటికే ఉన్న విభేదాలు మరింత పెరిగేలా, పరస్పర విద్వేషాన్ని కలిగించేలా, ఉద్రిక్తతలను పెంచేలా ఏ పార్టీ, ఏ అభ్యర్థీ ఎలాంటి వ్యాఖ్యలూ చేయకూడదని, ఎలాంటి చర్యలూ చేపట్టకూడదని ఎన్నికల నియమావళి పేర్కొంటున్న విషయాన్ని గుర్తుచేసింది. క్యాంపెయినర్లు ఆ నియమావళిని అనుసరించేలా చూసే బాధ్యత పార్టీలదేనని స్పష్టం

మిగతా 2వ పేజీలో...



# పిన్నెల్లి పరార్!

ఈవీఎం ధ్వంసం కేసుతో మాయం

దేశం దాటారా.. ఇక్కడే ఉన్నారా?.. ప్రత్యేక బృందాలతో పోలీసుల వేట

తెలంగాణలో ఉన్నట్లు సమాచారం.. సంగారెడ్డిలో అరెస్టు చేసినట్లు వార్త

పాలమూరులో ఓ పత్తి మిల్లులో బస.. పోలీసులు వెళ్లడానికి ముందే జంప్!

పిన్నెల్లి వాహనం సీజ్.. అదుపులోకి డ్రైవరు.. లుక్ అవుట్ నోటీసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పోలింగ్ రోజు, ఆ తర్వాత మాచర్లలో అరాచకం సృష్టించిన వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి పరారీలో ఉన్నారు. విదేశాలకు పారిపోయారా... లేక దేశంలోనే ఎక్కడైనా అజ్ఞాతంలో ఉన్నారా అనేది తెలియడంలేదు. 'నేను ఎక్కడికీ పారి పోలేదు. పోలీసుల సూచన మేరకే హైదరాబాద్ వచ్చాను' అని సుద్దపూస కబుర్లుచెప్పిన ఆయన కోసం పోలీసు ప్రత్యేక బృందాలు వేట సాగిస్తున్నాయి. పోలింగ్ రోజు ఈవీఎం ధ్వంసం చేసిన దృశ్యాలు బయటపడటంతో... ఆ కేసులో పిన్నెల్లిని పోలీసులు ఏ1గా చేర్చారు. నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదంటూ కేంద్ర ఎన్నికల సంఘం కూడా నిలదీసింది. డీజీపీకి గట్టి ఆదేశాలు జారీ చేసింది. దీంతో.. పిన్నెల్లి సోదరులను పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలను

మిగతా 14వ పేజీలో...

### 'గుర్తుతెలియని' పిన్నెల్లి!

సిట్ రాకతోనే గుట్టు బయటపడింది

బూత్‌లోకి చొరబడి ఈవీఎం బద్దలు

లేచి నిలబడి దండం పెట్టిన పీవో

ఆయన పేరు లేకుండానే ఫిర్యాదు

'గుర్తు తెలియని' నిందితులపై కేసు

సిట్ విచారణతో కదిలిన డొంక

సీఈవో ఆఫీసు నుంచి సీసీ ఫుటేజ్

ఆ తర్వాతే కేసులో ఏ1గా పిన్నెల్లి

వెంటనే పిన్నెల్లిని అరెస్ట్ చేయండి

రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఈసీ ఆదేశం.. ఈవీఎం ధ్వంసంపై ఫైర్

14



## ఇక.. టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు టీఎస్ఆర్టీసీ(తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ) పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చారు. తెలంగాణ ఏర్పాటుతో అప్పటిదాకా ఏపీఎస్ఆర్టీసీగా ఉన్న సంస్థ టీఎస్ఆర్టీసీగా మారిన విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం 'టీఎస్' స్థానంలో 'టీజీ'ని వినియోగించాలని ఆదేశించడంతో టీఎస్ఆర్టీసీని టీజీఎస్ఆర్టీసీగా మార్చినట్లు సంస్థ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. సంస్థ అధికారిక ఎక్స్ ఖాతాల పేర్లను కూడా @tgsrtcmdoffice, @tgsrtchq గా మార్చినట్లు తెలిపారు. మెరుగైన సేవలందించేందుకు సలహాలు, సూచనలతోపాటు ఫిర్యాదులను ఈ ఖాతాల ద్వారా స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఒకేరోజు ఇద్దరు మునిసిపల్ కమిషనర్ల

## సస్పెన్షన్

12

తుర్కయాంజల్, బాన్సువాడ కమిషనర్లపై వేటు

తుర్కయాంజల్ కమిషనర్ సస్పెన్షన్ ఉత్తర్వుల్లో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఉటంకించిన అధికారులు



కేంద్రానికి ఆర్బీఐ
## భారీ గిఫ్ట్

- రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్
- ఆర్బీఐ చరిత్రలోనే అత్యధికం 2
- బ్యాంకు కేంద్రబోర్డు భేటీలో నిర్ణయం
- ఆర్థికరంగం బలోపేతం నేపథ్యంలో భారీ డివిడెండ్‌కు ఆమోదం
- ద్రవ్యలోటు లక్ష్యసాధనలో కేంద్రానికి ఉపయోగపడనున్న నిధులు

## చంచల్‌గూడ జైలుకు సీసీఎస్ ఏసీపీ

14

ఉమామహేశ్వరరావుకు 14 రోజుల రిమాండ్

## గృహేతర విద్యుత్తు చార్జీల పెంపు!

సర్కార్ అనుమతిస్తే చార్జీలు సవరించాలని యోచన

కోడ్ తర్వాత ఏఆర్ఆర్ దాఖలుకు డిస్కమ్‌ల నిర్ణయం

రూ.50వేల కోట్లకుపైగా నష్టాలతో డిస్కమ్‌ల ఎదురీత

ఉపశమనం పొందాలంటే చార్జీలు పెంచాల్సిన పరిస్థితి

గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో కోలుకోలేని దెబ్బ

13

# సంక్షోభంలో పంచాయతీలు!

నిధుల లేమితో పెనుభారం అవుతున్న నిర్వహణ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు బంద్
- ఏడాదిన్నరగా నిలిచిపోయిన ఎస్ఎఫ్‌సీ, నాలుగు నెలలుగా పెండింగ్‌లో కేంద్రం నిధులు
- విద్యుత్తు బిల్లులు, వీధిదీపాల నిర్వహణ, కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ డీజిల్‌కూ కష్టాలే
- పదవిలో ఉండగా సర్దుబాటు చేసిన సర్పంచులు
- ప్రత్యేక అధికారుల పాలనతో మరిన్ని ఇక్కట్లు
- అప్పులు చేసి కడుతున్నామంటున్న అధికారులు
- నిధులు వస్తేనే.. పంచాయతీల అభివృద్ధి 13



వికారాబాద్ జిల్లా జంషడ్‌పూర్ గ్రామ పంచాయతీలో 650 మంది జనాభా ఉంటారు. ఈ గ్రామానికి ప్రతి నెలా ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.34,130, కేంద్రం నుంచి రూ.54,170 రావాల్సి ఉంది. అయితే ఏడాదిన్నర కాలంగా ఎస్ఎఫ్‌సీ నిధులు, 4 నెలలుగా కేంద్రం నిధులు రావడంలేదు. విద్యుత్తు బిల్లు రూ.24 వేలు, ఇద్దరు కార్మికులకు రూ.12 వేలు, ట్రాక్టర్ డీజిల్ ఖర్చు రూ.7 వేలు, వీధిదీపాల నిర్వహణకు రూ.5 వేలు, ఇతరాలకు రూ.15 వేలు కలిపి ఈ గ్రామ పంచాయతీ నిర్వహణకు ప్రతినెలా రూ.63 వేలు అవసరం. నిధులు రాకపోవడం వల్ల వీటిని సర్దుబాటు చేయలేక అక్కడి అధికారులు సతమతమవుతున్నారు. ఇటీవల గ్రామ ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన ఆదాయంతో కొంత సర్దుబాటు చేసినా.. అప్పులు చేసి నిర్వహించాల్సి వస్తోందని అంటున్నారు.



# సంక్రాంతికి సన్న బువ్వ!

జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ

స్కూళ్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీల్లో ఇప్పటికే సన్నబియ్యం

పీడీఎస్‌నూ కలిపితే ఏటా 24 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం

ఈ స్థాయి సేకరణ కష్టమే.. 500 బోనస్‌తో సన్నాల సాగుకు ఊపు

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా వచ్చే ఏడాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ఆరు నెలల్లో సన్నాల సాగు, ఉత్పత్తి, ప్రొక్యూర్మెంట్, మిల్లింగ్‌పై దృష్టిసారించి.. వచ్చే జనవరి నెల కోటాలో సన్నబియ్యం పంపిణీ చేయాలనే ఆలోచనకు వచ్చినట్లు

మిగతా 3వ పేజీలో...

### 3వేల కోట్లతో పంటల బీమా పథకం

సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకే బోనస్ 12

మున్ముందు దొడ్డు రకం వడ్లకూ..

హామీలు పూర్తి చేయకుంటే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగం: తుమ్మల

## పట్టభద్రులారా.. మీరూ మోసపోతారా?

ఆరు గ్యారంటీల పేరుతో ప్రజల్ని కాంగ్రెస్ మోసగిస్తోంది

రెండు లక్షల ఉద్యోగాలు అని చెప్పి ఒక్కటీ ఇవ్వలేదు

కేసీఆర్ భర్తీ చేసిన ఉద్యోగాలకే వీళ్లు ఆర్డర్లు ఇచ్చారు

ఎంజీఎంకు కూడా కరెంటు ఇవ్వలేని ప్రభుత్వమిది

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో కేటీఆర్

వరంగల్, హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలు అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలను మోసగిస్తోందని, విద్యావంతులైన పట్టభద్రులు కూడా వీటికి మోసపోతారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. సమాజానికి దిక్సూచిగా ఉంటూ దిశానిర్దేశం చేసేది పట్టభద్రులేనన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారికి ఓటేయాలని కోరారు. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ

మిగతా 12వ పేజీలో...



తిరుమలలో దర్శనం తర్వాత కూతురు, అల్లుడు, మనుమడితో సీఎం రేవంత్ దంపతులు

### తీన్మార్ మల్లన్న భారీ మెజార్టీతో గెలవాలి

ఎమ్మెల్సీ ఉపఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

3 జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం నిర్దేశం

# ఏపీతో సత్సంబంధాలు

సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై అక్కడి కొత్త ప్రభుత్వంతో కలిసి ముందుకు..

తిరుమలలో భక్తుల కోసం సత్రం, కల్యాణ మండపం నిర్మిస్తాం: రేవంత్ 13

శ్రీవారి సన్నిధిలో మనుమడికి పుట్టెంట్రుకలు.. కుటుంబ సమేతంగా దర్శనం



12

# రైతులను సీఎం బెదిరిస్తున్నారు

దొడ్డు రకం సాగైతే గడ్డుకాలమే అనేలా రేవంత్ తీరు

ప్రతి గింజా కొంటామని కేంద్రం చెబుతున్నా జాప్యమేల?

నెరవేర్చే సత్తా లేనప్పుడు హామీలు ఇవ్వడమెందుకు

రకంతో సంబంధం లేకుండా రైతులకు బోనస్ ఇవ్వాలి

జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి సోనియాను ఏ ప్రాతిపదికన ఆహ్వానిస్తారు: కిషన్ రెడ్డి

## కేజ్రీవాల్ కాంగ్రెస్‌కు, రాహుల్ ఆప్‌కు ఓటేస్తారు: రాఘవ్ చద్దా

న్యూఢిల్లీ, మే 22: ఆరోదశ ఎన్నికలకు ముందు ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)- కాంగ్రెస్‌ల బంధం గురించి వివరిస్తూ.. మే 25న జరగనున్న ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి ఆప్ అధినేత కేజ్రీవాల్ కాంగ్రెస్‌కు ఓటేస్తారని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆప్‌కు ఓటేస్తారని చెప్పారు. కంటి ఆపరేషన్ తర్వాత యూకే నుంచి తిరిగి వచ్చిన ఆయన దక్షిణ ఢిల్లీ ఆప్ అభ్యర్థి సాహీ రామ్ పహేల్వాన్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఢిల్లీ ప్రజలు ఓటేసేముందు తమ పిల్లల భవిష్యత్తును గురించి ఆలోచించి ఓటేయాలని అన్నారు. ఆప్ పథకాలతో ఢిల్లీలోని ప్రతి కుటుంబానికి నెలకు రూ.18వేలు ఆదా అవుతున్నాయని చెప్పారు. ఉచిత విద్యుత్, మందులు, నీరు అలాగే పిల్లల స్కూల్ ఫీజులు, మహిళలకు ఉచిత బస్సులాంటి పథకాలు కొనసాగాలంటే ఆప్‌కు ఓటేయాలని రాఘవ్ పిలుపునిచ్చారు.

## కేంద్రానికి ఆర్బీఐ భారీ గిఫ్ట్

### 2.11లక్షల కోట్ల డివిడెండ్.. ఆర్బీఐ చరిత్రలోనే అత్యధికం

ముంబై, మే 22: ఎన్నికల తర్వాత కేంద్రంలో కొలువుదీరే కొత్త ప్రభుత్వానికి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీ గిఫ్ట్ ఇచ్చింది. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రానికి రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. ఆర్బీఐ చరిత్రలోనే ఇది అత్యధికం. ఇప్పటి వరకూ 2018-19లో ప్రకటించిన రూ.1.76 లక్షల కోట్ల డివిడెండ్ అత్యధికం కాగా.. తాజా డివిడెండ్ దీనిని అధిగమించింది. గత ఏడాది డివిడెండ్‌తో పోలిస్తే ఇది దాదాపు 140 శాతం ఎక్కువ. 2023 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ కేంద్రానికి రూ.87,416 కోట్ల మొత్తాన్ని అందించింది. బుధవారం ముంబైలో ఆర్బీఐ కేంద్రబోర్డు 608వ సమావేశం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస అధ్యక్షతన జరిగింది. దేశీయంగా, అంతర్జాతీయంగా ఆర్థిక రంగంలో నెలకొన్న పరిస్థితులను ఈ భేటీలో చర్చించారు. ఈ మేరకు ఆర్బీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. '2018-19 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో కొవిడ్ విజృంభణ, ఆర్థికరంగం కుదేలైన నేపథ్యంలో ఆర్బీఐ బ్యాలెన్స్‌షీట్‌లో కంటింజెన్సీ రిస్క్ బఫర్ (సీఆర్‌బీ)ను 5.5 శాతం వద్ద కొనసాగించాలని బోర్డు నిర్ణయించింది. 2023లో ఆర్థికవృద్ధి పునరుద్ధరణ మొదలవటంతో సీఆర్‌బీని 6 శాతానికి పెంచాం. 2024 ఆర్థిక సంవత్సరానికి దీనిని మరింత పెంచుతూ 6.5 శాతంగా బోర్డు నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే కేంద్రప్రభుత్వానికి రూ.2,10,874 కోట్ల మిగులును బదిలీ చేయాలనే నిర్ణయానికి బోర్డు ఆమోదం తెలిపింది' అని ఆర్బీఐ పేర్కొంది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ (2024-25)లో ఆర్బీఐ, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రూ.1.02 లక్షల కోట్ల డివిడెండ్ రావచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ, దీనికి రెట్టింపుకన్నా అధికంగా డివిడెండ్‌ను ఆర్బీఐ ప్రకటించటం విశేషం. ఆర్బీఐ డివిడెండ్‌తో కేంద్రం వద్ద అందుబాటులో ఉండే ఆర్థిక వనరులు బలోపేతం కావటమేగాక బడ్జెట్ లోటును పూడ్చుకోవటానికి కూడా ఇది దోహదం చేస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును రూ.17.34 లక్షల కోట్లకు (జీడీపీలో 5.1 శాతానికి) తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది.

## లోక్‌సభ బరిలో 8,360 మంది

» 1996 తర్వాత ఇదే అత్యధికం: ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 8,360 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. 1996లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికంగా 13,952 మంది పోటీ చేశారని, అభ్యర్థుల సంఖ్య పరంగా ఈ లోక్‌సభ ఎన్నికలు రెండో స్థానంలో నిలిచాయని తెలిపింది. ఈసారి పోటీ చేసినవారిలో మహిళలు 797మంది ఉన్నారని, మొత్తం అభ్యర్థుల్లో మహిళలు 9.5శాతమని పేర్కొంది. మరోవైపు, 8,360 మందిలో 8,337మంది అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ విశ్లేషించింది. తొలి ఆరు దశల్లో బరిలో ఉన్నవారిపైన కేసులు, వారి ఆస్తుల వివరాలను ఇప్పటికే వెల్లడించిన ఏడీఆర్.. బుధవారం ఏడో దశలోని అభ్యర్థుల అఫిడవిట్లపై విశ్లేషణను వెల్లడించింది. ఏడో దశలో 904మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపింది. వీరిలో 95మంది(11%) మహిళలు. ఏడీఆర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ దశలో బరిలో ఉన్నవారిలో 199మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 299 మంది కోటీశ్వరులున్నారు. ఏడో ఈ దశలో దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 57 స్థానాలకు.. బిహార్(8), హిమచల్‌ప్రదేశ్(4), ఝార్ఖండ్(3), ఒడిశా(6), పంజాబ్(13), యూపీ(13), పశ్చిమ బెంగాల్(9), చండీగఢ్(1) పోలింగ్ జరగనుంది.

## బీజేపీకి 295 నుంచి 315 సీట్లు

» అమెరికా రాజనీతి శాస్త్రవేత్త బ్రెమర్ విశ్లేషణ

న్యూఢిల్లీ, మే 22: భారత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ వరుసగా మూడోసారి కూడా విజయం సాధించనుందని అమెరికా రాజనీతి శాస్త్రవేత్త ఇయాన్ బ్రెమర్ తెలిపారు. 295 నుంచి 315 స్థానాల వరకు గెలుచుకుంటుందన్నారు. భారత ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికం, స్వేచ్ఛాయుతం, పారదర్శకంగా ఉందని ప్రశంసించారు. అద్భుత ఆర్థికాభివృద్ధి కారణంగా ప్రధాని మోదీ సారథ్యంలో బీజేపీ హ్యాట్రిక్ గెలుపు అందుకోనుందని తెలిపారు. బ్రెమర్.. రిస్క్-రీసెర్చ్ కన్సల్టింగ్ సంస్థ అయిన యూరేసియా గ్రూపు వ్యవస్థాపకుడు. ప్రపంచ రాజకీయ దృక్కోణంలో భారతీయ సార్వత్రిక ఎన్నికలు మాత్రమే స్థిరత్వం కలిగినవని.. అమెరికా సహా ఇతర దేశాల ఎన్నికలు సమస్యాత్మకమైనవని ఆయన పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్, యూకే సహా ప్రపంచంలోని అన్ని ఎన్నికల్లోకెల్లా.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో మాత్రమే ఎన్నికల తర్వాత సజావుగా అధికార మార్పిడి జరుగుతుందని తెలిపారు.

## హేమంత్ సోరెన్‌కు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ, మే 22: భూకుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఈడీ కస్టడీలో ఉన్న జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను సుప్రీంకోర్టు మందలించింది. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చినట్లుగానే తనకు ఇవ్వాలని సోరెన్ కోరగా.. కోర్టు తోసిపుచ్చింది. ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని దాయడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీ క్లయింట్ ప్రవర్తనేమి మచ్చ లేనిది కాదు. అతడు నిజాయతీతో వస్తారని ఆశించాం. కానీ మీరు వాస్తవాలను దాచారు' అంటూ సోరెన్ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌కు తెలిపింది. కేజ్రీవాల్ కేసు.. సోరెన్ కేసు వ్యత్యాసాన్ని కోర్టు ప్రస్తావించింది. కేసులో కేజ్రీవాల్‌పై ఎలాంటి న్యాయపరమైన ఆదేశాలు రాలేదని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే సోరెన్ పిటిషన్‌ను కోర్టు కొట్టేస్తామనగా.. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు సిబల్ అనుమతి కోరారు.

## తీవ్ర ఒత్తిడిలో న్యాయవ్యవస్థ: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 22: దేశంలో న్యాయవ్యవస్థ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. ఈ విషయం దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు. జూన్ 4 తరువాత ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, న్యాయవ్యవస్థపై ఒత్తిడిని తొలగించి.. స్వేచ్ఛగా పనిచేసేలా చూస్తుందని చెప్పారు. దాంతో తనపై పెట్టిన బోగస్ కేసులనూ కొట్టేస్తారని, జూన్ 5న తాను జైలు నుంచి విడుదలవుతానని అన్నారు. లిక్కర్ స్కాం కేసులో అరెస్టయి.. బెయిల్‌పై విడుదలైన కేజ్రీవాల్ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. బుధవారం పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# అయోధ్యపై బుల్డోజర్ అబద్ధం

## 55 ఏళ్లు పాలించినా ఏ ఒక్కరి మంగళసూత్రం మేం లాక్కోలేదు

» ప్రధాని మోదీవి పచ్చి అబద్ధాలు

» ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ మే 22: ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అయోధ్యలోని రామ మందిరంపైకి బుల్డోజర్‌ను పంపిస్తుందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఈ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్లు పాలించిందని.. ఏనాడూ ఏ ఒక్కరి మంగళసూత్రాన్నీ లాగేసుకోలేదని ఖర్గే పీటీఐ ఇంటర్వ్యూలో అన్నారు. ఎవరి విశ్వాసాలకూ తాము అడ్డు చెప్పలేదన్నారు. ఇవన్నీ తెలిసి కూడా ప్రధాని మోదీ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. "మా పార్టీ నేతలు ఎన్నడూ ఇంత బరితెగించి మాట్లాడలేదు" అని ఖర్గే అన్నారు. పేదలు ఏ మతంలో ఉన్నా వారికి సాయం చేయడం 'బుజ్జగింపు' కాబోదని చెప్పారు. బీజేపీ, మోదీలు ప్రజల మధ్య విభజన సృష్టించి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నాయని, ఓట్ల కోసమే వారు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. యూపీఏ హయాంలో తీసుకువచ్చిన పథకాలతో పేదలకు తమ పార్టీ మేలు చేసిందని, కానీ, దీనిపై కూడా బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. గతంలో తమ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకం సహా అనేక పథకాలను తప్పుబట్టిన బీజేపీ.. ఇప్పుడు వాటిని తన ఘనతగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. "మేం ఏం చేసినా.. దానిని బుజ్జగింపుగా బీజేపీ ప్రచారం చేస్తోంది. కానీ, నా ఉద్దేశంలో బీజేపీనే బుజ్జగింపు రాజకీయాలు చేస్తోంది" అని అన్నారు. తమిళనాడు మాదిరిగా 69% రిజర్వేషన్లు పెంచాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఇవి పేదలకేనని. దీనిని కూడా బీజేపీ వ్యతిరేక కోణంలో ప్రచారం చేస్తోందన్నారు.

### అందుకే కులగణన

కులగణనను ఖర్గే సమర్థించారు. గతంలో నిరాదరణకు గురైన కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే కులగణన చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఎవరి హక్కులనూ కాలరాయబోమని స్పష్టం చేశారు. కానీ, బీజేపీ మాత్రం ప్రతి విషయాన్నీ వక్రీకరించే పనిలో ఉందన్నారు. భూసంస్కరణలు తెచ్చినప్పుడు, బ్యాంకులను జాతీయం చేసినప్పుడు కూడా యాగీ చేసిందని దుయ్యబట్టారు. బీజేపీ నేతలకు ఫ్యూడల్ మనస్తత్వం ఉందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు తాము కట్టుబడి ఉంటామని, కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లలో చేసి చూపుతున్నామని ఖర్గే చెప్పారు. పేదలకు తాము రూ.లక్ష ఇస్తామని చెబుతున్నామని.. ఇది వారి ఆర్థిక స్వావలంబనను పెంచుతుందన్నారు. ధనిక వర్గాలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన బీజేపీ.. ప్రజలకు రూ.లక్ష ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. "తాను లేకపోతే.. అంతా నాశనం అయిపోతుందని మోదీ అంటున్నారు. కానీ, ఎన్డీయే హయాంలో ఏం జరిగింది? దేశంపై రూ.155 లక్షల కోట్ల అప్పుల భారం పడింది. కాంగ్రెస్ హయాంలో ఈ అప్పు రూ.55 లక్షల కోట్లేనన్న విషయాన్ని వారు మరిచిపోతున్నారు. వారు చేసిన తప్పులు మరిచిపోతూ.. మాపై నిందలు మోపుతున్నారు" అని ఖర్గే వ్యాఖ్యానించారు. మరోవైపు, రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కంకణం కట్టుకొందని ప్రియాంకగాంధీ ఆరోపించారు. ఝార్ఖండ్‌లోని గొడ్డాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

### 'అగ్నివీర్'ను చెత్తబుట్టలో పడేస్తాం : రాహుల్ గాంధీ

మహేంద్రగఢ్(హరియాణా) మే 22: ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని పూర్తిగా రద్దుచేసి చెత్తబుట్టలో పడేస్తామని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. బుధవారం హరియాణాలో ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. 'భారత జవాన్లను ప్రధాని మోదీ కూలీలుగా మార్చారు. ఇది ఆర్మీ పథకం కాదు... మోదీ పథకం. దీన్ని పీఎంవో రూపొందించింది' అని ఆయన పేర్కొన్నారు. '22మంది అగ్ర పారిశ్రామికవేత్తలకు రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన మోదీ ప్రభుత్వం... రైతుల రుణాలను మాత్రం మాఫీ చేయబోమని బహిరంగంగానే చెబుతోంది. రైతుల రక్షణ కోసం, వారికి తగిన పరిహారం దక్కేవిధంగా మేం తీసుకొచ్చిన భూ సేకరణ బిల్లును రద్దు చేశారు" అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 4న తాము అధికారంలోకి రాగానే రైతుల రుణాలు మాఫీ చేస్తామని, దీనికి సంబంధించి కర్జా మాఫీ (రుణ మాఫీ) కమిషన్‌ను తీసుకొస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

## హద్దు దాటొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. ఎన్నికల ప్రక్రియ తాత్కాలికమని.. ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు వస్తాయి, పోతాయని.. కానీ ప్రసంగాల ప్రభావం ఎక్కువ కాలం ఉండే ప్రమాదం ఉందని కేంద్ర ఎన్నికల సంఘం ఆందోళన వెలిబుచ్చింది. సమాజంలో విభజనకు దారితీసే ప్రసంగాలు ఆపాలని బీజేపీకి స్పష్టం చేసింది. మతపరమైనర ప్రచారం చేయకుండా తమ స్టార్ క్యాంపెయినర్లను నియంత్రించాలని ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు రాసిన లేఖలో సూచించింది. ముస్లిం లీగ్, శక్తి వంటి పదాల వినియోగంపై ఈసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రచారంలో ప్రసంగాలు చేసేటప్పుడు అధికార పార్టీగా ఎంతో బాధ్యతతో వ్యవహరించాలని తెలిపింది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకీ ఎటువంటి మినహాయింపులు ఉండవని, అంతే జాగ్రత్తగా వ్యవహరించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉన్నదని స్పష్టం చేసింది. భారత రాజ్యాంగం రద్దవుతుందని ప్రజలను తప్పుదారి పట్టించే ప్రకటనలు చేయొద్దని కాంగ్రెస్‌కు సూచించింది. తాము అధికారంలోకి వస్తే 'అగ్నివీర్' పథకాన్ని రద్దు చేస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించిన నేపథ్యంలో.. రక్షణ దళాలను రాజకీయాల్లోకి లాగొద్దని హెచ్చరించింది. ఎన్నికల ప్రచారంలో పార్టీలన్నీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడం తప్పని.. ఎన్నికల వ్యవస్థపై ఓటర్ల విశ్వాసాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే సహించబోమని హెచ్చరించింది. కాగా.. తమ రెండు పార్టీల నేతలూ చేసిన వ్యాఖ్యలను ఈసీ ఒకే గాటన కట్టేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. అధికారంలో ఉన్న పార్టీ పట్ల ఎన్నికల కమిషన్ అనుచిత వినయాన్ని ప్రదర్శించిందని ఆ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ మండిపడ్డారు.

## పాక్‌కు.. రాహుల్, అఖిలేశ్ జై

» కూటమి గెలిస్తే రాముడు మళ్లీ గుడారాల్లోకే

» యూపీ ప్రచార సభల్లో ప్రధాని మోదీ ఫైర్

లఖ్‌నవూ, మే 22: కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తున్నాయని, ఆ దేశం వద్ద ఉన్న అణుబాంబును చూపించి భారత్‌ను భయపెడుతున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. యూపీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మోదీ రాహుల్, అఖిలేశ్‌పై విరుచుకుపడ్డారు. "వారిద్దరూ 2017లో కలిసి యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఒకసారి ఫ్లాప్ అయిన 'ఇద్దరు రాకుమారులు' సినిమాను తిరిగి తెరపైకి తీసుకురావడం నాకు ఆశ్చర్యం కలిగించింది" అని వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి యూపీలో 79 సీట్లు గెలవనున్నదన్న అఖిలేశ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నిద్రపోతున్న కూటమి నేతల మత్తును జూన్ 4న యూపీ ప్రజలు వదిలిస్తారని ఎద్దేవా చేశారు. సోనియా ఏఐసీసీ అధ్యక్షురాలు అయినప్పుడు... అప్పటిదాకా ఆ స్థానంలో ఉన్న బీసీ నేత సీతారాం కేసరిని ఆ రోజంతా బాత్రూమ్‌లో బంధించారని, రాజ్యాంగాన్ని రద్దుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లపాటు ఎమర్జెన్సీని విధించిందని మోదీ విమర్శించారు. ఇండియా కూటమిని గెలిపిస్తే రాహుల్, అఖిలేశ్ అయోధ్య రాముడిని తిరిగి గుడారాల కిందకు చేరుస్తారని మోదీ ఆరోపించారు.

## బెంగాల్లో ఓబీసీ సర్టిఫికెట్ల రద్దు

### 2010 నుంచి జారీ చేసినవి చెల్లవన్న కలకత్తా హైకోర్టు

కోల్‌కతా, మే 22: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ సర్కారు జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2010 తర్వాత రూపొందించిన ఓబీసీ జాబితా పూర్తిగా 'చట్టవిరుద్ధం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. పశ్చిమబెంగాల్ బీసీ కమిషన్ సారథ్యంలో 'వెస్ట్ బెంగాల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ యాక్ట్-1993 ప్రకారం కొత్తగా ఓబీసీల జాబితా రూపొందించాలని నిర్దేశించింది. రాష్ట్రంలో 1993 నాటి చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఓబీసీల జాబితా రూపొందించారని.. దానివల్ల అసలు ఓబీసీలకు అన్యాయం జరిగిందంటూ 2011లో కలకత్తా హైకోర్టులో పిల్ దాఖలైంది. ఆ వ్యాజ్యాన్ని విచారించి కోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో పద్నాలుగేళ్లుగా అక్కడ జారీ అయిన ఓబీసీ సర్టిఫికెట్లన్నీ రద్దయినట్టయింది. అయితే.. ఈ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగాలు పొంది ఇప్పటికే సర్వీసుల్లో ఉన్న వారికి, ఆ రిజర్వేషన్ కారణంగా ప్రయోజనం పొందిన వారికి, ఇప్పటికే ఏదైనా ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించి ఎంపిక ప్రక్రియలో ప్రాసెస్‌లో ఉన్నవారికి తాజా ఉత్తర్వులు వర్తించవని కోర్టు స్పష్టం చేసింది. కాగా కోల్‌కతా హైకోర్టు తీరును ప్రభుత్వం అంగీకరించే ప్రసక్తే లేదని పశ్చిమ బెంగాల్ సీఎం మమత పేర్కొన్నారు. రాష్ట్రంలో ఓబీసీ రిజర్వేషన్ల కోటా కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

## బయోమెట్రిక్ ఉంటేనే కొత్త సిమ్‌కార్డ్

### సెప్టెంబరు నుంచి కొత్త టెలికాం నిబంధనలు



న్యూఢిల్లీ, మే 22: టెలికాం రంగంలో కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023లో తీసుకొచ్చిన నిబంధనలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్) త్వరలో అమలు చేయనుంది. ఈ విషయంపై డాట్‌కు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) గతంలో సిఫార్సు చేసింది. ఈ మార్పులు లోక్‌సభ ఎన్నికల తర్వాత అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం. నకిలీ సిమ్ కార్డ్‌లతో సైబర్ మోసాలు విజృంభిస్తున్న తరుణంలో వీటిని నిరోధించడానికి కొత్త మార్గదర్శకాలు ఉపయోగపడనున్నాయి. దీని ప్రకారం... కొత్త కనెక్షన్‌ను అందించాలంటే బయోమెట్రిక్ గుర్తింపు తప్పనిసరి. అటువంటి సున్నితమైన సమాచారాన్ని సేకరించడంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా టెలికాం కంపెనీలకు స్పష్టమైన మార్గదర్శకాలు డాట్ జారీ చేయనుంది. వీటితో పాటు స్పెక్ట్రమ్ కేటాయింపులు, శాటిలైట్ కమ్యూనికేషన్‌కు సంబంధించిన నిబంధనలు తీసుకురానున్నారు. దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించాలంటే.. సదరు కంపెనీలు ప్రభుత్వం నుంచి స్పెక్ట్రమ్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. టెలికమ్యూనికేషన్స్ చట్టంలోని వివిధ సెక్షన్‌లలో పేర్కొన్న నిబంధనలను సెప్టెంబరు 15 నాటికి అమల్లోకి తీసుకురావాలని డాట్ లక్ష్యంగా పెట్టుకుంది. టెలికాం రంగంలో నియమ, నిబంధనలకు సంబంధించి చాలా ఏళ్లుగా కొనసాగుతున్న ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం, ఇండియన్ వైర్‌లెస్ టెలిగ్రాఫ్ చట్టం, టెలిగ్రాఫ్ వైర్స్ చట్టం స్థానంలో కేంద్రప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చింది. భారత పార్లమెంటు 2023 డిసెంబర్ 20న టెలికమ్యూనికేషన్స్ బిల్లు- 2023 (టెలికాం యాక్ట్- 2023)ని ఆమోదించింది.

## పుణె టీనేజర్ బెయిల్ రద్దు

» జూన్ 5 వరకు రిమాండ్ హోమ్‌కు

» అతడి తండ్రికి పోలీసు కస్టడీ

» రిజిస్ట్రేషన్ లేని పోర్షె కారు, రూ.1758 చెల్లిస్తే పూర్తి

పుణె, మే 22: మద్యం మత్తులో పోర్షె కారును వేగంగా నడిపి ఇద్దరు ఐటీ ప్రొఫెషనల్స్ మరణానికి కారకుడైన టీనేజర్‌కు ఇచ్చిన బెయిల్‌ను పుణె జువైనల్ జస్టిస్ బోర్డు రద్దు చేసి జూన్ 5 వరకు రిమాండ్ హోమ్‌కు పంపింది. అయితే అతడిని వయోజనుడిగా భావించి విచారించాలన్న అంశంపై నిర్ణయం ప్రకటించలేదు. అతడికి బెయిల్ ఇచ్చి రోడ్డు ప్రమాదాలపై వ్యాసం రాయమనడంపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయిన మూడు రోజుల తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. కాగా టీనేజర్ తండ్రికి పుణె సెషన్స్ కోర్టు బుధవారం రెండు రోజుల పోలీసు కస్టడీ విధించింది. పోలీసులను తప్పించుకొనేందుకు ఛత్రపతి శంభాజీనగర్ వెళ్లిన అతడిని అక్కడే మంగళవారం అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. ప్రమాదానికి కారకుడైన టీనేజ్ బాలుడికి(17 ఏళ్ల 8 నెలలు) డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు ఇంకా నాలుగు నెలల వయస్సు తక్కువ ఉండగా మహారాష్ట్ర చట్టాల ప్రకారం మద్యం తాగేందుకు మరో ఏడేళ్లు ఆగాల్సిందే. పోలీసులు ఇతడి తండ్రిపై జువైనల్ జస్టిస్ చట్టం సెక్షన్ 75(ఉద్దేశపూర్వకంగా బాలుణ్ని నిర్లక్ష్యం చేయడం, మానసిక, భౌతిక అనారోగ్యం కలిగే పరిస్థితులు కల్పించడం), సెక్షన్ 77(మద్యం లేదా డ్రగ్స్ అందుబాటులోకి తేవడం) కింద కేసులు నమోదు చేశారు. టీనేజర్ తండ్రి సాక్ష్యాధారాలను దాచేందుకే ఛత్రపతి శంభాజీనగర్ వెళ్లాడని పోలీసులు కోర్టులో పేర్కొన్నారు. కారుకి నెంబరు ప్లేట్ లేదు... కారు దస్తావేజులను, టీనేజర్‌కి ఇచ్చిన డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలను పరిశీలించాల్సి ఉందని తెలిపారు. కాగా నెంబరు ప్లేట్ లేకుండానే పోర్షె కారును కొన్ని నెలలుగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రూ.1,758 ఫీజు చెల్లించనందున ఈ రూ.2.5 కోట్ల లగ్జరీ స్పోర్ట్స్ పోర్షె టేకాన్ కారు రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంచినట్లు అధికారులు తెలిపారు. బెంగళూరుకు చెందిన ఓ డీలర్ ఈ ఎలక్ట్రిక్ పోర్షె కారును మార్చిలో దిగుమతి చేసుకున్నట్లు మహారాష్ట్ర రవాణా కమిషనర్ వివేక్ భిమన్‌వార్ చెప్పారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్ మీద మహారాష్ట్ర పంపినట్లు తెలిపారు. తగిన ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలని యజమానికి చెప్పినట్లు వెల్లడించారు. అయితే తర్వాత ఆ ప్రక్రియ పూర్తిచేయడానికి కారును ఆర్టీవో కార్యాలయానికి తీసుకురాలేదన్నారు. మహారాష్ట్రలో ఎలక్ట్రిక్ వాహనాలకు రోడ్డు పన్ను మినహాయించినందున ఈ కారు రిజిస్ట్రేషన్‌కు రూ.1,758 చెల్లిస్తే చాలు. కాగా టీనేజర్ తండ్రిని కోర్టుకు తీసుకువస్తున్న పోలీసు వ్యాన్‌పై సెషన్స్ కోర్టు బయట వందే మాతరం సంఘటన అనే సంస్థకు చెందిన 8 మంది వ్యక్తులు ఇంకు చిమ్మారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

## పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నాం

» నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ కీలక ప్రకటన

టెల్ అవీవ్(ఇజ్రాయెల్), మే 22: ఇజ్రాయెల్- హమాస్ మధ్య తీవ్ర పోరు కొనసాగుతోన్న వేళ ఐరోపాలోని నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దేశాలు కీలక ప్రకటన చేశాయి. పాలస్తీనాను తాము ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్టు ప్రకటించాయి. పాలస్తీనా ప్రత్యేక దేశంగా ఉంటేనే ఆ ప్రాంతంలో శాంతిస్థాపన సాధ్యమని అభిప్రాయపడ్డాయి. నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ చేసిన ప్రకటనను ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. తమ నిరసనను తెలియజేసేందుకు ఆ దేశాల్లోని తమ రాయబారులను స్వదేశానికి రప్పించింది.

## వైద్యం కోసం భారత్‌కు వచ్చిన బంగ్లా ఎంపీ హత్య

ఢాకా, మే 22: వైద్య చికిత్స కోసం భారత్‌కు వచ్చిన ఓ బంగ్లాదేశ్ ఎంపీ బుధవారం హత్యకు గురయ్యారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌కు చెందిన ఎంపీ అన్వరుల్ అజీమ్ అనార్ ఈ నెల 12న వైద్య సాయం కోసం కోల్‌కతాకు వచ్చారు. మే 18 నుంచి ఆయన అదృశ్యం అయ్యారని కేసు నమోదయింది. ఈ క్రమంలోనే తాజాగా అన్వరుల్ మృతదేహాన్ని కోల్‌కతాలోని ఓ ఫ్లాట్‌లో పోలీసులు గుర్తించారు. పథకం ప్రకారం ఎంపీని హత్య చేశారని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

## నవ భారతం ప్రమాదకరమైంది.. యూఎన్‌లో పాక్

న్యూయార్క్, మే 22: భారత్‌లో ప్రధాని మోదీ చెప్తున్న నవ భారతం ప్రమాదకరమైనదని ఐక్యరాజ్యసమితిలో పాక్ శాశ్వత ప్రతినిధి మునీర్ అక్రమ్ అన్నారు. కొద్ది రోజుల క్రితం యూఎన్ జనరల్ అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. భారత్ పాకిస్థాన్‌లో పలువురిని టార్గెట్ చేసుకొని చంపుతోందని, ఇది కెనడాకు విస్తరించిందని.. అమెరికా, ఇతర దేశాల్లోనూ ఇలాంటి ప్రయత్నాలు జరిగాయని అన్నారు. "ఇది నవ భారతం. మీ దేశానికి వచ్చి మరీ హతమారుస్తుంది" అంటూ మోదీ ఇటీవల ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు.

## అమెరికా వీసా..5 నిమిషాల్లో 10వేల స్లాట్లు ఖతం

హైదరాబాద్, మే 22: అమెరికా స్టూడెంట్ వీసాకు ఆదివారం అర్ధరాత్రి దాటాక స్లాట్లను విడుదల చేయగా.. కేవలం 5 నిమిషాల్లోనే 10వేల స్లాట్లు బుక్కయిపోయాయి. సోమవారం నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. కానీ, వేల మంది విద్యార్థులకు వీసా ఫీజు(రూ.15,530) చెల్లించినా.. దరఖాస్తులు పూర్తవ్వలేదు. సాంకేతిక సమస్యలు ఎదరయ్యాయేమోనని విద్యార్థులు పదేపదే ప్రయత్నించినా.. ఫలితం దక్కలేదు. కొందరికైతే 'లిమిట్ రీచ్డ్' అనే సందేశం రావడం.. మరికొందరు ఫీజు చెల్లించాక 'లాక్డ్' కేటగిరీలో చూపడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అమెరికాలోని అధికారులకు మెయిల్ పెట్టి ఎంతో కష్టపడి అన్‌లాక్ చేయించుకున్నా.. తిరిగి 'లాక్డ్' కేటగిరీకి వెళ్తోందని వాపోతున్నారు.

# యుద్ధం ముగిసేదాకా జెలెన్‌స్కీనే!

» ఉక్రెయిన్ అధ్యక్షుడిగా మూడ్రోజుల క్రితమే పదవీకాలం పూర్తి.. అయినా కొనసాగింపు

» మార్చిలో జరగాల్సిన అధ్యక్ష ఎన్నిక వాయిదా

» మార్షల్ లా ముగిసేదాకా ఎన్నికల్లేనట్లే

రష్యాతో యుద్ధం ముగిసేదాకా ఉక్రెయిన్ అధ్యక్షుడిగా వొలోదిమిర్ జెలెన్‌స్కీ కొనసాగే సూచనలు కొనసాగుతున్నాయి. టీవీ సీరియల్ కమెడియన్‌గా ఉక్రెయిన్ ప్రజలకు సుపరిచితుడైన జెలెన్‌స్కీ.. 2019 మే 20న అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఆయన ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 20తోనే ముగిసింది. ఉక్రెయిన్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడి పదవీకాలం ముగియడానికి 45 రోజుల ముందే ఎన్నికలు జరగాలి. అంటే.. ఈ ఏడాది మార్చి 31న ఎన్నికలు జరగాల్సింది. కానీ, 2022 ఫిబ్రవరి 24 ప్రారంభమైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ భీకరంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు జరిగే సూచనలు కనిపించడం లేదు. దీంతో.. తానే అధ్యక్షుడిగా కొనసాగుతానని జెలెన్‌స్కీ సోమవారం రాయిటర్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "సైనికులు యుద్ధంలో ఉన్నారు. విదేశాల్లో 70 లక్షల మంది దాకా ఉక్రెయినియన్లు ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. అందుకే ఎన్నికలను వాయిదా వేస్తున్నాం" అని వివరించారు. ఉక్రెయిన్ రాజ్యాంగం ప్రకారం సైనిక చట్టం(మార్షల్ లా) అమలులో ఉన్నప్పుడు ఎన్నికలు జరగడానికి వీలు లేదు. రష్యాతో యుద్ధం ముగిసేదాకా ఉక్రెయిన్‌లో మార్షల్ లా కొనసాగే అవకాశాలున్నాయి. అంతేకాకుండా.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 540 కోట్ల ఉక్రెయిన్ కరెన్సీ(రూ.1,129 కోట్లు) అవసరం అవుతుందని సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ అంచనా వేసింది. "దేశంలో అన్ని ప్రాంతాల్లో పరిస్థితులు ప్రశాంతంగా లేవు. కొన్ని ప్రాంతాల్లోనే ఎన్నికలు నిర్వహించడం సబబు కాదు. పైగా, బాంబింగ్, షెల్లింగ్ మధ్య పోలింగ్ కేంద్రాల ఏర్పాటు సాధ్యం కాదు" అని తేల్చిచెప్పింది. అయితే.. ఇలాంటి క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పుడు.. ఎన్నికల నిర్వహణ సాధ్యం కాకపోతే.. అధ్యక్ష బాధ్యతలు ఎవరు చేపట్టాలనేదానిపై రాజ్యాంగం స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. దీంతో.. తానే అధ్యక్షుడిగా కొనసాగడం సరైందేనని జెలెన్‌స్కీ చెబుతున్నారు. పైగా విపక్ష పార్టీల నేతలు కూడా ఇందుకు అంగీకారం తెలుపుతూ సంతకాలు చేసినట్లు వివరించారు. ఈ నెల 14న కీవ్ నగరంలో పర్యటించిన అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ కూడా యుద్ధం సద్దుమణిగేదాకా ఎన్నికలను నిర్వహించకపోవడం మంచిదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### జెలెన్‌స్కీకే ప్రజల మద్దతు

గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన ఓ సర్వేలో.. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే, 80శాతానికి పైగా పౌరులు జెలెన్‌స్కీకే జైకొట్టినట్లు తేలింది. అప్పట్లో జెలెన్‌స్కీకి జైకొట్టినవారంతా యుద్ధం తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సెంటర్ ఫర్ అనాలసిస్ అండ్ సోషలాజికల్ రిసెర్చ్ నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో మాత్రం 67% మంది మాత్రమే జెలెన్‌స్కీకి జైకొట్టారు. అంటే.. క్రమంగా జెలెన్‌స్కీ ప్రభ మసకబారుతోందని స్పష్టమవుతోంది.



### నాటో ఆదుకోవాలి.. యుద్ధాన్ని ఆపాలి: జెలెన్‌స్కీ

రష్యా యుద్ధాన్ని ఆపేందుకు నాటో తమను ఆదుకోవాలని జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు ఆయుధాలను సరఫరా చేయాలని ఇటలీ మీడియా సంస్థ రాయ్-1కు ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా కోరారు. తమ దేశంపై జరుగుతున్న క్షిపణిదాడులను అడ్డుకునేందుకు నాటో దేశాలు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల వాషింగ్టన్‌లో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశాల్లో త్వరలో ఉక్రెయిన్‌కు సభ్యత్వాన్ని ఖరారు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నాటో చొరవతోనే ఈ యుద్ధానికి ముగింపు ఉంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

- సెంట్రల్ డెస్క్

## లోకం తీరు



## చెయ్యి గుర్తుకు ఓటు వేయమని..
# మొండి చెయ్యి చూపింది

- కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంట కొనడం లేదు
- ఇచ్చిన మాట ప్రకారం అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, మే 22 : రైతులు పండించిన అన్ని పంటలకు రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ మాటలు చెప్పిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బోనస్ ఇస్తామని ఆశ చూపి రైతుల్ని చెయ్యి గుర్తుకు ఓటు వేయమని.. మొండి చెయ్యి చూపిందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, నిర్వాహకులను కొనుగోలు కేంద్రంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం తడిసిన వడ్లను కొనుగోలు చేస్తున్నామని చెబుతుందని, అందుకు బాధ్యత కలెక్టర్లదేనని కేబినెట్‌లో నిర్ణయాలు ప్రకటిస్తున్నారన్నారు. హైదరాబాదులో మాటలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పంట కొనే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి, ఓట్లు డబ్బాలో పడ్డాక సన్న రకాలకే ఇస్తామని ప్రభుత్వం చెబుతుందన్నారు. సన్న రకాలకు రోగాలు ఎక్కువ, పెట్టుబడి ఖర్చు ఎక్కువ, పంట కాల పరిమితి ఎక్కువ, దిగుబడి తక్కువ అని రైతులు అంటున్నారని మాజీమంత్రి తెలిపారు. దొడ్డు రకాలే పండుతాయని చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో జనుము, జీలుగ విత్తనాలు ఎక్కడా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎరువుల బస్తాల కోసం రైతులు చెప్పులు లైన్‌లో పెట్టారని.. మళ్లీ ఇప్పుడు పచ్చిరొట్ట విత్తనాల కోసం పాస్ బుక్‌లు లైన్‌లో పెట్టి రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే జూన్ నెలలోనే ఎకరాకు రూ. 7,500 పెట్టుబడి సాయం(రైతు భరోసా) రైతుల ఖతాలో వేయాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని, పచ్చి రొట్ట విత్తనాలను అన్ని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో, ప్యాక్స్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనేది తెలుసుకోవడానికి మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలన్నారు.

## పాలు, పూలు అమ్ముడే కాదు...
# మల్లారెడ్డి భూ కబ్జాలూ చేస్తుండు

- ఆయన పేరే కబ్జాల మల్లారెడ్డి.. మా భూమి మాకు ఇప్పించండి
- మీడియా ఎదుట మాజీ మంత్రి బాధితుడి డిమాండ్

పంజాగుట్ట, మే 22 (ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి మల్లారెడ్డి పాలు, పూలు అమ్ముడే కాదు.. భూ కబ్జాలు కూడా చేస్తుండు. ఆయన పేరే భూ కబ్జాల మల్లారెడ్డి. ఆయన కబ్జా చేసిన మా భూమిని మాకు ఇప్పించాలి. మల్లారెడ్డి తన తప్పు ఒప్పుకుని మాకు క్షమాపణ చెప్పి, పదవికి రాజీనామా చేయాలి' అని బాధితుడు సేరి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సుచిత్ర చౌరస్తాలోని స్థల యజమాని అయిన సేరి శ్రీనివాస్ రెడ్డి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 'బీఆర్ఎస్ పార్టీలో చేరినప్పటి నుంచే మా భూమిపై మల్లారెడ్డి కన్ను పడింది. తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని మా స్థలాన్ని కబ్జా చేశాడు. పోలీసుల సమక్షంలోనే మమ్మల్ని బండబూతులు తిడుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. మమ్మల్ని చంపేస్తానని బెదిరించాడు. మాకు రక్షణ కల్పించాలి' అని డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ మండలం సుచిత్ర చౌరస్తా ప్రాంతంలో జీడిమెట్లలోని సర్వే నం. 82,83లలో 33 గుంటల భూమిని తాను మహమ్మద్ బషీర్, రాకేష్ తదితరుల నుంచి కొనుగోలు చేశానని, 2012 నుంచే స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నానని చెప్పారు. ఈ భూమి పక్కనే ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఆయన తండ్రి మర్రి లక్ష్మారెడ్డి, ఇతర కుటుంబ సభ్యులకు 1.29 ఎకరాల భూమి ఉందని, 2016లో మల్లారెడ్డి బీఆర్ఎస్‌లో చేరి మంత్రి అయినప్పటి నుంచి ఆయన కన్ను పక్కనే ఉన్న తమ స్థలంపై పడిందని వారు వాపోయారు. ఇప్పటికి ఐదు సార్లు సర్వే జరగ్గా మల్లారెడ్డికి సర్వే నం.82/ఆ లో 1.29 ఎకరాల భూమి, తమకు సర్వే నం. 82/1/ఈఈలో 33 గుంటల భూమి ఉందని తేలిందన్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నా కూడా మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు, అనుచరులతో వచ్చి అధికారుల సమక్షంలోనే తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని, స్థలం చుట్టూ వేసిన బ్లూ షీట్స్ ధ్వంసం చేశారని అన్నారు.

# సంక్రాంతికి సన్నబువ్వ!

(మొదటి పేజీ తరువాయి)

విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. అంటే.. వచ్చే సంక్రాంతికి 'సర్కారు వారి సన్నబియ్యం' రేషన్ షాపుల్లో అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం బడిపిల్లల మధ్యాహ్న భోజనం, సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ సెంటర్లకే సన్నబియ్యం సరఫరా చేస్తుండగా.. పీడీఎస్ ద్వారా రేషన్ షాపులకు మాత్రం దొడ్డు బియ్యమే సరఫరా చేస్తున్నారు. రాష్ట్రంలో 90.23 లక్షల రేషన్ కార్డులున్నాయి. వీటితో 2.82 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. వీరికి నెలకు 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తుండగా.. ఏడాదికి 21 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతున్నాయి. పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి, సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు, అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నారులకు నెలకు 25వేల మెట్రిక్ టన్నుల చొప్పు న ఏడాదికి 3 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతున్నాయి. ఈ విధంగా మొత్తం కలిపి ప్రభుత్వం ఏడాదికి 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సర్దుబాటు చేయాల్సి వస్తోంది. ఇందుకు సుమారు 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నారు. పీడీఎస్ ద్వారా రాష్ట్రంలో పంపిణీ చేసే 21 లక్షల మెట్రిక్ టన్నుల్లో.. 13లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద కేంద్రం ఇస్తోంది. మిగిలిన 8లక్షల మెట్రిక్ టన్నులను రాష్ట్ర ప్రభుత్వం.. స్టేట్‌పూల్ కింద ప్రొక్యూర్మెంట్ చేస్తోంది. పాఠశాలలు,సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీ సెంటర్లకు సన్నబియ్యాన్ని టెండర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే సేకరిస్తోంది. ఇక మీదట మొత్తం 24 లక్షల మెట్రిక్ టన్నులు... సన్న బియ్యం పంపిణీ చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. పీడీఎస్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన నేపథ్యంలో అం దుకు అనుగుణంగా కసరత్తు ప్రారంభించింది. మరోవైపు, రాష్ట్రంలో బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం క్రయవిక్రయాలు 25 లక్షల నుంచి 30 లక్షల



మెట్రిక్ టన్నుల వరకు జరుగుతున్నాయి.

### సేకరణ ప్రభుత్వానికి సవాలే!

సన్నధాన్యం సేకరణ రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్‌గా మారనుంది. ఏడాది పాటు పీడీఎస్ అవసరాలకు సరిపోవాలంటే కనీసం 36-40 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కస్టమ్ మిల్లింగ్ చేయిస్తున్న బియ్యంలో దొడ్డు బియ్యం 98 శాతం కాగా సన్నబియ్యం 2 శాతం మాత్రమేనని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. కేవలం 2 శాతం ఉన్న సన్న బియ్యం మిల్లింగ్‌ను... ఇప్పుడు 24 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలంటే కత్తిమీద సామే అవుతుంది. పైగా రైతులు సన్నధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మటం అనేది మార్కెట్ పరిస్థితులను బట్టి ఉంటుంది. ఇప్పుడు కనీస మద్దతు ధర రూ.2,200 ఉండగా రూ.400-500 పెంచి ట్రేడర్లు, మిల్లర్లు, ఎగుమతిదారులు సన్నాలను కొనుగోలు చేస్తున్నారు. సూపర్ ఫైన్ వెరైటీలకు రూ. 2,800 పలికిన సందర్భాలూ ఉన్నాయి. అందుకే రైతులు దొడ్డు వడ్లు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో (పీపీసీల్లో) విక్రయించి... సన్నాలను మాత్రం ప్రైవేటు మార్కెట్లో అమ్ముతున్నారు. ప్రైవేటు ట్రేడర్లకు ధాన్యం విక్రయిస్తే డబ్బులు త్వరగా చేతికొస్తాయని, తేమ, తరుగు సమస్యలుండవనే అభిప్రాయం ఉంది. అటువంటప్పుడు ప్రైవేటు ట్రేడర్లను కాదని... రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నాలను తీసుకొస్తా రా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదే పరిస్థితి వస్తే ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుకునేందుకు ప్రభుత్వం సన్న బియ్యాన్ని ప్రైవే టు వ్యాపారుల నుంచి కొనుగోలు చేయాల్సి రావొ చ్చు.

### గత ప్రభుత్వ హయాంలో యత్నాలు

గత ప్రభుత్వ హయాంలోనూ పీడీఎస్ ద్వారా సన్నబియ్యం పంపిణీకి యత్నాలు జరిగాయి కానీ సక్సెస్ కాలేదు. దొడ్డురకాలు, సన్న రకాలు కలిపి ప్రొక్యూర్మెంట్ చేసి, మిల్లింగ్ చేయించి గోదాముల్లో నిల్వచేయగా కొన్ని లాట్లు సన్నబియ్యం వచ్చినపుడు పీడీఎస్‌లో వాటిని పంపిణీచేశారు. కానీ సన్నబియ్యానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. సన్నరకాలు సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ.100-150 బోనస్ ఇస్తామని నాటి సీఎం కేసీఆర్ ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

### సన్నాల సాగు విస్తీర్ణం, ఉత్పత్తిపై ఫోకస్

ఈ వానాకాలం సీజన్ నుంచి సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203 కనీస మద్దతు ధర ఉండగా... రూ.500 బోనస్ కలిపితే రూ. 2,703 అవుతుంది. సాధారణ రకాలకు కనీస మద్దతు ధర రూ.2,183 ఉండగా... రూ.500 బోనస్ కలిపితే రూ. 2,683 అవుతుంది. దొడ్డురకాలు సాగు చేస్తే ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి అవుతుంది. సన్నరకాల సాగుకు మరో రూ.5 వేలు ఖర్చు పెరుగుతుంది. అదీగాక దొడ్డు వడ్లు ఎకరానికి 28 క్వింటాళ్ల దిగుబడి వస్తే... సన్నధాన్యం 25 క్వింటాళ్లు మాత్రమే వస్తుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 బోనస్ ప్రకటించించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 39 లక్షల ఎకరాల్లో సన్నాలు, 26 లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు సాగవుతున్నాయి. ఈసారి బోనస్ ప్రకటించిన నేపథ్యంలో... సన్నాల సాగు పెరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అంచనా వేస్తున్నారు.

# మద్యం లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

- మద్యం బాటిళ్ల కోసం ఎగబడిన మందుబాబులు

బోయినపల్లి, మే22(ఆంధ్రజ్యోతి): మద్యం లోడ్‌తో వెళుతున్న ఓ డీసీఎం టైరు పగలడంతో అదుపుతప్పి మేడ్చల్ జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఉషారాణి పేరుతో ఉన్న శ్రీవైన్స్, బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-3, రోడ్డునెంబర్-10, పంజాగుట్టలోని వైన్స్ దుకాణాలకు ఐఎంఎల్ఎఫ్ లిక్కర్ డిపో కొంపల్లి నుండి ఓ డీసీఎం వాహనంలో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల విలువ చేసే మద్యం లోడు బయలుదేరింది. ఆ వాహనం బోయినపల్లిలోని ఎంఎంఆర్ గార్డెన్ లిక్కర్ మార్ట్ సమీపానికి చేరాక డీసీఎం వెనుక టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దాంతో వాహనం అదుపుతప్పి జాతీయరహదారిపై బోల్తా పడింది. మద్యం సీసాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దాంతో మందు బాబులు ఎగబడి అందినన్ని మద్యం సీసాలు తీసుకెళ్లారు.



బోయినపల్లి వద్ద బోల్తాపడిన మద్యం సీసాల వ్యాన్

## ఒకవైపు ఎండలు.. మరో వైపు వర్షాలు

- 10 జిల్లాల్లో 47డిగ్రీల దాకా చేరనున్న ఉష్ణోగ్రత

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు ఎండలు.. మరో వైపు వర్షాలు.. రాష్ట్రంలో మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో శుక్రవారం నుంచి ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని, ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కరీంనగర్, జగిత్యాల,పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మరోవైపు.. గురు, శుక్ర వారాల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మంగళవారం ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రా తీరానికి సమీపంలో అల్పపీడనం ఏర్పడినట్లు పేర్కొంది. ఇది శుక్రవారంనాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది. గతంతో పోలిస్తే నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని, జూన్ 1 కన్నా ముందే కేరళను తాకొచ్చని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఎస్సీ గురుకులాల్లో బదిలీలు చేపట్టండి

- ఎస్సీ గురుకుల టీచర్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్

హైదరాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకులాల్లో సాధారణ బదిలీలను చేపట్టాలని, జూన్‌లోనే ప్రక్రియను పూర్తిచేయాలని కోరుతూ ఎస్సీ గురుకుల టీచర్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్ బుధవారం శాఖా కార్యదర్శి సీతాలక్ష్మికి వినతిపత్రం అందించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ బకాయిలను కూడా విడుదల చేయాలని పేర్కొన్నారు. వీటితో పాటు.. ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ ఇంక్రిమెంట్‌లు, 2022 వేసవి సెలవుల్లో పనిచేసిన జూనియర్ లెక్చరర్లు, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవు(ఈఎల్)ల మంజూరు, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న సూపరింటెండెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి, వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగాల పదోన్నతుల కోసం ప్రమోషన్ చానల్ ఏర్పాటు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో వార్డెన్ల నియామకం వంటి పలు డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అన్ని విద్యాలయాల్లో పీజీటీ గణితం, హిందీ, జీవశాస్త్రం, ఫిజికల్ సైన్స్ పోస్టులను రెండు చొప్పున పునరుద్ధరించాలని కోరారు. కాగా, తాము విన్నవించిన సమస్యల పరిష్కారాలపై కార్యదర్శి సానుకూలత వ్యక్తం చేశారని అసోసియేషన్ బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

## 'మోదీ గుడులు' నిర్మించి.. దర్శించుకోమంటారేమో

- బీజేపీ నేత సంబిత్ పాత్రా వ్యాఖ్యలపై జి.నిరంజన్ ధ్వజం

లోక్‌సభ ఎన్నికలు ముగింపు దశకు చేరుకునే కొద్దీ బీజేపీ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేరకు ఆయన మాట్లాడారు. పూరీ జగన్నాథుడు మోదీ భక్తుడంటూ... బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా చేసిన వ్యాఖ్యలే ఆ పార్టీ నేతల దురహంకారానికి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో శ్రీరాముడు, శ్రీకృష్ణుడిలా మోదీని కూడా భగవత్ స్వరూపమని చెప్పినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని విమర్శించారు. మూడో సారీ బీజేపీ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా మోదీ పేరిట ఆలయాలను నిర్మించి.. దర్శనాలు చేసుకోవాలంటూ ప్రజలకు చెబుతారని ఎద్దేవా చేశారు. పూరీ జగన్నాథుని భక్తుల ఆగ్రహానికి బీజేపీ గురికాక తప్పదని, ఎన్నికల ఫలితాలు ఆ పార్టీకి కనువిప్పు కలిగిస్తాయని అన్నారు.

## కులగణన చేశాకే 'స్థానిక' ఎన్నికలు

- సీఎం రేవంత్‌ను కోరిన వీహెచ్

రాష్ట్రంలో కులాల వారీగా సర్వేను పూర్తి చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హన్మంతరావు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బుధవారం లేఖ రాశారు. కులాల వారీ సర్వే వల్ల ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు స్థానిక సంస్థల్లో తమకు రావాల్సిన వాటాను పొందుతారన్నారు. సర్వే ప్రక్రియకు మూడు నుంచి నాలుగు నెలల సమయం మాత్రమే పడుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## ఈసీ వింత వైఖరి!

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఐదుదశల పోలింగ్ ముగిసిపోయి, మిగిలిన రెండు దశలూ ఇంకో పదిరోజుల్లో పూర్తికాబోతున్న తరుణంలో, ఎన్నికల సంఘం బుధవారం ఈ దేశంలోని రెండు ప్రధాన రాజకీయపక్షాలకు గట్టిగా హితోపదేశం చేసింది. బీజేపీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షులకు రాసిన సుదీర్ఘమైన లేఖలో అది, ఆయా పార్టీల స్టార్‌క్యాంపెయినర్లు తమ వ్యాఖ్యలు, ప్రసంగాల్లో నియంత్రణ పాటించేట్టు చూడాలని కోరింది. హద్దు దాటవద్దని మీ వాళ్ళకు చెప్పండి అని పార్టీ అధ్యక్షులను ఎన్నికల సంఘం కోరింది. కులం, మతం, జాతి, భాషల ఆధారంగా సమాజాన్ని రెచ్చగొట్టే, చీల్చే రీతిలో ప్రసంగాలు చేయడం సరికాదంటూ ఎన్నికల నియమావళిని గుర్తుచేసింది. ప్రచారకర్తలు ఆ నియామవళికి కట్టుబడి ఉండేట్టుగా చూడాల్సిన బాధ్యత పార్టీలదేనని ఈసీ అంటోంది. మీ స్టార్ క్యాంపెయినర్లను అదుపులో ఉంచండి, వారిని గట్టిగా హెచ్చరించండి అంటూ నరేంద్రమోదీని, రాహుల్‌గాంధీని నియంత్రించాల్సిన బాధ్యతను జేపీ నడ్డా, ఖర్గేలమీద పెట్టింది. తద్వారా విద్వేషపూరితమైన ప్రసంగాలు చేస్తున్న వ్యక్తుల పేర్లు ప్రస్తావించకుండా, వారిని నేరుగా హెచ్చరించకుండా ఈసీ తెలివిగా పక్కకు తప్పుకుంది. ఉభయపక్షాలనూ తప్పుబట్టడం ద్వారా తాను తటస్థంగా కనిపించేందుకు తాపత్రయపడింది కానీ, ఏ మాత్రం ప్రయోజనం లేని, క్షేత్రస్థాయిలో ప్రభావం చూపని చర్య ఇది.

నరేంద్రమోదీకి నోటీసులు జారీ చేసేందుకు ధైర్యం చాలకనే, పార్టీ అధ్యక్షులను మధ్యలోకి తెచ్చే పనికి ఈసీ పూనుకుందని గతనెలలో ఎన్నికల సంఘం వివరణ కోరినప్పుడు కొందరు విమర్శించారు. తీవ్రాతితీవ్రమైన ఆరోపణలతో, అసత్యాలు అర్ధసత్యాలతో ప్రచారం సాగుతున్న తరుణంలో నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు బీజేపీకి ఐదురోజుల గడువు ఇవ్వడం కూడా ఆశ్చర్యం కలిగించింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా పార్టీ అధ్యక్షులవెంటే పడుతూ స్టార్‌క్యాంపెయినర్లను మాత్రం ఈసీ స్వేచ్ఛగా వదిలేసింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిని నేరుగా ప్రశ్నించడం మానేస్తే, సదరు స్టార్‌క్యాంపెయినర్లకు మరింత రెచ్చిపోయే అవకాశం సహజంగానే చిక్కుతుంది. కాంగ్రెస్ మానిఫెస్టోలో ఉన్నాయంటూ, ముస్లింలకు దోచిపెడతారంటూ మోదీ చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి కారణమైనప్పటికీ, ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసిన తరువాత కూడా బీజేపీ అధ్యక్షుడు నడ్డాసహా చాలామంది స్టార్‌క్యాంపెయినర్లు వాటిని కొంతకాలం ప్రస్తావిస్తూనే వచ్చారు. ఏప్రిల్ 25నుంచి ఇప్పటివరకూ బీజేపీమీద పన్నెండు, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నాలుగు ఫిర్యాదులు అందాయని ఈసీ అంటోంది. అప్పటినుంచి ఇప్పటివరకూ మరిన్ని విద్వేషపూరితమైన వ్యాఖ్యలు సమాజం విన్నది.

గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మోదీకి క్లీన్‌చిట్ ఇచ్చి, ఒక ఎన్నికల కమిషనర్ రాజీనామాతో వివాదాల్లో ఇరుక్కున్న ఈసీ ఈసారి ఈ కొత్తమార్గాన్ని కనుక్కొంది. మోదీ, అమిత్‌షా ఇత్యాది పెద్దలు తమకు తోచినవి అంటూ ఉంటారు, కాంగ్రెస్ మానిఫెస్టోలోనూ, మన్మోహన్ మాటల్లోనూ లేనివన్నీ ఉన్నట్టుగా ప్రచారం చేస్తుంటారు, వారిని వదిలేసి ఈసీ నడ్డాను మాత్రం నిలదీస్తూ ఉంటుంది. మోదీకి నోటీసులు ఇచ్చే బాధ తప్పించుకోవడానికి ఎన్నికల సంఘం అనుసరించిన ఈ అడ్డదారి రాహుల్‌గాంధీకి కూడా ఉపకరిస్తోంది. కాంగ్రెస్‌పార్టీ మీ మంగళసూత్రాలు లాగేసుకుంటుంది, దేశసంపదను ముస్లింలకు పంచేస్తుంది అంటూ రాజస్థాన్‌లోని బన్స్వారాలో మోదీ చేసిన వ్యాఖ్యలమీద తాము ఫిర్యాదు చేసి ఎంతోకాలమైనప్పటికీ ఈసీ చర్యలు తీసుకోవడంలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

అన్నందుకు ఎన్నికల సంఘం ఆగ్రహించి ఆయనకు కూడా నోటీసులు ఇచ్చిన విషయం మరిచిపోకూడదు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినవారిపై సత్వర చర్యలు తీసుకోవడం, నియమనిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరపడం కంటే, పాలకపక్షపెద్దల ఆగ్రహానికి గురికాకుండా తెలివిగా వ్యవహరించడం ఈసీకి ముఖ్యమైపోయింది. అన్ని పార్టీలనూ ఒకేరీతిలో చూస్తున్నట్టుగా, సమానంగా శిక్షిస్తున్నట్టుగా ఉపరితలంలో కనిపిస్తున్నప్పటికీ, మొగ్గు అధికారపక్షంవైపు ఉన్న విషయం కనిపిస్తూనే ఉంది. మరోపక్కన, పోలింగ్ డేటాలో వైరుధ్యాలున్నాయని అన్నందుకు, పోలింగ్‌శాతం వివరాలపై అనుమానాలు వ్యక్తంచేసినందుకు మాత్రం కాంగ్రెస్ అధ్యక్షుడిపై ఎన్నికల సంఘం ఈ మధ్యనే తాడెత్తున మండిపడ్డది. ఇటువంటి ఎన్నికల సంఘాన్ని, ఈ తరహా ఎన్నికలను దేశం గతంలో చూసివుండదు.

## కలలు సాకారమయ్యేది కష్టమే!

ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలు కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీకి అగ్నిపరీక్షగా ఉన్నాయి. దేశంలో నెలకొన్న రాజకీయ పరిణామాలకు తోడు ప్రజల మనోభావాలు, ఇతర అంశాలను పరిగణనలోనికి తీసుకుంటే మిగిలిన పార్టీల కంటే బీజేపీనే పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పుడు సొంతంగా 370 సీట్లు సాధిస్తామంటోంది. కాంగ్రెస్ పార్టీ బలహీనతల దృష్ట్యా బీజేపీ బలంగా ఉన్నట్లు భావిస్తున్నా, సీట్ల సంఖ్య పెంచుకోవడం ఆ పార్టీకి కత్తిమీద సామే.

పాలనలో వైఫల్యాలు బీజేపీకి ఎన్నికల్లో ప్రతిబంధకం కానున్నాయి. ప్రధానంగా పేదరికం రేటు 11.28 శాతానికి చేరింది. నిరుద్యోగం పెరిగింది. చదువుకున్న వారిలో 20 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. విద్య వైద్య రంగాల్లో దేశం వెనుకబాటులో ఉంది. నూతన విద్యావిధానం పేరిట సంఘ్‌పరివార్ భావజాలాన్ని పెంచుకునేందుకు బీజేపీ యత్నించింది. ఆరోగ్యరంగంలో భారత్ అథమస్థానంలోనే ఉంది. జీడీపీలో ఈ రంగానికి కేటాయింపులు 1.2 శాతం మాత్రమే. మాతాశిశు మరణాలు ఎక్కువే. సామాన్యులకు వైద్యం ఖరీదైనదిగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం లోపభూయిష్టంగా ఉంది. మౌలిక వసతుల అభివృద్ధిని గొప్పగా చెబుతున్నా దేశంలో ఇంకా పది శాతం గ్రామాలకు సరైన రోడ్లు లేవు. జాతీయ రహదారుల శాతం 24 గానే ఉంది. నగరాలు, పట్టణాల ప్రగతి అంతంత మాత్రమే. మెట్రో నగరాలు నీటికొరతతో తల్లడిల్లుతున్నాయి. దేశంలోని 19 శాతం గ్రామాలకు విద్యుత్ అందడం లేదు. సాగునీటి, తాగునీటి సమస్యలు పెద్దఎత్తున ఉన్నాయి. సహజ, వర్షాధారిత నీటి వనరులను సద్వినియోగం చేయడంలో కేంద్రం విఫలమయింది. రాష్ట్రాల మధ్య జల వివాదాలను పరిష్కరించడం లేదు. ట్రిబ్యునళ్లు, బోర్డుల పేరిట కాలయాపన చేస్తోంది. నదుల అనుసంధానం పేరిట కొత్త చిచ్చుకు తెరలేపుతోంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉత్తర, దక్షిణ భారత్‌ల మధ్య తేడాల తీవ్రత పెరిగింది.

ఎన్నికల్లో హామీలు ఇచ్చిన వాటిని నెరవేర్చకపోవడంలో బీజేపీ ముందంజలో ఉంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పించలేదు. దేశంలో 40 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి దానిని నెరవేర్చకపోగా నల్లచట్టాలు తెచ్చి రైతులను మరింత నష్టపరిచేందుకు యత్నించింది. పంటలకు మద్దతు ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పెద్దనోట్ల రద్దు పేరిట హంగామా చేసినా దాంతో ఒనగూరిందేమీ లేదు. పైగా దేశంలోని నల్లధనం తెల్లధనం అయింది. ప్రభుత్వరంగ సంస్థలను సద్వినియోగం చేయకపోగా వాటిని విక్రయించి, మూసివేసి ఆ వ్యవస్థను దెబ్బతీసింది. స్విస్‌బ్యాంకు నుంచి నల్లధనాన్ని తెప్పించి ప్రతీ పౌరుని ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి, చేతులెత్తేసింది.



భారత్ వెలిగిపోతుందనే అతి ప్రచారం 2004లో బీజేపీని దెబ్బకొట్టింది. ఇప్పుడు మితిమీరిన ప్రచారం ఆ పార్టీని నష్టపరిచే ఛాయలు కనిపిస్తున్నాయి. మాయాజాలంతో ఓటర్లను తమవైపు తిప్పుకుంటామని బీజేపీ నేతలు కలలు కంటున్నా, అవి పూర్తిగా సాకారమయ్యేలా లేవు. ప్రజలు విజ్ఞులు... దేశ స్థితిగతులు, కేంద్రం పాలన తీరుతెన్నులు, హామీల అమలులో వైఫల్యాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకునే తమ తీర్పునిస్తారు.

రాష్ట్రాలతో సంబంధాలు సరిగా లేవు. సెస్‌ల పేరిట పన్ను వాటాలకు గండి కొట్టింది. అదానీ వంటి వారికి అండగా నిలిచి అపఖ్యాతి పాలయింది. పలువురు పారిశ్రామికవేత్తలు బ్యాంకుల్ని, ప్రజలను మోసం చేసి లక్షల కోట్ల రూపాయలు సంపాదించి విదేశాలకు పారిపోతే చూస్తూ ఊరుకుంది. మేక్ ఇన్ ఇండియా ఒక నినాదంగా మిగిలిపోయింది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి, నిర్వీర్యం చేస్తోంది.

బీజేపీ పదేళ్ల పాలనలో ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను శాఖలు పూర్తిగా అస్మదీయ శాఖలుగా మారిపోయాయి. తమకు గిట్టని, ఎదిరిస్తున్న వారిని దెబ్బతీయడమే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ఎన్డీయే ప్రభుత్వం వారి రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంది. ప్రతిపక్ష పార్టీ నాయకుల్ని, మంత్రులను, ముఖ్యమంత్రులను కేసుల్లో ఇరికించి భయపెట్టి లొంగదీసుకొన్నది. లొంగని వారిని జైల్లో పెట్టింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉత్తరాఖండ్ సీఎం సోరేన్‌ల అరెస్టులు రాజకీయ కక్షసాధింపులే. రాష్ట్రాల్లో విపక్ష ప్రభుత్వాలని కూలగొట్టి ఫిరాయింపులకు కొత్త అర్థాన్ని చెప్పింది. దేశానికి ప్రగతి నమూనాలను చూపాల్సి ఉండగా... అందుకు భిన్నంగా ఆలయాలు, నినాదాలను చూపుతూ దాన్నే ఘనతగా చాటుకుంటోంది. విదేశాంగ విధానాలు విమర్శల పాలయినా సమీక్షించుకోలేదు. రిజర్వేషన్ల వంటి సున్నిత అంశాన్ని వివాదం చేసింది. కులగణన చారిత్రక అవసరమైనా దానిని చేపట్టేందుకు బీజేపీకి ధైర్యం చాలడం లేదు. భారత్ వెలిగిపోతుందనే అతి ప్రచారం 2004లో బీజేపీని దెబ్బకొట్టింది. ఇప్పుడు మితిమీరిన ప్రచారం ఆ పార్టీని నష్టపరిచే ఛాయలు కనిపిస్తున్నాయి.

మాయాజాలంతో ఓటర్లను తమవైపు తిప్పుకుంటామని బీజేపీ నేతలు కలలు కంటున్నా, అవి పూర్తిగా సాకారమయ్యేలా లేవు. ప్రజలు విజ్ఞులు... దేశ స్థితిగతులు, కేంద్రం పాలన తీరుతెన్నులు, హామీల అమలులో వైఫల్యాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకునే తమ తీర్పునిస్తారు. ప్రధానంగా సమస్యల వలయంలో ఉన్న పేదలు, ఉపాధి కోసం చూస్తున్న నిరుద్యోగులు, మద్దతు లేని రైతులు, ప్రగతికి నోచని మహిళలు, వెనకబడిన వర్గాల వారు... ఇలా అన్ని రంగాల వారు అన్ని విషయాలను బేరీజు వేసుకొనే తగిన నిర్ణయం తీసుకుంటారు. ప్రజల తీర్పు అన్నింటికీ ప్రామాణికంగా నిలుస్తుంది.

• డాక్టర్ బిఎన్ రావు
బిఎన్‌రావు ఫౌండేషన్

# గాలిమేడలు, ఊహాగానాలు, పీడకలలు

జూన్ ఒకటిన ఓటు వేసేవారు అదృష్టవంతులు. వాళ్లకు ఆ రోజు సాయంత్రమే దేశవ్యాప్త ఎగ్జిట్ పోల్ ఫలితాలు తెలిసిపోతాయి. ఆ తరువాత ఇంకో మూడు రోజులలో నిజమైన ఫలితాలూ తెలిసిపోతాయి. కానీ, ఏప్రిల్ 19 నాడు పోలింగ్ జరిగినవారికి నలభై ఆరు రోజుల నరకం. తమ మనసు విప్పి, ఈవీఎం నొక్కిన తెలుగు రాష్ట్రాల ఓటర్లకు మే 13 తరువాత ఇరవై మూడు రోజుల ఉత్కంఠ. అభ్యర్థులకు, వారి పార్టీలకు ఒకరకం గుబులు. జనం ఎంపిక ఎట్లా ఉన్నదో అని. ప్రజలకు కూడా అదే గుబులు. తమ ఎంపిక ఏ సామూహిక రూపం తీసుకున్నదో అని.

కౌంటింగ్ దాకా కౌంట్ డౌన్ కాలం జారుడుబండలాగా ఉండదు. నిటారు కొండ మీదికి హైకింగ్ లాగా ఉంటుంది. బరిలోని వస్తాదులనుంచి, కేవలం ఓటేసిన సామాన్యుల దాకా దిగులు, ఆత్రుత, వణుకు, గుండెదడ, చిరాకు, భయం వంటి అనేక మానసిక వికారాలు కమ్ముకుంటాయి. నమ్మకం, ఆశ బలంగా ఉన్నవారు కలల్లో తేలిపోతుంటారు. ప్రచారఘట్టంలోనే పస తెలిపోయినవారు పీడకలల్లో ఓలలాడుతుంటారు. మరి కొందరు ఊహలకు, గణితశస్త్రాన్ని, గణాంకాలను తొడిగి, రకరకాల సంభావ్యతలను ప్రతిపాదిస్తుంటారు. క్రికెట్ క్రీడలో ప్రతి బంతి ప్రయాణానికీ, ప్రతి ఆటగాడి కదలికలకీ భాష్యాలు చెప్పే వ్యాఖ్యాతలలాగా, ఎన్నికల ప్రక్రియలోని ప్రతి కోణాన్నీ రాజకీయ పరిశీలకులు, సెఫాలజిస్టులు, వ్యూహకర్తలు కుంభాకార కటకంలో నుంచి చూపిస్తున్నారు. ఎదురుచూపుల భారాన్ని మోస్తున్న రాజకీయాసక్తులకు శ్రమ తెలియకుండా నిత్యం కొత్త కథలు చెబుతున్నారు. మరో వైపు మరి కొందరు ముసళ్ల పండగ జూన్ 4 తరువాత ఉందని భయపెడుతున్నారు.

దేశం మీదకు రెండు సంఖ్యలను వదిలి, ప్రత్యర్థులను వాటి మాయలోకి పడేసింది బీజేపీ. అవి 400, 370. గెలుపు ముందే ఖరారు అనీ, సంఖ్య మాత్రమే తేలవలసి ఉన్నదన్న అభిప్రాయాన్ని అవి కలిగించాయి. ఆ తరువాత నెమ్మదిగా, 220, 250, 260, 268 వంటి సంఖ్యలు కూడా ప్రవేశించి, వాతావరణాన్ని వేడెక్కించాయి. యథాతథవాదులు కొందరు 303 సంఖ్య అటూఇటూగా కొనసాగుతుందని, ఇదే ప్రభుత్వం, ఇదే మోదీ మూడోసారి పాలిస్తారని బల్లగుద్ది మరీ చెబుతున్నారు. ఇప్పుడున్నంత బలమే, కొంత చేర్పుతో, కొనసాగితే, అందులో రసవత్తరమైన ఊహలకు ఆస్కారం ఎక్కడుంది? అందుకని, బీజేపీ మెజారిటీకి ఆమడ దూరంలో ఉంటుందని, మిత్రుల సాయంతో గట్టెక్కుతుందని కొందరు ధైర్యంగా వేస్తున్న లెక్కలు, ఎన్నికల అనంతరం కొత్త సన్నివేశాల జోస్యానికి వీలు కల్పిస్తున్నాయి. మెజారిటీ తగ్గితే మోదీయే నేతగా ఉంటారా? ప్రభ తగ్గిన నాయకత్వంలో కొనసాగడానికి ఆయన ఇష్టపడతారా? బీజేపీలో అనంతర నేతలు పోటీపడరా? మద్దతు ఇచ్చే మిత్రపక్షాలు తమకు ఆమోదమయ్యే నేత కోసం పట్టుబట్టే అవకాశం ఉంటుందా? అడగాలే కానీ అనేక ప్రశ్నలు!

నరేంద్రమోదీ ఓడిపోతారని గానీ, కనీసం బలహీనపడతారని గానీ నమ్మడానికి, ఆయన విమర్శకులలో కూడా అత్యధికులు సంకోచిస్తారు. ఆయన ఇంకా ఇంకా బలపడతారని, తాను అనుకున్న లక్ష్యాలను నిర్దాక్షిణ్యంగా సాధిస్తారని కూడా వారు విశ్వసిస్తారు. ఎంతో కొంత వ్యతిరేకత వ్యక్తమవుతున్నదన్న సూచనలు కనిపిస్తున్నా, ప్రతికూలతల మీదనే వారి దృష్టి ఉంటుంది. బాధితులు కాగలిగిన దుర్బలులకు ఆ నిస్పృహ అధికం. భారతదేశంలో నెలకొన్న సామాజిక, రాజకీయ వాతావరణం మీద తీవ్రంగా కలవరపడే ఒక సామాజిక మాధ్యమాల మిత్రుడు, ఈ మధ్య మోదీ చేసిన




మోదీ ప్రభుత్వానికి ఎదురుగాలి వీస్తున్నదని తీవ్ర ఆశావాదంతో చెబుతున్నవారిని పక్కనపెట్టినా, ఈ సారి ఖాయంగా మోదీదే ప్రభుత్వం అని చెబుతున్నవారు కూడా పరిస్థితిలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తున్నారు. ఈ సారి కేంద్రంలో అధికారపార్టీ బాహుబలి పార్టీగా ఉండబోదు. అక్కడా ఇక్కడా బలాన్ని సమీకరించుకుని ముందుకు వెళ్లవలసిన స్థితిలో ఉంటుంది. దానివల్ల పరిపాలనలో తీవ్రత తగ్గుతుందని చెప్పలేం కానీ, ప్రజలకు ఉద్యమించే శక్తి పెరుగుతుంది. మొత్తానికి 2029 దాకా గడిచే కాలం, సంక్లిష్టంగా, సంరంభంగా, ఉద్రిక్తంగా ఉండబోతున్నది.

ఒక హెచ్చరికకు బాగా బెదిరిపోయారు. తాను తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత, అవినీతిపరులను జీవితాంతం జైళ్లలో మగ్గేట్టు చేస్తానని మోదీ మొన్న ఆదివారం నాడు ఒక బెంగాల్ సభలో అన్నారు. దాన్ని హెచ్చరికగా కాదు. గ్యారంటీ కింద చెప్పారు. మోదీ పాలనలో రాజకీయప్రత్యర్థుల మీదనే అన్నిరకాల అభియోగాలూ మోపుతారన్న అభిప్రాయం నేపథ్యంలో, ఆ గ్యారంటీ ప్రజాజీవితంలో స్వతంత్ర భావాలతో ఉండేవారూ కలవరపడదగినదే. నరేంద్రమోదీ ప్రాభవం తగ్గుముఖంలో ఉన్నది కానీ, ఈ సారికి ఆయనే నెగ్గుతాడని నిలకడగా వాదిస్తున్న ప్రశాంత్ కిశోర్ కూడా మూడో దఫా పాలన గురించి భయం కలిగించే అంచనాలే ఇచ్చారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక, ఇంతకాలం అనుసరిస్తున్న విధానాలనే మోదీ మరింత తీవ్రంగా కొనసాగిస్తారని, వనరులను అధికారాలను కేంద్రీకృతం చేస్తారని, ఆర్థిక అంతరాలు పెరుగుతాయని, రాష్ట్రాల అధికారాలు మరింతగా క్షీణిస్తాయని, ప్రజల ప్రతిఘటన పెరుగుతుందని భవిష్యత్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఆర్థికవేత్త, సామాజిక రాజకీయ వ్యాఖ్యాత పరకాల ప్రభాకర్, ఈ మధ్య అనేక ఇంటర్వ్యూలలో మరోసారి మోదీ ప్రభుత్వం వస్తే ఎంతటి విధ్వంసానికి కారణమవుతుందో హెచ్చరిస్తున్నారు. మణిపూర్ లాంటి పరిస్థితి అన్ని రాష్ట్రాలలో ఏర్పడుతుందని, అక్కడక్కడ జరుగుతున్న మూకదాడులు అధికారికంగానే జరుగుతాయని ఆయన చెబుతున్నారు.

అవయ్ శుక్లా అని ఒక పూర్వ ఐఏఎస్ అధికారి బ్లాగుల ద్వారా, ఇతర మాధ్యమాల ద్వారా రాజకీయాలపై వ్యాఖ్యానిస్తుంటారు. ఆయన తాజా వ్యాసం చదివితే, కొత్త భయానుమానాలు ముంచెత్తుతాయి. కొందరు చెబుతున్నట్టు, లేదా, ఆశపడుతున్నట్టు, తాను అధికారంలోకి వచ్చే విధంగా ఫలితాలు లేకపోతే, నరేంద్రమోదీ అధికారాన్ని విజేతలకు అప్పగించి నిష్క్రమిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ మొదలుకొని, నిఘావ్యవస్థలు, భద్రతాయంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ప్రభుత్వానికి పరిచారకులుగా మారిన పరిస్థితులలో, అలవాటుపడిన అధికారాన్ని నాయకుడు వదులుకుంటారా? ఎమర్జెన్సీ అనంతరం ఎన్నికలలో ఓడిపోయిన ఇందిరాగాంధీ 1977లో చేసినట్టు, నరేంద్రమోదీ అధికారాన్ని వదులుకుంటారా? అని శుక్లా సందేహం. సుప్రీంకోర్టు, రాష్ట్రపతి.. ఈ రెండు వ్యవస్థలు దృఢంగా ఉంటే ప్రజల తీర్పు అమలుకు అవరోధాలు ఉండవని, కానీ, ఆ దృఢత్వం మీద తనకు విశ్వాసం కలగడం లేదని ఆయన అన్నారు. ఎన్నికల ఫలితాల తరువాత ప్రజల బాధ్యత ముగిసిపోవడం లేదు, ఇదే పాలన కొనసాగితే, ప్రతిఘటించవలసిన అంశాలు పెరగడం ఒక పార్శ్వం. ఒకవేళ, మార్పును కోరే తీర్పు వస్తే, అది అమలు జరిగేట్టు చూడవలసి రావడం మరో పార్శ్వం.

మోదీ ప్రభుత్వానికి ఎదురుగాలి వీస్తున్నదని తీవ్ర ఆశావాదంతో చెబుతున్నవారిని పక్కనపెట్టినా, ఈ సారి ఖాయంగా మోదీదే ప్రభుత్వం అని చెబుతున్నవారు కూడా పరిస్థితిలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తున్నారు. ఈ సారి కేంద్రంలో అధికారపార్టీ బాహుబలి పార్టీగా ఉండబోదు. అక్కడా ఇక్కడా బలాన్ని సమీకరించుకుని ముందుకు వెళ్లవలసిన స్థితిలో ఉంటుంది.. దాని వల్ల పరిపాలనలో తీవ్రత తగ్గుతుందని చెప్పలేం కానీ, ప్రజలకు ఉద్యమించే శక్తి పెరుగుతుంది. మొత్తానికి 2029 దాకా గడిచే కాలం, సంక్లిష్టంగా, సంరంభంగా, ఉద్రిక్తంగా ఉండబోతున్నది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఒక పార్టీకి తిరుగులేని మెజారిటీ వస్తే, ఒకటే సంభావ్యత. కానీ, కూటమిలోని మిత్రుల సహకారంతో మాత్రమే అధికారం సాధ్యపడితే, అది వేరే సన్నివేశం. ఎన్డీఏ కూటమిలో మళ్లీ చేరిన తెలుగుదేశంపార్టీ, తనమిత్రపక్షాలతో సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఘనవిజయం సాధించబోతున్నదన్న టాక్ సర్వత్రా వ్యాపించింది. మరి బీజేపీకి మునుపటిలా సొంతబలం లేక, కూటమి మిత్రుల బలంపై ఆధారపడే పరిస్థితి వస్తే? రాష్ట్రంలో అధికారంలోకి రావడమే కాకుండా, జాతీయస్థాయిలో కూడా చంద్రబాబుకు ప్రాధాన్యం పెరిగితే? ఈ చర్చ కూడా తెలుగుదేశం అభిమానులలోనే కాక, ఇతరులలో కూడా జరుగుతోంది. 2014 లాంటి ఎన్డీయే కాక, 1999 నాటి ఎన్డీయే ప్రభుత్వం వస్తే మెరుగని, మిత్రపక్షాలకు అందులో మెరుగైన భాగస్వామ్యం ఉంటుందని, రాష్ట్రానికి కావలసిన నిధులను, హోదాలను సంపాదించుకోవడానికి అవకాశాలు పెరుగుతాయని ఆంధ్రప్రదేశ్ శ్రేయోభిలాషులు మాట్లాడుకుంటున్నారు. ఒకవేళ, మోదీ కేంద్రంలో అధికారంలోకి రాకుండా, కూటమి ఆంధ్రప్రదేశ్‌లో అధికారం సాధిస్తే అప్పుడు పరిస్థితి ఎట్లా ఉంటుందన్న చర్చ కూడా వినిపిస్తోంది.

> బీజేపీ మెజారిటీకి ఆమడ దూరంలో ఉంటుందని, మిత్రుల సాయంతో గట్టెక్కుతుందని కొందరు ధైర్యంగా వేస్తున్న లెక్కలు, ఎన్నికల అనంతరం కొత్త సన్నివేశాల జోస్యానికి వీలు కల్పిస్తున్నాయి. మెజారిటీ తగ్గితే మోదీయే నేతగా ఉంటారా? ప్రభ తగ్గిన నాయకత్వంలో కొనసాగడానికి ఆయన ఇష్టపడతారా? బీజేపీలో అనంతర నేతలు పోటీపడరా? మద్దతు ఇచ్చే మిత్రపక్షాలు తమకు ఆమోదమయ్యే నేత కోసం పట్టుబట్టే అవకాశం ఉంటుందా? అడగాలే కానీ అనేక ప్రశ్నలు!

ఇటువంటి ఊహాగానాల మధ్య భారత రాష్ట్రసమితి పేరు ఎక్కడా వినిపించకపోవడం విచారకరమైన పరిణామం. నిజానికి ఇది టీఆర్ఎస్ లేదా బీఆర్ఎస్ స్వయంకృతం. ఏ ప్రమాదాన్ని, ఏ ప్రయోజనాన్ని చూసి 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లారో గానీ, దానివల్ల సమకూరిన అదనపు లాభమేమీ లేదు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు తెలంగాణలో వేరయ్యాయి. 2024లోనే లోక్‌సభ ఎన్నికలతో పాటు, అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగి ఉంటే, రాష్ట్రప్రభుత్వం ఎట్లాగూ చేజారినా, అసెంబ్లీ స్థానాలు గెలుచుకున్న నిష్పత్తిలో ఎంపీ స్థానాలు గెలిచే అవకాశం ఉండేది. అసెంబ్లీ ఎన్నికలు ముందే జరగడం వల్ల, అప్పుడు బీఆర్ఎస్‌కు పడిన ఓటు ఇప్పుడు చెదిరిపోయి, పార్టీ మూడోస్థానానికి దిగే పరిస్థితి ఏర్పడింది. ఆరేడు ఎంపీ స్థానాలు గెలుచుకుని ఉంటే, కేసీఆర్ ప్రధాని కాలేకపోయినా, ఢిల్లీలో ఒక చిన్నచక్రమైనా తిప్పే అవకాశం ఉండేది.

***

## మేధావులనే వీసీలుగా నియమించాలి

తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో వైస్ చాన్సలర్ల (వీసీల) పదవీకాలం ముగిసింది. ఎలక్షన్ కోడ్ ఉన్నందున ఎలక్షన్ కమిషన్ ద్వారా వీసీల నియామకానికి అనుమతి తీసుకొని ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ కమిటీ సీనియర్ ప్రొఫెసర్లను ఎంపిక చేసి వారి పేర్లను ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుంది. గతంలో వివిధ యూనివర్సిటీలకు నియమించిన వీసీల పనితీరును ప్రభుత్వం పరిశీలించి అందులో జరిగిన లోటుపాట్లను సరిదిద్దాలి. యూనివర్సిటీలు విద్యార్థులను విద్యావంతులుగా తయారు చేసి దేశ, విదేశాలలోని వివిధ రంగాలలో ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయి. కాబట్టి పతనమవుతున్న విశ్వవిద్యాలయాల వ్యవస్థను బాగుచేసే దిశగా ప్రభుత్వం ఆలోచించాలి, తగిన చర్యలు తీసుకోవాలి.

యూనివర్సిటీలలో చదువుకునేవారు గ్రామీణ ప్రాంతాలలో ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాల పేద బిడ్డలు. ఈ వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకుని బాగుపడాలంటే ప్రభుత్వం వారికి నాణ్యమైన విద్యనందించాలి. ఇందుకు బోధన, బోధనేతర సిబ్బందితో పాటు పరిశోధన కేంద్రాలను ఏర్పాటుచేసి వాటి అభివృద్ధికి తోడ్పడాలి. అవసరమైన మౌలిక వసతులను కల్పించాలి. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించుకోవాలి. 'కార్పొరేట్ విద్య' పడగవిప్పి కోరలు చాచి బుస కొడుతుంది. పేద విద్యార్థులు వాటిని అందుకోలేరు. కనుక కార్పొరేట్ శక్తుల కంటే దీటుగా ప్రభుత్వ యూనివర్సిటీలు విద్యార్థులను తీర్చిదిద్దాలి. విద్యార్థుల భవిష్యత్‌తో పాటు యూనివర్సిటీల భవిష్యత్‌ను కూడా కాపాడాల్సిన బాధ్యత వీసీలదే. అలాంటి వీసీలను నియమించేటప్పుడు అన్ని విధాలుగా ఆలోచించి అనుభవజ్ఞులు అయిన మేధోసంపత్తి కలిగిన వారిని, ఏ విధమైన రాజకీయ పార్టీకి సంబంధం లేని వ్యక్తులను వీసీలుగా నియమించాలి.

– డా. కాటేపాగ యుగంధర్
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయూ

# బీజేపీ మద్దతు ధర అతిపెద్ద మోసం!

మొట్టమొదటిసారిగా 1965–66 సంవత్సరంలో మార్కెట్లో సరైన ధరలు లభిస్తాయనే భరోసాను రైతులకు కల్పించడం కోసం ప్రధాన పంటల ఉత్పత్తులకు మద్దతు ధర విధానం తీసుకువచ్చారు. ఈ మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందు ప్రకటిస్తూ వస్తుంది. దీని ఆధారంగా రైతులు ఆయా వ్యవసాయ సీజన్ల ప్రారంభంలో ఏ ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలో ప్రణాళికలు తయారు చేసుకుంటారు. అయితే ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో వచ్చిన నూతన సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా మద్దతు ధర ప్రాముఖ్యత తగ్గుతూ వచ్చింది. దీని ఫలితంగా వ్యవసాయంలో కొంత సంక్షోభం మొదలైంది. ముఖ్యంగా మార్కెట్లో దళారుల దోపిడీ పెరగడం, రైతుల ఆదాయాలు నానాటికి తగ్గిపోవడం, ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరగడం జరిగింది. 2004 నాటికి రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం దేశవ్యాప్తంగా ఒక పెద్ద సవాలుగా మారి అది ఒక రాజకీయ ఎజెండాగా రూపాంతరం చెందింది.

2004లో యూపీఏ కూటమి కేంద్రంలో అధికారంలోకి వచ్చి మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా పదవి చేపట్టిన వెంటనే మొత్తం రైతుల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి రైతు సంక్షోభాన్ని నిర్మూలించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించవలసిందిగా స్వర్గీయ డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ సారథ్యంలో జాతీయ రైతు కమిషన్ ఏర్పాటు చేశారు. సుదీర్ఘ అధ్యయనం తర్వాత స్వామినాథన్ కమిషన్ వివిధ సిఫార్సులతో కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో అతిముఖ్యమైన సిఫార్సు పంటల ఉత్పత్తికి అయ్యే అన్ని ఖర్చులను, రైతు యాజమాన్య సేవలను కూడా కలుపుకొని వచ్చే మొత్తం ఖర్చుపై (C3 ఖర్చు) 50 శాతాన్ని హెచ్చించి మద్దతు ధరగా ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా సంక్షోభం నుంచి రైతులకు విముక్తి లభిస్తుందని స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. ఈ విధంగా ఇచ్చే మద్దతు ధరకు చట్టబద్ధత కూడా కల్పించాలని స్వామినాథన్ కమిషన్ సూచించింది.

ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల నుంచి అన్ని ఎన్నికలలోనూ ప్రధాన రాజకీయ పార్టీలు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇస్తూ వచ్చాయి. అయినప్పటికీ నేటి వరకు ఇది హామీగానే మిగిలిపోయింది. అయితే గత పదేళ్ళుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ మేరకు మద్దతు ధర ఇస్తున్నామని చెబుతూ వస్తుంది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల పదే పదే ప్రకటనలు కూడా విడుదల చేస్తూ వస్తుంది. ఇందులో వాస్తవం ఎంత ఉంది అనేది చాలా కీలకం. గత పదేళ్ళుగా ఇస్తున్న మద్దతు ధర నిజంగానే స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకే ఇస్తున్నారా? అంతకుముందు పదేళ్ళుగా అనగా 2004–05 నుండి 2013–14 (యూపీఏ ప్రభుత్వం) కాలంలో ఇచ్చిన మద్దతు ధరల కంటే గత పదేళ్ళ బీజేపీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలలో పెరుగుదల ఎక్కువగా ఉన్నదా? అదేవిధంగా దేశంలోని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల యూపీఏ కాలంతో పోలిస్తే గత పదేళ్ళ బీజేపీ పాలనలో ఎక్కువ ఉందా? ఇవి కీలక ప్రశ్నలు.

సాధారణ వరి మద్దతు ధర 2004–05లో క్వింటాలుకు రూ.560 నుండి 2013–14 నాటికి రూ.1,310కు పెరిగింది. అనగా ఈ పదేళ్ళ యూపీఏ ప్రభుత్వ కాలంలో వరి మద్దతు ధరలో 134శాతం పెరుగుదల నమోదయింది. అదేవిధంగా మొక్కజొన్న మద్దతు ధర క్వింటాలుకు రూ.525నుండి రూ.1,310కు ఇదే యూపీఏ ప్రభుత్వ కాలంలో పెరిగింది. అంటే 150 శాతం పెరుగుదల. అదేవిధంగా వాణిజ్య పంట అయిన పత్తి మద్దతు ధరలో పెరుగుదల ఈ కాలంలో 110 శాతంగా నమోదయింది. ఇక గత పదేళ్ళ బీజేపీ పాలనలో (2014–15 నుంచి 2023–24) గణాంకాలను పరిశీలించినట్లయితే అన్ని ప్రధాన పంటల మద్దతు ధరలలో పెరుగుదల చాలా తగ్గింది. 2014–15లో వరి మద్దతు ధర క్వింటాలుకు రూ.1,360 ఉంటే, అది 2023–24 నాటికి కేవలం రూ.2,183కి పెరిగింది. అంటే గత పదేళ్ళల్లో వరి మద్దతు ధరలో పెరుగుదల కేవలం 60 శాతం మాత్రమే. ఈ పెరుగుదల యూపీఏ ప్రభుత్వ కాలంతో పోలిస్తే సగానికి తక్కువగానే ఉన్నట్లు అర్థమవుతుంది. అదేవిధంగా మొక్కజొన్న మద్దతు ధర గత పదేళ్ళ బీజేపీ పాలనలో క్వింటాలుకు రూ.1,310 నుండి రూ.2,090 పెరిగింది. అంటే గత పదేళ్ళల్లో మొక్కజొన్న మద్దతు ధరలో పెరుగుదల 59 శాతం మాత్రమే. ఇక పత్తి మద్దతు ధర పెరుగుదల కేవలం 76 శాతం. అన్ని ప్రధాన పంటల్లో దాదాపుగా ఇదే సరళిని గమనించవచ్చు. 2014–24 మధ్యకాలంలో ప్రకటించిన అన్ని పంటల మద్దతు ధరలో పెరుగుదల అంతకుముందు పదేళ్ళతో పోలిస్తే (2003–14 వరకు) సగం కూడా లేకపోవడం గమనార్హం.

> కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న 2014–24 మధ్యకాలంలో ప్రకటించిన అన్ని పంటల మద్దతు ధరలో పెరుగుదల అంతకుముందు యూపీఏ పదేళ్ళతో పాలనతో పోలిస్తే (2003–14 వరకు) సగం కూడా లేదు. బీజేపీ ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నట్టుగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరను ఇచ్చి ఉన్నట్లయితే ఈ కాలంలో మద్దతు ధరల పెరుగుదల, వార్షిక అభివృద్ధి రేటు యూపీఏ ప్రభుత్వ కాలం కంటే ఎందుకు తక్కువగా నమోదైంది?




ఇక మరో సూచికైనా మద్దతు ధరల వార్షిక వృద్ధిరేటును పరిశీలిద్దాం. యూపీఏ ప్రభుత్వ కాలంలో సాధారణ వరి మద్దతు ధరలో నమోదైన సగటు వార్షిక వృద్ధిరేటు 9.4 శాతం. అయితే వరి మద్దతు ధరలో ఈ సగటు వృద్ధిరేటు గత పదేళ్ళ బీజేపీ పాలనలో కేవలం 5.3 శాతం మాత్రమే. అదేవిధంగా యూపీఏ ప్రభుత్వ కాలంలో సగటు వార్షిక వృద్ధిరేటు 10.5 శాతంగా ఉన్న మొక్కజొన్న మద్దతు ధర గత పదేళ్ళ బీజేపీ పాలనలో కేవలం 4.9 శాతం మాత్రమే. పత్తి మద్దతు ధర సగటు వార్షిక వృద్ధిరేటు యూపీఏ కాలంలో 8.7 శాతంగా నమోదు కాగా, బీజేపీ పాలనలో 6.9 శాతం మాత్రమే. ఈ గణాంకాలను బట్టి అర్థమయ్యేది ఏమిటంటే గత పదేళ్ళ బీజేపీ పాలనలో దాదాపు అన్ని ప్రధాన పంటల మద్దతు ధరల సగటు వార్షిక వృద్ధిరేటుల్లో పెరుగుదల, గత యూపీఏ ప్రభుత్వ కాలంతో పోలిస్తే సగానికి తక్కువ! బీజేపీ ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తున్నట్టుగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరను ఇచ్చి ఉన్నట్లయితే ఈ కాలంలో మద్దతు ధరల పెరుగుదల, వార్షిక అభివృద్ధి రేటు యూపీఏ ప్రభుత్వ కాలం కంటే ఎందుకు తక్కువగా నమోదైంది? స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తున్నామని చెబుతూ బీజేపీ ప్రభుత్వం రైతులని ఎందుకు మభ్యపెడుతున్నట్టు?

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను నిజంగానే అమలు చేసి ఉన్నట్లయితే ప్రస్తుతం ప్రధాన పంటల మద్దతు ధర ఎంత ప్రకటించాల్సి ఉండేది? తెలంగాణలో అధికారిక పంటల ఉత్పత్తి ఖర్చుల గణాంకాలు విశ్లేషిస్తే దీనికి సమాధానం దొరుకుతుంది. 2020–21లో మొత్తం వరి పంట ఉత్పత్తి ఖర్చు (C2) క్వింటాలుకు రూ.1,876. ఈ C2 ఖర్చుపై 10 శాతం రైతు యాజమాన్య సేవల విలువను కలిపినట్లయితే వరి ఉత్పత్తి ఖర్చు (C3) రూ.2,083. స్వామినాథన్ సిఫార్సు ప్రకారం ఈ C3 ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి క్వింటాలుకు రూ.3,124 రైతాంగానికి ఇవ్వాలి. కానీ బీజేపీ కేంద్ర ప్రభుత్వం 2020–21 సంవత్సరంలో వరికి ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు కేవలం రూ.1,868 మాత్రమే. అనగా సిఫార్సుల ప్రకారం ఇవ్వాల్సిన మద్దతు ధర కంటే రూ.1,256, అనగా 67 శాతం, తగ్గించి ఇచ్చారు. ఇదే లెక్కల ప్రకారం 2023–24 సంవత్సరానికి ఇవ్వవలసిన వరి మద్దతు ధర క్వింటాలుకు రూ. 3,645. కానీ కేంద్రం ఇచ్చిన ధర కేవలం రూ.2,183 మాత్రమే. అనగా స్వామినాథన్ సిఫార్సుల కంటే ప్రతి క్వింటాల్‌పై రూ.1,462 తగ్గించి ఇస్తున్నది. ఈ లెక్క ప్రకారం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేయకపోవడం వలన ప్రతి ఎకరానికి వరి రైతు నికరంగా నష్టపోతున్నది రూ.29,240. దీని ప్రకారమే ప్రస్తుత సంవత్సరం మొక్కజొన్న మద్దతు ధర క్వింటాలుకు రూ. 3,030, పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.13,381గా ఉండాల్సింది. కానీ మొక్కజొన్న రైతులు ప్రతి ఎకరానికి రూ.26,334, పత్తి రైతులు రూ.34,985 నికరంగా నష్టపోయారు. అయినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధర ఇస్తున్నామని ఎలా చెప్పుకోగలుగుతున్నది? ఇంతకంటే మోసం మరొకటి ఉంటుందా?

స్వామినాథన్ సిఫార్సు మేరకు C3 ఖర్చును ఆధారంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను ఇవ్వలేదు. మొత్తం C3 ఖర్చులోని కొన్ని ఖర్చులను తగ్గించి కేవలం A2 ఖర్చు, కుటుంబ కూలీల ఖర్చులను కలుపుకొని వాటిపై మాత్రమే 50శాతం హెచ్చించి మద్దతు ధరను ప్రకటిస్తూ వస్తుంది. ఉదాహరణకు 2020–21లో వరి సాగులో మొత్తం C3 ఖర్చు క్వింటాలుకు రూ.2,083 అయితే దానిని తగ్గించి కేవలం A2 ఖర్చు, కుటుంబ కూలీల ఖర్చు కలిపితే వచ్చే ఉత్పత్తి ఖర్చు క్వింటాలుకు రూ.1320ను ఆధారంగా చేసుకుని మద్దతు ధరను ప్రకటిస్తూ వస్తున్నారు. అంటే స్వామినాథన్ సిఫార్సు మేరకు తీసుకోవలసిన C3 ఖర్చు కంటే 58శాతం వరి ఉత్పత్తి ఖర్చును తగ్గించి చూపిస్తూ దానిపై 50శాతం అదనంగా మద్దతు ధరను ఇస్తూ రైతులను మోసం చేస్తున్నారు.

ఇలాంటి రైతు వ్యతిరేక బీజేపీ విధానాల ఫలితంగానే దేశంలో ఏనాడు వినని చూడని రైతుల ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా బీజేపీ నాయకత్వం వాస్తవిక పరిస్థితులను గ్రహించి, దేశ భవిష్యత్తులో రైతాంగం ప్రాముఖ్యతను గుర్తించి తదనుగుణంగా విధానాలు రూపకల్పన చేస్తుందని ఆశిద్దాం.

■ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

## కేయూ ఇన్‌చార్జ్ వీసీగా కరుణ బాధ్యతల స్వీకరణ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22: కాకతీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్‌గా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని ఆమె చాంబర్‌లో కేయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించారు. కేయూ తాజా మాజీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ జి.బ్రహ్మేశ్వరి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ కె.కిషోర్‌కుమార్, ఈసీ మెంబర్లు డాక్టర్ డి.రమేష్, డాక్టర్ ఎస్.సుదర్శన్ తదితరులు కరుణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- వైద్యాధికారుల పట్టింపులేక రోగులకు ఇబ్బందులు
- గాంధీ ఆస్పత్రి ప్రతిష్టను దిగజారుస్తున్న వరుస సంఘటనలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఊపిరాడక 'వెంటిలేటర్' రోగుల బిక్కుబిక్కు
- ఆరు గంటలు కరెంట్ నిలిచిపోవటంపై సర్వత్రా ఆగ్రహం
- అసౌకర్యాలతో డయాలసిస్, గుండె జబ్బు రోగుల్లో టెన్షన్
- మార్చురీలో ఫ్రీజర్లు పనిచేయక కుళ్లిపోతున్న మృతదేహాలు
- ఆస్పత్రి ఆవరణలో చెట్ల నరికివేతతో ప్రాణవాయువు దూరం
- సీఎం సారు.. ఎంజీఎంను ప్రక్షాళన చేసేదెప్పుడో?

7

# పెద్దాస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు

వరంగల్ ఎంజీఎంపై కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ




'ఎంజీఎంలో నిలిచిన విద్యుత్'పై విచారణ

7



ఎంజీఎం ఆస్పత్రిలోని పిల్లల వార్డు



ఎంజీఎం ఆస్పత్రిని పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్

ఉత్తర తెలంగాణలో పేదల పాలిట పెద్దాస్పత్రిగా పేరున్న వరంగల్ ఎంజీఎంకు నిర్లక్ష్యపు జబ్బు పట్టింది. గాంధీ ఆస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యం.. రోగుల పాలిట శాపంగా మారుతోంది. ప్రాణాలు అరచేత పట్టుకుని వైద్యో నారాయణ హరి.. అంటూ ఎంజీఎంకు వచ్చే వారికి అసౌకర్యాలు మరిన్ని అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. ఓ వైపు విద్యుత్ కోతలు.. మరో వైపు పనిచేయని ఏసీలు పట్టిపీడిస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న అవాంతరాలతో వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్న రోగుల ఊపిరి ఎప్పుడు ఆగిపోతుందోనన్న దుస్థితి ఇక్కడ నెలకొంది. చివరకు శవాలు భద్రపరిచే మార్చురీలోని ఏసీలు కూడా పనిచేయకపోవటంతో ఆ మృతదేహాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. ఇదంతా అధికారుల కళ్లెదుటే జరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవటం.. పెద్దాస్పత్రి వైద్యాధికారుల నిర్లక్ష్యం పేదల ప్రాణాలపైకి తెస్తోందన్న అపవాదు వినిపిస్తోంది. నెలరోజులుగా జరుగుతున్న వరుస సంఘటనలు ఎంజీఎం ప్రతిష్టను దెబ్బతిస్తున్నాయన్న ఆందోళన సర్వతా వ్యక్తమవుతుండగా.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు వైద్యశాఖ ప్రక్షాళనపై.. ముఖ్యంగా ఎంజీఎం నిర్వహణ తీరుపై దృష్టి పెట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్వో ప్రావీణ్య

## కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 22: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి కౌంటింగ్ ఏర్పాట్లు, లెక్కింపుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కౌంటింగ్ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో జరగనున్న దృష్ట్యా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్‌కు లోబడి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తొలుత ఈవీఎంలను కౌంటింగ్ రూములకు తరలించి కౌంటింగ్ ప్రారంభిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటు చేసి ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ అనుమతి ఉండదని, ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపు డిస్‌ప్లే బోర్డుపై ప్రదర్శిస్తామని ప్రావీణ్య తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా సహకరించాలని కలెక్టర్ కోరారు.

అనంతరం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్న కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రావీణ్య, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిర్వహించే విధులపై చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఆర్వో అయూబ్ అలీ, భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్‌కుమార్‌రెడ్డి, పర్యవేక్షకులు విశ్వనారాయణ, చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు

7

- నల్లగొండ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి హరిచందన
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్




హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

# రాష్ట్రంలో మోసగాళ్ల ప్రభుత్వం నడుస్తోంది

మట్టెవాడ /రాంనగర్/ నర్సంపేట, మే 22 : రాష్ట్రంలో మోసగాళ్ల ప్రభుత్వం నడుస్తోందని, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు మండిపడ్డారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్నారు. నర్సంపేట పట్టణంలోని పద్మశాలిగార్డెన్, వరంగల్ ఉర్సుగుట్టలోని నాని గార్డెన్‌లో వరంగల్ తూర్పు, హనుమకొండ హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్స్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల సమావేశాలు జరిగాయి.

ఈ సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు కోతలు మొదలయ్యాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుతో విద్యావంతులు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి బిట్స్ పిలానీలో చదివిన విద్యావంతుడని, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఓ యూ ట్యూబ్ చానెల్ పెట్టి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న పల్లీ బఠానీగాడని దుయ్యబట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, చట్టసభల్లో ప్రశ్నించేందుకు గోల్డ్ మెడలిస్ట్ కావాలో.. బ్లాక్‌మెయిలర్ కావాలో పట్టభద్రులు ఆలోచించుకుని ఓటేయాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నరకం వడ్లకే ఇస్తామనడం, దొడ్డు రకాలకు ఇవ్వలేమని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. కాంగ్రెస్ పాలనలో కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్నవి కూడా వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, వరంగల్ నగరంలో ఆరు ఐటీ కంపెనీలు తమ హయాంలో తీసుకువచ్చామని ఆయన అన్నారు. కాంగ్రెస్ వైఖరితో టెక్ మహీంద్ర లాంటి కంపెనీ వాపస్ వెళ్లిపోతుంటే స్పందన లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో వరంగల్‌లో 24అంతస్తుల ఆస్పత్రి నిర్మిస్తే నిర్మాణ పనులు ఆగిపోయాయని, ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ఆస్పత్రి అయిన ఎంజీఎంలో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి రోగులు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోలేదన్నారు. రేవంత్‌రెడ్డి గొప్ప మెజీషియన్ అని కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు కాయితాలు ఇచ్చి గొప్పల చెప్పుకుంటున్నాడని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డిని గెలిపించాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పోస్టు చేసిన వీడియోను సమావేశంలో కేటీఆర్ ప్రదర్శించారు.



అనంతరం బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుణగణాలను చూసి పట్టభద్రులు ఓటు వేయాలన్నారు. మండలిలో ప్రశ్నించే గొంతుక, పరిష్కరించే గొంతుక రాకేష్‌రెడ్డి అని, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బూతు పదాలు వినిపించే వ్యక్తి అన్నారు. ఈ ఎన్నికలు ఆశయానికి, అహంకారానికి, త్యాగానికి, ద్రోహానికి మధ్య జరుగుతున్నవని పేర్కొన్నారు. విద్యావంతు డు, అన్ని సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి రాకేష్‌రెడ్డికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యేలు పెద్దిసుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, మధుసూధనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సతీష్, చల్లా ధర్మారెడ్డి, డా.రాజయ్య, బాల్క సుమన్, ఉమ్మడి జిల్లా, నియోజకవర్గాల నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి, పెద్ది స్వప్న, మాచర్లశరత్‌చంద్ర, మునుగాల వెంకటరెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, నెల్సన్, నీలం రాజ్‌కిశోర్, సయ్యద్ మసూద్, దాచెపెల్లి సీతారాం, సాంబారి సమ్మారా వు, డాక్టర్ హరి రమాదేవి, క్యాతం రంజిత్, చిలువేరి పవన్, మోడెం ప్రవీణ్, నారదాసు లక్ష్మణ్‌రావు, సుధీర్‌కుమార్, మర్రి యాదవ రెడ్డి, వాసుదేవరెడ్డి, రవిందర్‌సింగ్, జోరిక రమేశ్, జనార్ధన్‌గౌడ్, వీరేందర్, చింతల యాదగిరి, పులి రజనీకాంత్, పలువురు కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

- కాంగ్రెస్ సర్కారులో కరెంటు కోతలు
- ఒక్క నోటిఫికేషన్ ఇవ్వని వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి
- బ్లాక్ మెయిలర్ కావాలో.. గోల్డ్ మెడలిస్టు కావాలో ఆలోచించుకోవాలి
- 'పట్టభద్రుల'కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల సమావేశాలకు హాజరు

### మేధావులు ఆలోచించి ఓటేయండి : రాకేష్‌రెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులు ఆలోచించి ఓటు వేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించని, నోటి ఫికేషన్ ఇవ్వని, నిరుద్యోగ భృతి ఇవ్వని, మెగా డీఎస్సీ ప్రకటించని, ఉద్యోగులకు డీఏ హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, ఉద్యోగులు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తనకు అవకాశం కల్పిస్తే అన్ని వర్గాల పక్షాన మండలిలో ప్రభుత్వాన్ని సమస్యలపై నిలదీస్తానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వానికి తొత్తుగా ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోరన్నారు.



సమావేశానికి హాజరైన పట్టభద్రులు

## 'కాళేశ్వరం'లో సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం

- మూడుగంటల పాటు పర్యటన
- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పరిశీలన
- అణువణువూ అధ్యయనం.. పరిస్థితులపై ఆరా
- ఇంకా నిర్వహించాల్సిన పరీక్షలపై సూచన



మేడిగడ్డ బ్యారేజీ 20వ పిల్లరు వద్ద వివరాలు తెలుసుకుంటున్న శాస్త్రవేత్తలు



అన్నారం బ్యారేజీ వద్ద వివరాలు తెలుసుకుంటున్న బృందం

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, మే 22 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదే వపూర్ మండలంలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్( సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణుల బృందం బుధవారం పరిశీలించింది. పూణెకు చెందిన జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్ శాస్త్రవేత్త జేఎస్ ఎడ్లబాద్కర్, జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ శాస్త్రవేత్త డా.ధనుంజయ నాయుడు, ఎన్‌డీటీ స్టడీస్ శాస్త్రవేత్త ప్రకాష్ పాలయి బృందం తొలుత అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని భోజనానంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుని 7వ బ్లాకులో కుంగిన 20వ నెంబరు పిల్లరుతో పాటు దానికి ఇరువైపులా ఉన్న 19,20వ పిల్లర్లు, గేట్లను పరిశీలించారు. పిల్లరు కుంగుబా టుకు గల కారణాలను అన్వేషించి.. బ్యారేజీ ఎగువ ప్రవాహం, దిగువ ప్రవాహాలను పరిశీలించి కుంగు బాటుకు గల కారణాల గురించి రామగుండం సీఈ సుధాకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బ్యారే జీ భద్రతకు ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు, కుంగుబాటుకు సంబంధించి నిర్వహించిన పరీక్షల గురించి ఆరా తీశారు. బ్యారేజీ పునరుద్ధరణతో పాటు ప్రస్తుతం బ్యారేజీ రక్షణకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాల వివరాలను తెలుసుకున్నారు. సుమారు గంటన్నర పర్యటన అనంతరం మేడిగడ్డ నుంచి నేరుగా అన్నారం బ్యారేజీకి వెళ్లిన బృందం అక్కడ మరో గంటన్నర పర్యటించారు. తొలుత బ్యారేజీ అధికారులతో కలిసి సమీక్షించిన అనంతరం బ్యారేజీలోని సమస్యాత్మకమైన 28,35,38,44 గేట్ల వద్ద క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈగేట్ల వద్ద లీకేజీ, సీపేజీ ఎర్పడటానికి గల కారణాలు ఎంటనేది అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ ఎగువ ప్రవాహం, దిగువ ప్రవాహాలను పరిశీలించిన బృందం సీసీ బ్లాక్‌లు కొట్టుకుపోవడానికి గల కారణాలకు అడిగితెలుసుకున్నారు.

### పరిశీలించి.. పరీక్షించి..

మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో సుమారు మూడు గంటల పాటు పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం ఇరు బ్యారేజీల్లో ఇప్పటి వరకు చేపట్టిన పరీక్షలపై అధ్య యనం చేశారు. ప్రధానంగా ఇరుబ్యారేజీల్లో ఎర్పడిన సమస్యలు, వాటికి గల కారణాలను తెలుసుకున్న బృందం బ్యారేజీల శాశ్వత మరమ్మ తులకు తీసుకోవాల్సిన చర్యలపై వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీ పునురుద్ధరణకు సంబంధించి చేయాల్సిన పరీక్షలతో పాటు సమకూర్చుకోవాల్సిన సాంకేతిక పరికరాల గురించి కూడా ఆ నివేదికలో పొందుపరుస్తామన్నారు. ఈ బృందం సూచించిన పరీక్షల ఆధారంగానే ఇంజనీరింగ్ అధికారులు బ్యారేజీల్లో శాశ్వత, తాత్కాలిక ప్రాతి పాదికన పనులు చేపట్టనున్నట్లు ఓఅధికారి వివరించారు. అన్నారం బ్యారేజీ పర్యటన అనంతరం కాళేశ్వరం హరితా హోటల్‌కు వెళ్లిన శాస్త్రవేత్తల బృందం గురువారం ఉదయం సుందిళ్ల బ్యారేజీని పరిశీలించనున్నట్లు సమాచారం. నిపుణుల బృందం వెంట ఎస్‌ఈ కరుణాకర్, ఈఈలు యాదగిరి, తిరుపతిరావు, డీఈఈ సురేష్, తదితరులున్నారు.

## రైతులు ధాన్యంలో తడి లేకుండా చూడాలి

- నెలాఖరులోపు ధాన్యం సేకరణ పూర్తి చేయాలి
- అధికారులు అందుబాటులో ఉండాలి : కలెక్టర్



పరకాల మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పరకాల/ఆత్మకూరు, మే 22: ఇటీవల కురిసిన వర్షాలకు తడిసి ముద్దయిన ధాన్యాన్ని రైతులు పలుచగా ఆరబోసుకొని ధాన్యంలో తడి లేకుండా చూసుకోవాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. బుధవారం పరకాల పట్టణంలోని వ్యవసాయమార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల చివరి వరకు ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తూ ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కాంటాలు నిర్వహించాలన్నారు. రైతుల కూడా అధికారులకు సహరిస్తూ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, వ్యవసాయాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారులు అందుబాటులో ఉండాలి

రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పెంచికలపేట వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. వరికోతలపై కలెక్టర్ ఆరా తీసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోతల అనంతరం వరిధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు ఇవ్వాలని నిర్లక్ష్యం వహించొద్దని, కార్యాలయాలకే పరిమితమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డీఏవో నాగేశ్వరరావు, నోడల్ అధికారి విజభాస్కర్ రెడ్డి, అధికారులు దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆస్పత్రుల్లో రాష్ట్ర వైద్య మండలి తనిఖీలు

- అర్హతకు మించి ఆర్ఎంపీలు, పీఎంపీలు వైద్యం చేయొద్దు
- రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నరేశ్‌కుమార్

వరంగల్ మెడికల్, మే 22: వరంగల్, కా జీపేట, హనుమకొండలో వైద్యటాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు, టీఎస్ఎంసీ యాంటీ క్వాకరీ బృందం పలు ప్రథమచికిత్స కేంద్రాలను, ఆస్పత్రులను, ఫిజియోథెరపీ సెంటర్లను తనిఖీ చేశాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, డాక్టర్ నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్ఎంపీ, పీఎంపీలు హద్దులుమీరి, వచ్చీరాని వైద్య చికిత్స అందిస్తూ అమాయక ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా ఇష్టారీ తిలో డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఆయుర్వేదం, ఫిజియోథెరపీ, యునానీ చేసిన వైద్యులంతా అల్లోపతి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఈ నకిలీ వైద్య వ్యవస్థపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలిలో రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా వైద్యం చేస్తే తదుపరి తీసు కునే చర్యలు బాధ్యత వహించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ప్రథమ చికిత్స కేంద్రాలకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపుల నుంచే నకిలీ వైద్యులు రాసే ప్రిస్క్రిప్షన్‌తో యాంటీ బయోటిక్స్, స్టెరియిడ్స్ ఇంజక్షన్లు సరఫరా అవుతున్నాయని, ఈషాపులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో వైద్య టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు డాక్టర్ మాగంటి శేషుమాధవ్, డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ ఎం.సుదీప్, అన్వర్‌మియా, కొలిపాక వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.
















# రేపు పాలిసెట్

- వరంగల్‌లో 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 5,624 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్-2024 శుక్రవారం జరుగనుంది. ఇందుకోసం ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పాలిసెట్ వరంగల్ కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించరని ఆయన స్పష్టం చేశారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 5,624 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. కాగా పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కన్వీనర్ ప్రభాకర్ తెలిపారు.



ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్

**పాలిసెట్ పరీక్ష కేంద్రాలివే..**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, వరంగల్, ఏవీవీ జూనియర్ కళాశాల, లాల్‌బహదూర్ డిగ్రీ కళాశాల, లాల్‌బహదూర్ పీజీ కళాశాల, లాల్‌బహదూర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ, మాస్టర్‌జీ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, న్యూసైన్స్ డిగ్రీ కాలేజ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ డిగ్రీ, చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల.





# ఫైనల్స్‌కు ములుగు, జనగామ జిల్లాల జట్లు

వరంగల్ స్పోర్ట్స్, మే 22: వరంగల్ క్రికెట్ దిగ్గజం, హెచ్‌సీఏ క్రికెట్ కోచ్ జయప్రకాష్ మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీలో వేరు వేరు జట్లు మధ్య జరిగిన సెమీఫైనల్స్‌లో ములుగు, జనగామ జట్లు అత్యుత్తమ ప్రతిభతో రాణించి ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేట సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో బుధవారం హనుమకొండ - జనగామ జట్లు మధ్య హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్స్‌లో హనుమకొండ జిల్లా జట్టుపై జనగామ జిల్లా జట్టు 25పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన జనగామ జట్టులో ప్రదీప్ 49 పరుగులు చేసి చివరివరకు క్రీస్‌లోనే నిలిచి 158 పరుగుల భారీ స్కోర్ సాధించడంలో కీలక భూమిక పోషించాడు. బదులుగా బరిలోకి దిగిన హనుమకొండ జిల్లా జట్టు తొలి 10ఓవర్లు దాటే సరికి విజయానికి చేరువైనా మిడిల్ ఆర్డర్ విఫలం కావడంతో 19.1 ఓవర్లు ఎదుర్కొని 133 పరుగులు ఆల్‌ఔట్ అయింది. దీంతో 25పరుగుల తేడాతో జనగామ జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది.

అదే విధంగా మరో రెండు జట్లు ఆతిథ్య వరంగల్ వర్సెస్ ములుగు జట్లు మధ్య జరిగిన సెమీ ఫైనల్స్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు.. 20 ఓవర్లను ఎదుర్కొని 8వికెట్ల నష్టానికి 127పరుగులు చేసింది. తదపరి బ్యాటింగ్ బరిలోకి దిగిన ములుగు జట్టు 6వికెట్ల నష్టంతో 19.4 ఓవర్లలో 131 పరుగులు సాధించి 4 పరుగుల తేడాతో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టుపై ములుగు జిల్లా జట్టు విజయకేతనం ఎగరవేసింది. కాగా, ములుగు జిల్లా జట్టులో అన్వేష్ 6బౌండరీలు, 2సిక్సర్లతో రాణించి ములుగు జిల్లా జట్టు గెలుపులో కీలకంగా వ్యవహరించారు. దీంతో సెమీ ఫైనల్స్ విజయ కేతనం ఎగరవేసిన ములుగు, జనగామ జిల్లా జట్లు గురువారం జరగనున్న ఫైనల్స్‌లో తలపడనున్నాయని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 24నుంచి 29వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న సీనియర్స్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు.











# పెద్దాస్పత్రికి నిర్లక్ష్యపు జబ్బు!

## వరంగల్ ఎంజీఎంపై కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ

- వైద్యాధికారుల పట్టింపులేక రోగులకు ఇబ్బందులు
- గాంధీ ఆస్పత్రి ప్రతిష్టను దిగజారుస్తున్న వరుస సంఘటనలు
- సీఎం సారు.. ఎంజీఎంను ప్రక్షాళన చేసేదెప్పుడో?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా పేరున్న వరంగల్ నగరంలోని మహాత్మాగాంధీ మెమోరియల్ ఆస్పత్రి నిర్లక్ష్యపు జబ్బు అంటుకుంది. ఈ పెద్దాస్పత్రికి ఉమ్మడి వరంగల్‌తో పాటు కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా వైద్యం కోసం ప్రజలు వస్తుంటారు. నిత్యం వేలాది మంది వివిధ వ్యాధులకు చికిత్స కోసం అస్పత్రిలో చేరుతుంటారు. ఇక్కడ ప్రధానంగా ఎంజీఎంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థో, ట్రామా కేసులు, న్యూరో సర్జరీ, ఈఎన్‌టీ, ఎమర్జెన్సీ మెడిసిన్‌తో పాటు పిల్లలకు సంబంధించిన చికిత్సలు నిర్వహిస్తున్నారు. నిపుణులైన వైద్యులు ఎంజీఎంలో ఉండటంతో చికిత్సపై నమ్మకంతో వస్తున్న రోగులకు ఎంజీఎం పెద్ద దిక్కుగా ఉంది. కాకతీయ మెడికల్ కాలేజీ అనుబంధంగా ఉండటంతో జూనియర్ డాక్టర్లు కూడా అందుబాటులో ఉంటున్నారు. అయితే ఎంజీఎం అస్పత్రిలో సౌకర్యాలు మాత్రం రోగులను, వారి బంధువులను అవస్థలకు గురి చేస్తున్నాయి.

### వైద్యాధికారుల నిర్లక్ష్యం

వందలాది మంది రోగులు దేవాలయంగా భావించే వరంగల్ ఎంజీఎంలో వైద్యాధికారుల నిర్లక్ష్యం అస్పత్రి ప్రతిష్టను దెబ్బతీస్తోందన్న చర్చ జరుగుతోంది. కొద్దిరోజులుగా ఎంజీఎంలో జరుగుతున్న వరుస సంఘటనలతో ఎంజీఎంకు రావాలంటేనే రోగులు భయపడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు పైగానే ఎంజీఎంకు కరెంట్ సరఫరా నిలిచిపోవటం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఎంజీఎంలాంటి పెద్ద అస్పత్రిలో ఐదు నిమిషాలు కరెంట్ పోతేనే వెంటిలేటర్‌పైన ఉన్న రోగుల పరిస్థితి అర్థం కాదని, అలాంటిది ఐదుగంటలకు పైగా విద్యుత్ లేకపోతే పరిస్థితేంటన్న చర్చ జరుగుతోంది. మంగళవారం సాయంత్రం 4.30గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుమారు ఐదు గంటలపాటు ఎంజీఎంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం రోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. దీంతో ఒక్కసారిగా అత్యవసర వైద్యవిభాగాలైన ఐసీయూ, ఆర్ఐసీయూ, గుండె జబ్బుల వార్డు, ఆపరేషన్ థియేటర్, ఈఎన్టీ, ఆర్థోపెడిక్, పిల్లల వార్డులోని ఎన్ఐసీయూ, పీఐసీయూ తదితర వార్డుల్లో వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్న రోగులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు బాధితులు సెలైన్‌బాటిళ్లతో బయట కూర్చోవలిసి వచ్చింది. అస్పత్రి చరిత్రలోనే ఐదు గంటలు కరెంట్ సరఫరా నిలిచిపోవటం ఇదే తొలిసారి అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడం సహజమేనని, కానీ, అత్యవసర పరిస్థితుల్లో కరెంట్‌ను అందించేందుకు ఉన్న నాలుగు జనరేటర్లలో ఒక్కటి కూడా సమయానికి పని చేయకపోవడాన్ని చూస్తే ఎంజీఎంపై అధికారుల చిత్తశుద్ధి ఏ మేరకు ఉందో అర్థమవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంజీఎంలో కరెంట్ పోతే దానికి ప్రత్యామ్నాయం చర్యలు తీసుకోకపోవడం వైద్యాధికారుల నిర్లక్ష్యమే అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు జనరేటర్లలో ఆగమేఘాల మీద ఒకదాన్ని అప్పటికప్పుడు మరమ్మతులు చేసి విద్యుత్ అందించినా రోగులు మాత్రం ఐదుగంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈఘటనపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎంలో కరెంట్ పోతే ప్రత్యామ్నాయమే లేదా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### పనిచేయని ఏసీలు

కొంతకాలంగా ఎంజీఎంలో ఏసీలు పని చేయకపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మే నెలలో ఎండల తీవ్రత, ఉక్కపోత పెరిగాయి. ఎంజీఎం పిల్లల వార్డు(పీడియాట్రిక్ కేర్ యూనిట్)లో అమర్చిన ఎనిమిది ఏసీలు ఒక్కసారిగా పని చేయకపోవటంతో పసికందులు తల్లడిల్లిపోయారు. ఫ్యాన్ల నుంచి వచ్చే వేడి గాలి, ఉక్కపోతలను పిల్లలు, బాలింతలు తట్టుకోలేకపోయారు. రెండువారాలు కావస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఏసీలు పని చేయటం లేదని రోగులు వాపోతున్నారు. రూ.కోట్లలో బడ్జెట్ ప్రభుత్వం కేటాయిస్తున్నా ఎంజీఎంలో అధికారుల నిర్లక్ష్యంతో రోగులకు కష్టాలు తప్పటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ మహానగరంలో పొగ కాలుష్యం ఎక్కువ. ఎంజీఎం ఉన్న ప్రాంతంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంజీఎంలో విరివిగా చెట్లను పెంచి రోగులకు ప్రాణవాయువును అందించాల్సి ఉంది. అయితే ఇటీవల కాలంలో ఎంజీఎంలో ఉన్న చెట్లను నరికి వేయడంలో రోగుల బంధువులు చెట్ల కింద కూడా సేద తీరకుండా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఆక్సిజన్ ఇచ్చే చెట్లను తొలగించటం వల్ల వేడిగాలులు, ఎండ తీవ్రత ఎక్కువై రోగులు అవస్థలకు గురవుతున్నారు. ఇటు చెట్లను ఉండనివ్వరు... అటు ఏసీలు పని చేయవు.. దీంతో అస్పత్రిలో వైద్యమే నరకంగా మార్చి ఎంజీఎం అస్పత్రి ప్రతిష్టను కొందరు వైద్యాధికారులు దిగజార్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మార్చురీలో కంపుకొడుతున్న శవాలు

'సచ్చినంక కూడా సుఖం లేదంటే ఇదేనేమో..' అనే దానికి వరంగల్ ఎంజీఎంలోని మార్చురీ నిదర్శనంగా నిలుస్తోంది. మార్చురీ నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారన్న చర్చ జరుగుతోంది. నిత్యం పదుల సంఖ్యలో మృతదేహాలు ఎంజీఎం అస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం వస్తుంటాయి. కొన్ని గుర్తు తెలియని శవాలను కూడా పోస్టుమార్టం నిర్వహించి మార్చురీలో భద్రపరుస్తారు. మరికొన్ని రాత్రిపూట మార్చురీకి వస్తుండటంతో ఉదయం 10గంటల వరకు ఫ్రీజర్లలో భద్ర పరుస్తారు. అయితే మార్చురీలో ఉన్న ఏసీలు కూడా పని చేయకపోవటంతో మృతదేహాలు కుళ్లి కంపుకొడుతున్నాయి. మార్చురీలో నాలుగు ఫ్రీజర్లు ఉండగా, 20రోజుల కిందట మార్చురీలో ఫ్రిజర్లు పనిచేయకపోవడంతో మార్చురీ సిబ్బంది, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికీ కొన్ని ఫ్రీజర్లతో పాటు ఏసీలు పని చేయడం లేదు.



సీలింగ్ ఫ్యాన్లు పనిచేయకపోవడంతో రోగుల కోసం వారి బంధువులు తెచ్చిపెట్టిన టేబుల్ ఫ్యాన్లు



ఎంజీఎం మార్చురీ



ఎంజీఎం ఆస్పత్రిలో అధికారులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

## ఎంజీఎంను పరిశీలించిన కలెక్టర్

వరంగల్ ఎంజీఎంలో ఐదు గంటల పాటు కరెంట్ సరఫరా నిలిచిపోవటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ఎంజీఎంను సందర్శించి, కరెంట్ సరఫరాలో అంతరాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎదురైనా ఇబ్బందులపై ఆరా తీశారు. అయితే కరెంట్ లేకపోయిప్పటికీ ఎంజీఎంలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదని వైద్యులు కలెక్టర్‌కు తెలిపారు. డయాలసిస్ విభాగంలో మాత్రమే జనరేటర్ పని చేయలేదని వివరణ ఇచ్చారు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ సెంటర్‌లో జనరేటర్ పని చేయకపోవటంపై వివరణ ఇవ్వాలని ఆమె అధికారులను ఆదేశించారు.

## ఎంజీఎం ప్రక్షాళన ఎప్పుడో?



ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కుకుగా ఉన్న ఎంజీఎంను ప్రక్షాళన ఎప్పుడు చేస్తారని ఓరుగల్లువాసులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కాకతీయ యూనివర్సిటీలో మొదలైన ప్రక్షాళన ఎంజీఎంకు కూడా వర్తింపజేయాలని కోరుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ ఎంజీఎంపై ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు వైద్యులు, మేధావులు, విద్యాంతులతో సమావేశం నిర్వహించి అస్పత్రిలో రోగులకు అందించే వైద్య సేవలపై ఒక కేలండర్ రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా, మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోనే ఎంజీఎం అస్పత్రి ఉంది. అయినప్పటికీ నెల రోజులుగా వరుసగా జరుగుతున్న సంఘటనలపై బాధిత వైద్యాధికారులపై చర్యలు తీసుకోకపోవటంతో అధికారుల్లో నిర్లక్ష్యం మరింత పెరిగిందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఎంజీఎం అస్పత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్షాళన చేపట్టాలని, ఎంజీఎంలో వరుసగా జరుగుతన్న సంఘటనలపై విచారణ జరిపించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఓరుగల్లు ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## 'ఎంజీఎంలో నిలిచిన విద్యుత్'పై విచారణ



వరంగల్ మెడికల్, మే 22: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎంజీఎంలో నిలిచిన విద్యుత్ సరఫరా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి మంత్రి దామోదర నాజనర్సింహ వెంటనే స్పందించారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎంజీఎం అధికారులతో మాట్లాడారు. విద్యుత్ అంతరాయానికి దారితీసిన పరిస్థిలపై ఆరా తీశారు. ఆరు గంటలపాటు రోగులు పడిన అవస్థల విషయంపై విచారణను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఎంజీఎం ఘటనపై విచారణ అధికారిగా నియమించారు. 24 గంటల్లోగా సమగ్ర విచారణ జరిపి విద్యుత్ అంతరాయానికి బాధ్యులు ఎవరు అనే అంశంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి రాజనర్సింహ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు అన్ని ఆస్పత్రులను క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యుత్ వ్యవస్థపై సమగ్ర నివేదిక వారం రోజుల్లో అందజేయాలని కోరారు. ప్రతీ ఆస్పత్రిలో బ్యాక్ వపర్ సిస్టం, మరమ్మతులు, కొత్తవి అనే అంశంతోపాటు పని చేయకుండా ఉన్న జనరేటర్ల వివరాలు ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. విచారణ కార్యక్రమాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రభుత్వ ఆస్పత్రులలో విద్యుత్ అంతరాయం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి, వైద్య విద్యా సంచాలకులు పాల్గొన్నారు.

## రేపు ప్రెస్‌క్లబ్‌లో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

వడ్డెపల్లి, మే 22: హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 24న రాజ్యాంగ పరిరక్షణ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.ఎర్రగట్టు స్వామి, కో కన్వీనర్ ప్రొఫెసర్ జీ.వీరన్న నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, సామాజిక విశ్లేషకుడు బొజ్జా భిక్షమయ్య, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్, హజ్ కమిటీ రాష్ట్ర ఛైర్మన్ ఖుస్రుపాషా, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ రియాజ్ తదితరులు హాజరై ప్రసంగిస్తారన్నారు.

## రేపు డీ కన్వెన్షన్ హాల్‌లో మేధావుల సదస్సు

వడ్డెపల్లి, మే 22: హనుమకొండ హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్‌హాల్‌లో ఈనెల 24న మెగా ఇంటలెక్చువల్ సదస్సును నిర్వహించనున్నట్లు ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం జిల్లా కన్వీనర్ సమ్మిరెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సదస్సులో మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డాక్టర్ జగదీశ్వర్ ప్రసాద్, నాగరాజు, రావుల రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, మే22: పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.1లక్ష 14వేల నగదు, నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకుని 14మందిపై కేసు నమోదు చేశారు. బుధవారం జనగామ జిల్లా చిల్పూర్ మండలం తాటికాయల గ్రామం సమీపంలోని విహంగ రిసార్ట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. దాడులు చేశారు. ఈ దాడిలో నగదుతో పాటు ఒక కారు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకుని 14మందిపై కేసు నమోదు చేశారు.

## బాలపురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సుబేదారి, మే 22: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం తరపున వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన బాల బాలికలకు ఏటా ప్రదానం చేస్తున్న ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు ఔత్సాహిక బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.మధురిమ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి 31 జూలై 2024 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్, టెక్నాలజీ ఇతర రంగాల్లో ప్రతిభ కనబర్చిన బాల బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అర్హులైన వారు తమ దరఖాస్తులను 31 జూలై 2024 లోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సుబేదారిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం (జీ-1, జీ-2)లో సంప్రదించాలని మధురిమ పేర్కొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు

● నల్లగొండ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి హరిచందన ● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, మే 22 : వరంగల్- ఖమ్మం -నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనతో పాటు, ఉప ఎన్నికలు జరిగే 12 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ ఆదనపు కలెక్టర్లు, ఏఆర్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నిక పరిధిలో 600 పోలింగ్ కేంద్రాలు, మరో 5 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. 5లక్షల బ్యాలెట్ పేపర్లు రాష్ట్రస్థాయి నుంచి వచ్చాయని, వాటన్నింటినీ సంబంధిత జిల్లాలకు పంపించామన్నారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సైతం సిద్ధంగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని కేటాయించామని, వీరందరికీ మొదటి విడత శిక్షణ కార్యక్రమాలను సైతం పూర్తి చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటరుఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపును జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేస్తున్నామని, 96 టేబుల్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం సరఫరా చేసిన వైలెట్ కలర్ స్కెచ్‌పెన్, ఇండెలిబుల్ ఇంకులు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటరు ఎడమ చేయి మధ్య వేలుకు ఇండెలిబుల్ ఇంక్ మార్కు చేయాలన్నారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద బయట ప్రదర్శించాలన్నారు. అదేవిధంగా ఓటర్లు ఓటు ఎలా వేయాలో ప్రతీ పోలింగ్‌స్టేషన్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు.

అంతకుముందు కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన.. జిల్లాల అదనపు కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో ఎన్నికలపై సూచనలు చేశారు. ముఖ్యంగా పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను రిసెప్షన్ కేంద్రానికి తీసుకురావడంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన టార్పాలిన్లతో క్లోజ్డ్ కంటైనర్ వాహనాలలో తేవాలని సూచించారు. ఈనెల 24న ఇతర పోలింగ్ సిబ్బంది మెటీరియల్ వస్తుందని, దానిని తీసుకోవాలన్నారు. తక్షణమే పోలింగ్ సిబ్బంది ఉత్తర్వులను పంపించాలని, ఈ నెల 24న పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ చందన దీప్తి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, నల్లగొండ, మిర్యాలగూడ ఆర్డీవోలు, ఏఆర్వోలు రవికుమార్, శ్రీనివాసరావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ చర్యలు



సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం, మే 22: కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మార్చుకున్న వాహనదారుడితోపాటు మార్చిన మెకానిక్‌లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్న ద్విచక్రవాహనదారుల అత్యధిక శబ్దం కలిగిన 261 సైలెన్సర్లను బుధవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయం ఎదుట రోడ్‌రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నుంచి వచ్చిన సైలెన్సర్లను ద్విచక్రవాహనదారులు మార్చడం చట్టరీత్యా నేరమన్నారు. సైలెన్సర్లు మార్చిన వాహనదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు మూడు మాసాల పాటు లైసెన్స్ రద్దు చేసి వాహనం సీజ్ చేస్తామని హెచ్చరించారు. మెకానిక్‌లు సైలెన్సర్ల మార్పును ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభంనాగ్, హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు షుకూర్, శ్రీధర్, నాగబాబు, ఎస్ఐలు పూర్ణచంద్రారెడ్డి, యుగెందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం వరంగల్, హనుమకొండ జిల్లాల డీఐఈవోలు కె.మాధవరావు, ఎ.గోపాల్ ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు జూన్ 3 వరకు జరుగనున్నాయి. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నట్లు డీఐఈవోలు తెలిపారు. కాగా, వరంగల్ జిల్లాలో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఫస్టియర్ 3,579 మంది, సెకండియర్ 2,519 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. హనుమకొండ జిల్లాలో 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఫస్టియర్‌లో 13,014 మంది, సెకండియర్ నుంచి 5,103 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.



ఎంవోయూ కుదుర్చుకున్న నిట్ డైరెక్టర్ సుబుధి, గురుకులాల సంయుక్త కార్యదర్శి నిరూప

## నిట్‌తో 'సాంఘిక గురుకులాలు' ఎంవోయూ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు పెంపొదించేందుకు విద్యా సంబంధిత విషయాలలో నిట్‌తో పరస్పర అవగాహన ఒప్పందాన్ని గురుకుల విద్యాలయాల సంస్థ కుదుర్చుకుంది. బుధవారం వరంగల్ నిట్ క్యాంపస్‌లోని డైరెక్టర్ కార్యాలయంలో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధితో గురుకుల విద్యాలయాల సంస్థ సంయుక్త కార్యదర్శి జి.నిరూప ఎంవోయూపై సంతకాలు చేశారు. విద్యార్థులకు శిక్షణ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి, అధ్యాపకుల వృత్తి పురోగమన కార్యక్రమాలు ఈ ఎంవోయూ ద్వారా పెంపొందుతాయని వారిరువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ టి.కిషోర్‌కుమార్, డీన్స్, గురుకులాల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీయూఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సురేష్

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22: ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని టీపీయూఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నవాత్ సురేష్ కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హనుమకొండ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో సురేష్ మాట్లాడారు. రాష్ట్రంలో పేరుకుపోయిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో పట్టభద్రులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభంలోపే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. 13 జిల్లాలకు సంబంధించిన స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు చేపట్టాలన్నారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. హెల్త్‌కార్డులు అన్ని ఆస్పత్రుల్లో చెల్లుబాటయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న వారికి మినిమమ్ టైంస్కేలును, మోడల్ స్కూల్ సిబ్బందికి జీరో వన్ జీరో కింద వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తిని వీరస్వామిగౌడ్, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ ఎస్. వెంకటనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటరమణ గౌడ్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షుడు పద్మాకర్ రెడ్డి, నాయకులు సతీష్, శేఖర్ వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎడ్ సెట్

### 6 కేంద్రాల్లో 2,376 మంది అభ్యర్థుల హాజరు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22: ఉపాధ్యాయ విద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2024 శుక్రవారం నిర్వహిస్తున్నారు. వరంగల్‌లో ఏర్పాటుచేసిన 6 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2,376 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహిస్తున్న పరీక్షను రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగనుంది. చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, నోబుల్ టెక్నాలజీస్, మోక్షిత కంప్యూటర్స్, వశిష్ట టెక్నాలజీస్‌తో పాటు నర్సంపేటలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరుగనుంది.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



హనుమకొండ టౌన్, మే22: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని గోకుల్‌నగర్, రాంనగర్, అశోక్‌కాలనీ, పోచమ్మగుడి ఏరియా, విద్యానగర్, గాంధీనగర్, అంబేద్కర్‌భవన్, విజయ్‌పాల్‌కాలనీ, బీరకుంట ఏరియా, ఉదయం 9 నుంచి 12 గంటల వరకు.. న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని జూలైవాడ బాసిత్‌నగర్, ఎఫ్‌సీఐకాలనీ, పోలీస్‌కాలనీ, జూలైవాడ ఆటోస్టాండ్, ప్రకాశ్‌రెడ్డిపేట, లోటస్ కాలనీ, గణేశ్‌నగర్ కాలనీ, ఐడల్ పాఠశాల ఏరియా, పెద్దమ్మగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌వీపీరోడ్డు, రియా ఆస్పత్రి, ములుగు ఎక్స్ రోడ్డు, అజర ఆస్పత్రి, న్యూ భద్రకాళి ఆలయం, కాపువాడ ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదని డీఈ పేర్కొన్నారు.

## గ్రానైట్ లారీని అడ్డుకున్న స్థానికులు



లారీని అడ్డుకుని నిరసన వ్యక్తం చేస్తున్నన్న స్థానికులు

కాజీపేట, మే 22: కాజీపేట 63వ డివిజన్ మార్కెట్ రోడ్‌లోని గ్రానైట్ లారీని బుధవారం బృందావన్ కాలనీ వాసులు అడ్డుకున్నారు. లారీల రాకపోకల వల్ల స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రోడ్డు దెబ్బతింటోందని తెలిపారు. అనంతరం కాలనీవాసులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో లారీల రాకపోకలవల్ల జరుగుతున్న ఇబ్బందులను గతంలో కుడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు, మునిసిపల్ కమిషనర్, మైనింగ్ ఏడీకు, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఆరునెలల వరకు నిలిపివేస్తామని క్వారీ యజమానులు దాస్యం వినయ్‌భాస్కర్ సమక్షంలో బాండ్‌పేపర్‌పై రాసిచ్చారని తెలిపారు. ముగ్గురు క్వారీ యజమానులు లారీలను నిలిపివేశారని, నాలుగో వ్యక్తి వల్లపు వెంకటస్వామి మాత్రం స్థానికులపై కేసులు పెట్టి తిరిగి లారీలను నడిపిస్తున్నాడని, స్థానికుల ఇబ్బందులు దృష్ట్యా లారీలను నిలిపి వేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలనీ అధ్యక్షులు బర్ల సరోజ, ప్రధాన కార్యదర్శి మద్దెల భద్రయ్య తోపాటు కమిటీ సభ్యులు ఉన్నారు.

## రైతుల ఆదాయాన్ని స్థిరీకరించేందుకే

# పంటల బీమా పథకం

- వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- పంటల బీమా అమలుపై అవగాహన సదస్సు
- హాజరైన ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ జిల్ల అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ వ్యవసాయం, మే 22: వ్యవసాయంలో కొనసాగేందుకు రైతుల ఆదాయాన్ని స్థిరీకరించడమే పంట బీమా పథకం లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, సీపీవో ఇతర అధికారులకు పంటల బీమా అమలు, మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల మూలంగా ఉత్పన్నమయ్యే అనిశ్చితి కారణాల వల్ల ఏర్పడే ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకోవడమే పంటల బీమా పథకం లక్ష్యమన్నారు. వినూత్నమైన అధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించేలా రైతులను ప్రోత్సహిస్తామన్నారు. రాష్ట్రంలో పంటలు పండిస్తున్న రైతులు నోటిఫై చేయబడిన అన్ని పంటలను పంటల బీమా పథకంలోకి తీసుకురావాలని సూచించామన్నారు. రైతుల ప్రీమియం వాటా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించామన్నారు.

అనంతరం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం హైదరాబాద్, డీడీఏ, ఎస్ఎఫ్ఎస్ఎం మాధవి, ఏడీఏ, ఎస్ఎఫ్ఎస్ఎం పద్మజ హాజరై ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించారు.

జిల్లా వ్యవసాయాధికారి ఉష మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా తగినంత వర్షాలు లేక విత్తబడిన ప్రాంతం బీమా పరిధిలోకి వస్తుందన్నారు. అడవి జంతువుల దాడి లాంటి స్థానిక సమస్యలు కూడా పరిగణలోకి వస్తాయన్నారు. సహజ అగ్ని, తుఫాన్, మెరుపులు, పిడుగులు, వడగండ్లు వంటి నిరోధించలేని ప్రమాదాల కవరేజ్ ఉంటుందన్నారు. అదే విధంగా వాతావరణ ఆధారిత బీమా విషయానికి వస్తే కరువు, డ్రైసెల్, ఉప్పెనలు, వరదలు, విస్తృతంగా వ్యాపించిన తెగుళ్ల, కొండ చరియలు విరిగిపడిన, పిడుగుపాటు, వడగండ్ల వాన లాంటి సహజ ప్రమాదాల కారణంగా ఏరియా ఆధారిత విధానంలో దిగుబడి నష్టాలను అంచనా వేసి ప్రమాద బీమా అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లాల సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యరెడ్డి వర్మ జయంతి



భాగ్యరెడ్డి చిత్రపటానికి నివాలర్పిస్తున్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా

హనుమకొండ కలెక్టరేట్, మే22: సంఘ సంస్కర్త, ఆది ఆంధ్రసభ వ్యవస్థాపకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతిని బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించారు. భాగ్యరెడ్డి చిత్రపటానికి అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పూలమాలవేసి నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వైవీ గణేశ్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి



కల్లాలను సందర్శించి మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట, మే 22: అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. కాజీపేట సమీపంలోని రైతు కల్లాలను బుధవారం చుక్కయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మంత్రివర్గం కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ప్రకటించిందని, రైతు పండించిన దొడ్డురకాల వడ్లకు కూడా రూ.500 బోనస్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పారన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘ కార్యదర్శి సంటి రవి, ఐనవోలు మండల అధ్యక్షుడు మడిగ నాగరాజు, నాయకులు గోపాల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## సామాజిక ఉద్యమకారుడు మల్లన్నను గెలిపించాలి





సమావేశంలో మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22: వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక ఉద్యమకారుడైన తీన్మార్ మల్లన్ననే గెలిపించాలని తెలంగాణ సామాజిక ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ కోరారు. బుధవారం ఎన్డీఎల్‌సీఈ ప్రాంగణంలో ఫూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటనారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆగ్రహానికి గురై పదవీచ్యుతుడైన కేసీఆర్ బలపరిచిన అభ్యర్థిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. యువత, నిరుద్యోగులను గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కేంద్రంలో మోసం చేస్తున్న బీజేపీ బలపరిచిన అభ్యర్థిని సైతం ఓడించి కాంగ్రెస్ బలపరిచిన ప్రశ్నించే గొంతుకైనా తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫూలే ఆశయ సాధన సమితి అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్, ప్రధానకార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, నాయకులు బిక్కు నాయక్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ వంగల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'జీవ వైవిధ్యమే మానవ మనుగడకు ఆధారం'



సదస్సులో మాట్లాడుతున్న అశ్వని తానాజీ వాకడే

వడ్డెపల్లి, మే 22: జీవ వైవిధ్యమే మానవ మనుగడకు ఆధారమని, ఈ వైవిధ్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ జీవ వైవిధ్య మండలి, పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ, జన విజ్ఞాన వేదిక, వనసేవ సొసైటీతో పాటు హరిత స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జీవ వైవిధ్య పరిరక్షణ అవగాహన సదస్సును నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఫారెస్టు మ్యాన్ ఆఫ్ తెలంగాణ, జన సాధన సమితి వ్యవస్థాపకుడు దుశ్శర్ల సత్యనారాయణ మాట్లాడారు. మన భూగ్రహం పైన మాత్రమే ఉన్న అద్భుత జీవ వైవిధ్యాన్ని మనమే కాపాడి రాబోయే మన వారసత్వానికి అందించాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఎఫ్‌వో నాగభూషణం, డీఆర్‌వో వైవీ గణేష్, సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ అనిసూర్ రషీద్ అహ్మద్, మున్సిపల్ ఉద్యాన వన అధికారి బి. రమేష్, జీవ వైవిధ్య మండలి జిల్లా కో ఆర్డినేటర్ లక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ సుభాష్, జేవీవీ ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, అనితారెడ్డి, మండల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి



జిల్లా అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరెడ్డి

న్యూశాయంపేట, మే 22: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని జిల్లా అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి పట్టభద్రులను కోరారు. హనుమకొండలోని గ్రీన్‌స్క్వేర్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం ఎమ్మెల్సీ ఓటర్ల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం కేశవరెడ్డి మాట్లాడుతూ.. రాకేష్ రెడ్డి యువ నాయకులు, మేధావి అని, అమెరికాలో ఉద్యోగం వదులుకుని ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చిన నాయకుడు అన్నారు. రాకేష్ రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాడన్నారు. ఈ సమావేశంలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సెక్రెటరీ వాసికర్ల సత్యనారాయణ, కోశాధికారి అంబటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గుర్రాల ప్రభాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకే పట్టం కట్టాలి

- తెలంగాణను విధ్వంసం చేసిన బీఆర్ఎస్, బీజేపీ
- టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్



మాట్లాడుతున్న కపిలవాయి దిలీప్‌కుమార్, కత్తి వెంకటస్వామి

వడ్డెపల్లి, మే 22: నిరుద్యోగులు, ఉద్యోగులు, పెన్షనర్లు, పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టం కట్టాలని టీపీసీసీ ఎలక్షన్ మేనేజ్ మెంట్ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ కోరారు. బుధవారం హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు టీపీసీసీ అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి గౌడ్ మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఆవిర్భవించిన తెలంగాణను పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్రాన్ని విధ్వంసం చేశాయని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం ఏర్పడితే ఏటా లక్షలాది ఉద్యోగాలు కల్పించి ఉపాధి కల్పిస్తామని నమ్మబలికిన బీజేపీతో పాటు బీఆర్ఎస్‌లు నిరుద్యోగులను మోసం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే 27 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేశామని చెప్పారు. పట్టభద్రుల శాసన మండలికి ప్రజల పక్షాన పోరాడే తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఉద్యోగుల సమస్యల తోపాటు పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు బొనగాని యాదగిరి గౌడ్, బండారి జనార్ధన్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టాలి



రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డిప్యూటీ కంట్రోలర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వినియోగదారుల సంఘాల నాయకులు

కాళోజీ జంక్షన్, మే 22: ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ డిప్యూటీ కంట్రోలర్ విజయ్‌కుమార్‌కు దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కంట్రోలర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీ సమస్యలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయని టాస్క్‌ఫోర్స్ దాడుల్లో భయంకర ఆహార కల్తీ సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని ఆయన తెలిపారు. ఆహార కల్తీ నిరోధానికి వినియోగదారుల సంఘాలతో కలిసి జిల్లా స్థాయిలో ప్రత్యేక నిఘా విభాగాలు ఏర్పాటు చేయాలని దామోదర్ కోరారు. 24 గంటల వరకే నాణ్యతగా ఉండే పాలను రెండు లేదా మూడు రోజుల వరకు నాణ్యతగా ఉండటానికి హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాన్ని కలపడం సర్వసాధారమైందని పసుపులో లెడ్‌క్రోమేట్ కలపడం వల్ల క్యాన్సర్ వ్యాధులు విజృంభిస్తున్నాయని ఆయన వివరించారు. వినియోగదారుల్లో ఆహార కల్తీ పట్ల చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో డాక్టర్ పల్లెపాడు దామోదర్‌తో పాటు సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, క్యాట్కో చైర్మన్ శంకర్‌లాల్, చౌరాసియా ఉన్నారు.

## కళాశాల భూమి ఆక్రమణపై విచారణ చేపట్టాలి





ధర్మసాగర్ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్

ధర్మసాగర్, మే 22: ధర్మసాగర్ మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ జూనియర్ కళాశాల భూమిపై న్యాయ విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్ అన్నారు. బుధవారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో జిల్లా నాయకులు సీతపతి వినయ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల భూమిని కొందరు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీంతో ప్రహరీ నిర్మాణానికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసి, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి రవితేజ, మండల నాయ కులు వంశీ, చందు, శేఖర్, అనిల్, సునీల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## హసన్‌పర్తి సీఐని సన్మానించిన వాకర్స్



సీఐ సురేష్‌ను సన్మానిస్తున్న లెజెండరీ వాకర్స్

వరంగల్ కార్పొరేషన్, మే 22: ఇటీవల విద్యార్థినిని కిడ్నాప్ చేసి వంగపహాడ్ వ్యభిచార గృహాలకు విక్రయించిన ఎనిమిది మంది వ్యక్తులను సకాలంలో అరెస్టు చేసి జైలుకు తరలించిన హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ జువ్వాని సురేష్‌ను లెజెండరీ కేయూ వాకర్స్ అసోసియేషన్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. సీఐ సురేష్ ప్రతిభను గుర్తించిన వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ సైతం శాలువాతో సత్కరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సురేష్‌ను కేయూ మైదానంలో వాకర్స్ సైతం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విధుల్లో ఇంకా మంచి పనులు చేసి పోలీసు శాఖకు గుర్తింపు తీసుకురావాలని వారు కోరారు. ఈ సమావేశంలో కమిటీ నాయకులు సిరిమల్లె సదానందం, బోనగాని యాదగిరిగౌడ్, లింగారెడ్డి, ప్రదీప్, ప్రసాద్, రాజ్‌కుమార్, మోహన్, శ్రీనివాస్, సూర్య పాల్గొన్నారు.

## 'చేపలు పట్టే హక్కు ముదిరాజ్ కులస్థులదే'



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

న్యూశాయంపేట, మే 22: గత ప్రభుత్వ జీవోల ప్రకారం చేపలు పట్టే హక్కు ముదిరాజ్ కులస్థులదేనని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెపా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దేవేందర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు 1964లో ఇచ్చిన జీవో 98 ప్రకారం 29 తెగలు చేపలు పట్టుకోవచ్చని చెప్పారని, అందులో ముదిరాజ్‌లు కూడా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు, పిట్టల రమేష్, కూతురు రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేవాదుల పైప్‌లైన్ లీకేజీ



వృథాగా పోతున్న దేవాదుల నీరు

శాయంపేట, మే 22: మండలంలోని చలివాగు ప్రాజెక్ట్ మత్తడి వద్ద ఉన్న దేవాదుల పైప్‌లైన్ బుధవారం లీకైంది. దీంతో 30అడుగుల ఎత్తుతో భారీగా నీరు వృథాగాపోయింది. గంటల తరబడి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టింపులేకుండా ఉన్నారని స్థానికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎవరూ స్పందించకపోవడంతో పైప్‌లైన్ లీకేజీ అయిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా లీక్‌చేశారా అనే ప్రశ్నలకు సమాధానం లేకుండా పోయింది.

## కేయూ ఇన్‌చార్జ్ వీసీని కలిసిన అకుట్ సభ్యులు



ఇన్‌చార్జి వీసీ కరుణకు పూలమొక్కను అందజేస్తున్న అకుట్ సభ్యులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22: కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా బుధవారం హైదరాబాద్‌లో బాధ్యతలు చేపట్టిన వాకాటి కరుణను అసోసియేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ ప్రతినిధులు కలిశారు. సచివాలయంలో కరుణను మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కరుణ కేయూలోని సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు అకుట్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి పేర్కొన్నారు. కేయూకు మంచి అకడమీషియన్ వీసీగా లేకపోవడంతోనే ఇన్నాళ్లు అనేక సమస్యలు తలెత్తాయని ఆమెకు వివరించామన్నారు. వర్సిటీ భూములను కబ్జా చేసిన వారిని నిబంధనలకు విరుద్ధంగా అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించుకొని మాజీ వీసీ అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు వివరించామన్నారు. ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన తర్వాత వీసీ లాడ్జీ నుంచి కీలక ఫైళ్లు మాయం చేసినట్లు ఇన్‌చార్జి వీసీకి వివరించినట్లు ఆయన తెలిపారు. ఇటీవల అక్రమంగా నియమించిన పాలక పదవులను, టీచర్ల బదిలీలను రద్దు చేయాలని ఆమెను కోరామన్నారు.

అలాగే ల్యాండ్ కమిటీ నుంచి తొలగించబడి భూకబ్జాదారుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబును ఆ స్థానం నుంచి తప్పించాలని కోరామన్నారు. కేయూలో సానుకూల వాతావరణం ఏర్పాటుకు అకుట్ సహకరిస్తుందని ఆమెకు తెలిపామన్నారు. అందుకు స్పందించిన కరుణ కేయూలో సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ జి. బ్రహ్మేశ్వరి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ కె.కిషోర్ కుమార్, ఈసీ మెంబర్లు డాక్టర్ డి.రమేష్, డాక్టర్ ఎస్.సుదర్శన్ తదతరులు పాల్గొన్నారు.

## బరువు తగ్గించే ఆసనాలు

యోగాసనాల అనేక మానసిక శారీరక సమస్యలను తగ్గిస్తాయి. ప్రతి రోజూ కొంచెంసేపు వీటిని సాధన చేయడం వల్ల ఆందోళన తగ్గి విశ్రాంతి లభిస్తుంది. కండరాలు, అంతర్గత అవయవాల పనితీరు మెరుగవడమేకాక, ఆరోగ్యకరమైనరీతిలో బరువు తగ్గడానికి కూడా యోగాసనాలు ఉపయోగ పడతాయి. బరువు తగ్గడానికి సాధన చేయవలసిన ఐదు యోగాసనాలను తెలుసుకుందాం.

**వజ్రాసనం**

చాలా ఆసనాలకు ఈ ఆసనం మూల భంగిమ. దీన్ని సాధన చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. తొడలు పిరుదుల భాగంలో చేరిన కొవ్వు కరుగుతుంది.

**ధనురాసనం**

ఈ ఆసనం వంచిన విల్లులా ఉంటుంది. దీన్ని సాధన చేయడం వల్ల పొత్తి కడుపు బిగుతుగా మారి ఆ ప్రాంతంలో పేరుకున్న కొవ్వు కరుగుతుంది.

**చతురంగ దండాసనం**

చతురంగ దండాసనం చేయడంవల్ల మొత్తం శరీరంలో కదలిక, ఒత్తిడి కలుగుతాయి. ముఖ్యంగా చేతులు, ఛాతీ మరియు పొట్ట ప్రాంతం బిగుసుకు పోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో కొవ్వు కరుగుతుంది.

**వీర భద్రాసనం**

ఇది యుద్ధానికి సిద్ధమైన యోధుని భంగిమలా ఉంటుంది. దీన్ని సాధన చేసేటపుడు తొడ మరియు తుంటి భాగాలపై ఒత్తిడి పడటంతో, ఆయా ప్రాంతాల్లో పేరుకున్న అధిక కొవ్వు కరుగుతుంది,

**సేతు బంధాసనం**

ఇది వంతెనలాగా కనిపించే భంగిమ. దీన్ని సాధన చేయడం వల్ల నాడీ వ్యవస్థబలంగా మారుతుంది. వెన్నునొప్పి నయాటికాల నుండి ఉపశమనం లభించడమేకాక నడుము , పిరుదుల చుట్టూ ఉన్న కొవ్వు కరుగుతుంది.



## జుట్టు నెరుస్తోందా?

కొందరికి ఎక్కువ వయస్సు ఉండదు.. కానీ జుట్టు మాత్రం తెల్లబడిపోతుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిని తెలుసుకొని జాగ్రత్తలు తీసుకుంటే జుట్టు నెరుపును ఆపేయవచ్చంటున్నారు నిపుణులు. ఆ జాగ్రత్తలేమిటో చూద్దాం.

- విటమిన్ బి, విటమిన్ డీ, విటమిన్ ఈ... ఈ మూడింటి వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. అందువల్ల ఈ మూడు విటమిన్లు ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి. అప్పుడు జుట్టు త్వరగా తెల్లబడదు.
- బ్లీచింగ్ వల్ల జుట్టు త్వరగా నెరిసిపోతుంది. అందువల్ల బ్లీచింగ్ ఉన్న సౌందర్యసాధనాలకు దూరంగా ఉండాలి. అంతే కాకుండా జుట్టును బాగా వేడి చేసే డ్రయ్యర్స్‌కు.. రోలర్లకు దూరంగా ఉండాలి. గాఢమైన రసాయనాలున్న సబ్బులు, షాంపులను వాడకూడదు. వీటితో పాటుగా ఈ కింది పద్ధతులను వాడితే జుట్టు తెల్లబడదు.

**నూనెతో:** వారానికి కనీసం మూడు సార్లు రాత్రి పడుక్కొనేముందు కొబ్బరినూనెను తలకు పట్టించాలి. ఆ మర్నాడు ఉదయం లేచి గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.



**ఉల్లిపాయ:** ఒక ఉల్లిపాయను తీసుకొని దానిని మిక్సీలో వేసి బాగా నూరాలి. ఆ రసాన్ని పల్చని బట్టతో వడగట్టాలి. దానిని కుదుళ్లకు పట్టించి అరగంట తర్వాత గోరు వెచ్చని నీటితో కడిగివేయాలి.

**కరివేపాకు:** కరివేపాకు, పెరుగులను సమపాళ్లలో తీసుకొని మెత్తగా నూరాలి. ఆ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్లకు పట్టించి అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగివేయాలి.

**గోధుమగడ్డి:** గోధుమగడ్డిని నానబెట్టి దాని నుంచి రసాన్ని తీయాలి. ఆ రసాన్ని జుట్టుకు పట్టించి అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగివేయాలి.



సెక్స్‌వర్కర్ల హక్కుల కోసం మూడు దశాబ్దాలుగా ఉద్యమం సాగిస్తున్నారు తిరుపతికి చెందిన సామాజిక కార్యకర్త **మీరా రాఘువేంద్ర**. అందుకోసం 'ఉమెన్స్ ఇనీషియేటివ్' సంస్థను నెలకొల్పారు. సెక్స్‌వర్కర్లను అసంఘటిత మహిళా కార్మికులుగా గుర్తించాలన్నది ఆమె ప్రధాన డిమాండ్. మరోవైపు మహిళా రైతులను, కూలీలను సంఘటితం చేసి... వారికి ఆధునిక వ్యవసాయ పద్ధతుల మీద అవగాహన కల్పిస్తున్నారు. "ఈ భూమి మీద ప్రతి మనిషికి సమానమైన గౌరవం దక్కాలన్నదే నా అభిమతం" అంటున్న మీరా తన సుదీర్ఘ సామాజిక, సేవా అనుభవాలను 'నవ్య'తో పంచుకొన్నారు.

## మహిళలకు గౌరవం...

# చొరవ... చైతన్యంతోనే

"ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, మానవ కల్పిత విపత్తులు ఎదురైనా, కొత్త జబ్బులు ఎవైనా సంక్రమించినా మొట్టమొదట అత్యంత తీవ్రంగా నష్టపోయేది మహిళలు. కాబట్టి ప్రతికూల పరిస్థితులను అవగాహన చేసుకొని, సమస్యల సుడిగుండాల నుంచి బయటకు రావడానికి... మహిళలకు వ్యక్తిగత చైతన్యం అవసరం. అలాంటి చైతన్యం పొందడానికి మనమే చొరవ తీసుకోవాలనీ, మన జీవితాల్ని మనమే కాపాడుకోవాలనీ నేను నమ్ముతాను. ఇదే భావనతో ముప్పై ఏళ్ళ కిందట తిరుపతిలో 'ఉమెన్స్ ఇనీషియేటివ్' స్వచ్ఛంద సంస్థ ప్రారంభించాను. అప్పటినుంచి సెక్స్‌వర్కర్లతో కలిసి వారి హక్కుల కోసం ఉద్యమిస్తున్నాను. పితృస్వామ్య వ్యవస్థలో ఇంటా బయటా మహిళలు ఎదుర్కొనే హింస అంతాఇంతా కాదు. అందులోనూ సెక్స్‌వర్కర్స్ లాంటి వృత్తిలో జీవితాన్ని గడుపుతున్న మహిళలు మరింత హింసను అనుభవించడం, దుర్భర జీవితాన్ని గడపడం కళ్లారా చూస్తూ ఊరుకోలేకపోయాను. అప్పుడప్పుడే హెచ్ఐవీ, ఎయిడ్స్ కేసులు ప్రబలుతున్న రోజులవి. దానివల్ల మహిళలు ఎక్కువమంది నష్టపోవడం నన్ను బాధించింది. సెక్స్‌వర్కర్లలోనే కాదు... చిన్నవయసులోనే వివాహమై, భర్తద్వారా ఈ వ్యాధికి గురై, తీవ్ర మనోవ్యథను అనుభవించిన అమ్మాయిలు ఎందరినో చూశాను. ఇదే విషయం మీద రుయా ఆస్పత్రిలో వైద్యుడైన నా భర్త చిత్తూరు ఆనందరావుతో చర్చిస్తే, "హెచ్ఐవీ, ఎయిడ్స్ మీద ముఖ్యంగా సెక్స్ వర్కర్లలో అవగాహన పెంచాలి" అని సూచించారు. అలా నా భర్త ప్రోత్సాహంతో 1994 నుంచి సెక్స్‌వర్కర్ల సమస్యల మీద పనిచేస్తున్నాను. సుమారు 12వేలమందికి మా సంస్థ సేవలు అందుతున్నాయి.

### నన్ను సొంత అక్కగా భావించి...

హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు కండోమ్ వాడకం ఒక్కటే పరిష్కారం కనుక, ఆ విషయంపై సెక్స్‌వర్కర్లకు అవగాహన కల్పించడం మొదలు పెట్టాను. నిరోధ్ ఫొటో ఒకటి చేతపట్టుకొని... రోజూ సాయంత్రం తిరుపతి కోనేరు కట్టమీద వరుసగా కూర్చొన్న సెక్స్‌వర్కర్లు ఒక్కొక్కరి దగ్గరకెళ్లి, "మీ లైంగిక భాగస్వామి తప్పనిసరిగా కండోమ్ వాడేలా చొరవ తీసుకోండి. హెచ్ఐవీ బారి నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి" అని చెబుతుంటే... కొందరు మాత్రమే వినేవారు. ఇంకొందరు నన్ను అనుమానంగా చూసి, పక్కకు తప్పుకొనేవారు. అయినా, నా ప్రయత్నం మాత్రం ఆపలేదు. అదే సమయంలో రోడ్డుమీద ఆడుకుంటున్న ఒక సెక్స్ వర్కర్ కొడుకును అకారణంగా పోలీసులు చిల్డ్రన్ హోమ్‌కు తరలించారు. ఆ సంగతి తెలిసి... పోలీసులతో, లాయర్లతో మాట్లాడాను. ఆ పిల్లాడు తిరిగి ఇంటికి చేరేవరకు ఆ తల్లికి నేను అడుగడుగునా అండగా ఉన్నాను. దాంతో ఆమె నన్ను సొంత అక్కగా భావించి, తన జీవితంలోని కష్టాలన్నింటిని నాతో పంచుకొంది. నా ఉద్దేశం చెప్పడంతో, మిగతా ప్రాంతాల్లోని సెక్స్‌వర్కర్లను కూడా పరిచయం చేసింది. వారికి హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి అవగాహన కల్పిస్తున్న క్రమంలో... పోలీసులు, వీధి రౌడీలు, ఆకతాయిలు డబ్బుకోసం వారిని ఎంతగా హింసిస్తారో తెలిసింది. కొందరు తోడు కోసమో లేదంటే అద్దెకు ఇల్లు ఇవ్వరనో... ఎవరో ఒక పరిచయస్థుడిని భాగస్వామిగా ఎంచుకుంటారు. వాడు వీళ్ళను విపరీతంగా వేధిస్తుంటాడు. "ఈ సమస్యలన్నిటికీ ఒక్కటే పరిష్కారం. అది మీరంతా సమష్టిగా ఉండటమే" అని వారికి అర్థమయ్యేలా చేశాను. దాంతో సెక్స్‌వర్కర్లంతా బృందాలుగా ఏర్పాడ్డారు. ఒకరికి ఆపద వస్తే విగతావారంతా అండగా నిలిచేవారు. అదే సమయంలో ప్రభుత్వం కూడా హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ కార్యక్రమాలను సెక్స్ వర్కర్ కమ్యూనిటీ భాగస్వామ్యంతో నిర్వహించడంతో వారంతా 'కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్లు' (సీబీఓలు)గా ఏర్పడ్డారు. దాంతో మా పని మరింత సులువయింది. అలా పన్నెండేళ్ళపాటు ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో హెచ్ఐవీ మీద విస్తృతంగా అవగాహన కల్పించాం. హెచ్ఐవీ బాధితుల్లో ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పి, వారి పిల్లల చదువును ప్రోత్సహించాం. వారిపట్ల సమాజంలో నెలకొన్న వివక్షను కొంతవరకు నిర్మూలించగలిగాం. ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాన్ని నిర్వహించాం. తద్వారా కొంతమేరకైనా సత్ఫలితాలను సాధించగలిగాం.

### ఆ మార్పు తీసుకురాగలిగాం...

తామేదో తప్పు చేస్తున్నామన్న ఆత్మన్యూనత సెక్స్‌వర్కర్లను బాగా వేధించడం గమనించా. దాంతో తమ దగ్గర మిగిలిన నాలుగు రూపాయలను కూడా 'పాపపు సొమ్ము' అనుకొనేవారు. దాన్ని దాచుకోకుండా దుబారా చేసేవారు. రేపటి రోజు అనేది వారి జీవితంలో ఒకటుందనే ఆలోచన వారెవ్వరిలో నాకు కనిపించలేదు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించేందుకు పెద్దఎత్తున శిక్షణ శిబిరాలు, అవగాహనా తరగతులు నిర్వహించాం. తాము చేస్తున్నది తప్పుకాదన్న భావనను వారిలో కలిగించాం. సమాజంలోని ఇతరులతో సఖ్యతగా మెలిగేలా శిక్షణ ఇచ్చాం. దీనిలో పోలీసులను కూడా భాగస్వాముల్ని చేశాం. మొదట... వారానికి ముప్పై రూపాయలు పొదుపు చేసేలా ప్రోత్సహించాం. అప్పట్లో పోలీసులు చాలావరకు సెక్స్‌వర్కర్లను విపరీతంగా వేధించేవారు. వీళ్ళు అడ్డామీదకెళ్లి సంపాదించిన



సొమ్మును వారు బలవంతంగా లాక్కునేవారు. ఎవరైనా డబ్బు ఇవ్వకుంటే... కక్షసాధింపులు ఉండేవి. కొందరు పోలీసులు లైంగికంగానూ వేధించేవారు. అకారణంగా అరెస్టు చేయడం, కేసు పెట్టడం, లాఠీలతో బాదడం తదితర రూపాల్లో సెక్స్‌వర్కర్ల మీద హింస విపరీతంగా ఉండేది. అదే అదనుగా వీధి రౌడీలు కూడా మరింత రెచ్చిపోయేవారు. ఇటువంటి పరిస్థితుల్లో... అందరూ సంఘటితంగా, అన్యాయానికి వ్యతిరేకంగా ఉద్యమించేలా మా 'ఉమెన్స్ ఇనీషియేటివ్' సంస్థ కృషి చేసింది.

> **రెస్క్యూ హోమ్‌లు సాక్షాత్తూ యమకూపాలే**
>
> 'సెక్స్‌వర్కర్లను అసంఘటిత రంగ మహిళా కార్మికులుగా గుర్తించాలి' అనేది మా ప్రధాన డిమాండ్. అక్రమ రవాణా ద్వారా లేదా బలవంతంగా ఈ వృత్తిలోకి వచ్చినవారెవరూ మేము పనిచేస్తున్న కమ్యూనిటీల్లో లేరు. వీరంతా కుటుంబ పరిస్థితులు అనుకూలించక లేదా కొన్ని అనివార్య కారణాలవల్ల ఇష్టపూర్వకంగానే సెక్స్‌వర్క్‌లోకి వచ్చారు. కనుక వారికి కార్మికుల హక్కులు వర్తింపచేయాలని చాలా కాలంగా అడుగుతున్నాం. 'సేవియర్స్' పేరుతో వీళ్ళనేదో ఉద్ధరిద్దామని రెస్క్యూ హోమ్‌లలో పెట్టడం లాంటి వాటిని మేము మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాం. రెస్క్యూ హోమ్‌లంటే అచ్చంగా యమకూపాలే. వాటివల్ల ఎలాంటి మార్పు లేకపోగా... జీవితం మరింత దుర్భరంగా మారుతుంది. ఈ వృత్తిని మానేయాలని అనుకొన్నవారికి ప్రత్యామ్నాయ జీవనోపాధులు చూపించవచ్చు. సమాజంలో వీరిపట్ల ఉన్న వివక్ష, చులకన భావం పోవాలి. దీన్ని ఒక గౌరవప్రదమైన వృత్తిగా చూడాలి.

### ప్రత్యేక శిక్షణ...

సెక్స్‌వర్కర్లు తమతమ ప్రాంతాల్లో సంఘటితం కావడంతో... క్రమంగా పోలీసుల హింస కూడా చాలావరకు తగ్గింది. కొంతమంది మంచి పోలీసు అధికారులు ఉన్న ప్రాంతాలలో... వేధింపులు ఏమాత్రం ఉండేవి కావు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు విడుదల అయిన తర్వాత, వారి తీరు చాలా మారిందని చెప్పాలి. తిరుపతి, నెల్లూరు, ఏలూరు, కంచికచర్ల తదితర ప్రాంతాల్లోని సీబీఓలతో మేము ప్రస్తుతం పనిచేస్తున్నాం. తద్వారా వారికి చట్టాల మీద అవగాహన కల్పిస్తున్నాం. ట్రాన్స్‌జెండర్లపై వివక్ష రూపుమాపడానికి కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో సమావేశాలు నిర్వహిస్తున్నాం. అలా కర్నూలులోని ఒక కళాశాలవారు ట్రాన్స్ మహిళకు పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులో సీటు ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఇదివరకటిలా భయం భయంగా కాకుండా.. ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లు ఇప్పుడు ప్రభుత్వ అధికారులతో, సిబ్బందితో తమ సమస్యల గురించి ధైర్యంగా చర్చిస్తున్నారు. వారి హక్కుల గురించి మాట్లాడుతున్నారు. ఈమేరకు వారిని చైతన్యవంతుల్ని చేయగలిగాం. మా మార్గదర్శకత్వంతో చాలామంది సెక్స్‌వర్కర్లు వారి పిల్లలను బాగా చదివిస్తున్నారు. హెచ్ఐవీ బాధితుల్లో కూడా ఇప్పుడు ఆనందమయ జీవితాన్ని గడుపుతున్నవారు ఎందరో ఉన్నారు.

### మహిళా రైతులు, కూలీల కోసం...

వ్యవసాయ రంగంలో కనీస గుర్తింపునకు నోచుకోని వారు మహిళా రైతు, కూలీలు. అందులో మహిళా కౌలు రైతుల కష్టాల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిజానికి వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర, అందులోనూ అణగారిన వర్గాల మహిళల శ్రమ వెలకట్టలేనిది. ఇప్పుడు చాలా గ్రామాల్లో భూమిలేని దళిత మహిళలు కౌలు రైతులుగా మారారు. వీరికి వెన్నుదన్నుగా నిలవడం కోసం 'ప్రణీక్ష మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ' ప్రారంభించాం. దీనిలో 300మందికి పైగా సభ్యులున్నారు. ఇందులో కొందరు ఒంటరి మహిళలు కూడా ఉన్నారు. వారికి అధునాతన వ్యవసాయ పద్ధతులమీద శిక్షణ ఇప్పించడం. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వారు పండించిన పంటను వారే నేరుగా అమ్ముకొనే అవకాశాలు కల్పించడం లాంటివి చేస్తున్నాం. షాంపూలు, సబ్బులు, పచ్చళ్ళు లాంటి ఉత్పత్తుల తయారీని ప్రోత్సహిస్తున్నాం. బ్యాంకు రుణాలు, రాయితీలు పొందడానికి వారికి ఉన్న అవకాశాలను తెలియజేస్తున్నాం.

### ప్రతి మనిషికి సమాన గౌరవం

సెక్స్‌వర్కర్ల హక్కుల కోసం పనిచేసినా, మహిళా రైతు కూలీలను కూడగట్టినా 'ఉమెన్స్ ఇనీషియేటివ్' ప్రధాన లక్ష్యం... సామాజిక భద్రతకు నోచుకోని బాధిత మహిళలను ఐక్యం చేయడం, తద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం, సమష్టిగా సమస్యను అధిగమించవచ్చన్న విశ్వాసాన్ని కలిగించడం. ఒకరికొకరు అండగా నిలిచే సంస్కృతిని పెంపొందించడం, వారికి ఉన్న అవకాశాలను, హక్కులను తెలియజేయడం... ఇవన్నీ మేము చేస్తున్న పనుల్లో ప్రధానమైనవి. మనుషులంతా ఒక్కటే. కుల, మత, లింగ, వర్ణ, వర్గ బేధాలకు అతీతంగా ప్రతి మనిషికి సమానమైన గౌరవం ఈ సమాజం నుంచి దక్కాలి. ధనిక, పేద అంతరాలు తగ్గాలి. అందుకోసం నా వంతుగా కృషి చేస్తున్నాను."

• సాంత్వన్

**కౌన్సెలింగ్**

డాక్టర్! రోజంతా ఎండగా ఉన్నప్పుడు, పదే పదే సన్‌స్క్రీన్ అప్లై చేయడం అన్నిసార్లూ సాధ్యపడకపోవచ్చు. ఇలా పైపూతగా ఎండ వేడి నుంచి రక్షణ పొందడానికి బదులుగా 'ఓరల్ సన్‌స్క్రీన్స్' వాడుకోవచ్చని విన్నాను. ఇవెంత వరకూ ఫలితాన్నిస్తాయి? వీటిని ఎలా వాడుకోవాలి? - ఓ సోదరి, హైదరాబాద్.

## నోటి మాత్రల్లో సన్‌స్క్రీన్?



కొంతమందికి సన్‌స్క్రీన్ అలర్జీ ఉంటుంది. ఇంకొందరికి సన్‌స్క్రీన్స్ వాడినా ట్యానింగ్ తప్పదు. అంతే కాకుండా ఎండకు బహిర్గతమయ్యే శరీరం మొత్తానికీ సన్‌స్క్రీన్ అప్లై చేయడం కూడా అందరికీ సాధ్యపడకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఓరల్ సన్‌స్క్రీన్స్ వాడుకోవచ్చు. సాధారణంగా ఇలాంటి ఓరల్ సన్‌స్క్రీన్స్‌లో పాలీపోడియమ్ లూకోటొమస్ అనే కాంపౌండ్ ఉంటుంది. గ్రీన్ టీ ఎక్స్‌ట్రాక్ట్, గ్రేప్ సీడ్ ఎక్స్‌ట్రాక్ట్ లాంటి పాలీఫినాలిక్ కాంపౌండ్స్‌తో కొన్ని ఓరల్ సన్‌స్క్రీన్స్ తయారవుతూ ఉంటాయి. ఎరుపు రంగు పండ్లలో, కూరగాయల్లో ఉండే లికోపిన్, అలాగే వృక్షాధారిత కాంపౌండ్ అయిన ఆస్టాక్సాంథిన్ అనే కాంపౌండ్‌లతో కూడా ఇంకొన్ని ఓరల్ సన్‌స్క్రీన్స్ తయారవుతూ ఉంటాయి. విటమిన్ సి, ఇ, బీటాకెరోటిన్‌లు కూడా సూర్యరశ్మి నుంచి రక్షణ కల్పిస్తాయి. ఈ రకమైన ఓరల్ సన్‌స్క్రీన్స్ ప్రయోగదశలో సత్ఫలితాలనివ్వడమే కాకుండా, ఉపయోగించిన వినియోగదారుల్లో కూడా సత్ఫలితాలనివ్వడం కనిపిస్తోంది. అయితే ఓరల్ సన్‌స్క్రీన్స్ వాడుకున్నంత మాత్రాన చర్మానికి అప్లై చేసే సన్‌స్క్రీన్స్‌ను పూర్తిగా మానేయొచ్చా అంటే అది సాధ్యపడకపోవచ్చు. అలా కాకుండా ఓరల్ సన్‌స్క్రీన్స్‌తో పాటు సాధారణ సన్‌స్క్రీన్స్ కూడా అప్లై చేసుకుంటే ఫలితాలు ఎంతో మెరుగ్గా ఉంటాయి. పిగ్మెంటేషన్, మంగు సమస్య ఉన్నవాళ్లకు ఇవెంతో మంచి ఫలితాన్నిస్తాయి. ఓరల్ సన్‌స్క్రీన్స్ ఉపయోగకరమే అయినా, ప్రతి రోజూ, ప్రతి ఒక్కరూ వాడుకోవడానికి ఇవి పనికి రావు. సన్ అలర్జీలు తలెత్తిన సందర్భాల్లో, విహార యాత్రలకు వెళ్లే సందర్భాల్లో డబుల్ ప్రొటెక్షన్‌గా వాడుకోవడం కోసం మాత్రమే ఓరల్ సన్‌స్క్రీన్స్ ఉపయోగపడతాయి. చర్మ వైద్యులు ఓరల్ సన్‌స్క్రీన్స్‌ను దీర్ఘకాల వినియోగం కోసం సూచించడం లేదు.

**డాక్టర్ స్వప్నప్రియ,** డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్

**'దిక్సూచి' వెబ్ పేజీలో...**
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vpNePIOలో చదవండి.

**స్ఫూర్తి**



**ఆర్థిక సమస్యలు, సామాజిక, లింగ, భాషా భేదాలు లాంటి అవరోధాలను అవలీలగా అధిగమించి, మర్చంట్ నేవీ ఆఫీసర్‌గా ఎదిగింది 25 ఏళ్ల సిమ్రన్ తోరట్. పూణెకు చెందిన సిమ్రన్, కన్న కలను పట్టుదలగా నిజం చేసుకున్న తీరు గురించి తెలుసుకుందాం!**

# మారుమూల పల్లె నుంచి మర్చంట్ నేవీలోకి

పూణెకు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండాపూర్ నుంచి సిమ్రన్ తల్లితండ్రులు ఎప్పుడూ అడుగు బయట పెట్టలేదు. అయినా కూతురు, సప్త సముద్రాలు దాటి, పురుషాధిక్య వృత్తిలోకి అడుగుపెడతానంటే ఆ తల్లితండ్రులు భయపడకుండా వెన్ను తట్టి ప్రోత్సహించారు. కానీ వాళ్లకు ఆర్థిక సమస్య పెద్ద అవరోధంగా మారింది. పూణెలోని మర్చంట్ నేవీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మూడేళ్ల కోర్సుకు 9 లక్షలు వసూలు చేస్తూ ఉండడంతో, సిమ్రన్ తల్లితండ్రులు మరో ఆలోచన లేకుండా, మూడెకరాల వ్యవసాయ భూమిని అమ్మేశారు. నిజానికి ఆ భూమిలో పండే మొక్కజొన్న, గోధుమలు, చెరకు పంటలే వాళ్ల జీవనాధారం. అయినా కూతురి అభీష్టాన్ని నెరవేర్చడం కోసం కడుపు నింపే భూమిని సైతం అమ్మేయాలని నిర్ణయించుకున్నారు. "పెళ్లి నాటికి పదో తరగతి కూడా పాసవ్వని మా అమ్మ నాన్నను ఒప్పించింది. అప్పటికే నాన్న అన్నయ్య చదువు కోసం కొంత భూమిని అమ్మేశాడు. మిగతాది నా కోసం అమ్మడానికి సిద్ధ పడ్డాడు. వ్యవసాయం చేయడానికి భూమి లేకపోవడంతో, ఆయన ఎలక్ట్రీషియన్ వృత్తిలో కొనసాగడం కోసం, ఐటీఐలో శిక్షణ తీసుకున్నాడు. అమ్మ ఇండాపూర్‌లోని ఫెరారో చాక్లెట్ ఫ్యాక్టరీలో పని చేయడం మొదలు పెట్టింది" అంటూ తన కోసం భూమిని త్యాగం చేసిన తన తల్లితండ్రులు బ్రహ్మదేవ్, ఆశా తోరట్‌ల గురించి చెప్పుకొచ్చింది తన కుటుంబంలో, గ్రామంలో, జిల్లాలో మొట్టమొదటి మహిళా మర్చంట్ నేవీ ఆఫీసర్‌గా ఎదిగిన సిమ్రన్.

### లోకుల నోళ్లు మూయించి...

సిమ్రన్ లక్ష్యానికి రెండో అవరోధం సమాజం నుంచి ఎదురైంది. బంధువులు, స్నేహితులు సిమ్రన్ తల్లితండ్రుల తెగింపును విమర్శించడం మొదలుపెట్టారు. ఓడలో నెలల తరబడి ఆడపిల్ల ఉద్యోగం చేయడం సరికాదనీ, ఆడపిల్ల చదువు కోసం అంత డబ్బు ఖర్చు పెట్టడం అవివేకమనీ సిమ్రన్ తండ్రిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. "నాన్న, వాళ్ల అనుమానాల మూలంగా తను తీసుకున్న నిర్ణయం ప్రభావితం కాకుండా జాగ్రత్త పడ్డారు. అలాగే అంతకు కొన్నేళ్ల ముందే ఇంజనీర్‌గా మర్చంట్ నేవీలో చేరిపోయిన అన్నయ్య కూడా మా నిర్ణయానికి అండగా నిలబడి నన్ను ప్రోత్సహించాడు. జపనీస్ షిప్పింగ్ కంపెనీలో థర్డ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న అన్నయ్య, శుభమ్ తోరట్, నా నిర్ణయాన్ని సమర్థించి, కెరీర్‌లో ఎదురయ్యే సవాళ్ల గురించి అవగాహన కల్పించాడు" అని తన లక్ష్యాలకు అందిన కుటుంబ సభ్యుల తోడ్పాటు గురించి వివరించింది సిమ్రన్.



> **సిమ్రన్ లక్ష్యానికి రెండో అవరోధం సమాజం నుంచి ఎదురైంది. బంధువులు, స్నేహితులు సిమ్రన్ తల్లితండ్రుల తెగింపును విమర్శించడం మొదలుపెట్టారు. ఓడలో నెలల తరబడి ఆడపిల్ల ఉద్యోగం చేయడం సరికాదనీ, ఆడపిల్ల చదువు కోసం అంత డబ్బు ఖర్చు పెట్టడం అవివేకమనీ సిమ్రన్ తండ్రిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు.**

### చదువులో తడబడి...

చదివింది మరాఠీ మీడియం. కానీ మారిటైమ్ కాలేజీలో కోర్సు వర్క్ మొత్తం ఇంగ్లీషులోనే సాగడంతో సిమ్రన్ మొదట్లో కాస్త తడబడింది. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ... "నేను ఎనిమిదో తరగతి వరకూ మరాఠీ మీడియంలోనే చదివాను. తర్వాత సెమి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివాను. మర్చంట్ నేవీ కోర్సు మొత్తం ఇంగ్లీషులో సాగడం, పూణె లాంటి నగరంలో ఒక్కదాన్నే ఉండవలసి రావడంతో మొదట్లో బాగా భయపడ్డాను. నా బ్యాచ్‌లో ఉన్న ముగ్గురు అమ్మాయిల్లో నేనొకదాన్ని. మొదటి రౌంట్ ప్లేస్‌మెంట్‌లో నేను రిజెక్ట్ అయ్యాను. ఆ అతి పెద్ద షిప్పింగ్ కంపెనీ నన్ను రిజెక్ట్ చేయడానికి కారణం నాకు ఇంగ్లీష్ భాష మీద పట్టు లేకపోవడమే! దాంతో నేను మొదట్లో బాధపడినా ఇంగ్లీషు భాష మీద పట్టు పెంచుకోవడం కోసం అన్నయ్యతో ఫోన్లో ఆ భాషలోనే మాట్లాడడం మొదలుపెట్టాను. అద్దం ముందు గంటల తరబడి ఇంగ్లీషు భాషను సాధన చేశాను. చివరి ఏడాది క్యాంపస్ రిక్రూట్‌మెంట్ సమయంలో, సీస్పాన్ అనే ప్రపంచంలోనే అగ్ర కంటెయినర్ షిప్ మేనేజ్‌మెంట్ కంపెనీకి నేను ఎంపికయ్యాను. అప్పటివరకూ ఆ కంపెనీ మహిళలను నియమించుకోలేదు. ఆ కంపెనీలో మొట్టమొదటి విమెన్ ఆన్ డెక్ కేడెట్‌గా ఎంపికైన మొదటి మహిళలను నేనే! అలా 2019లో సింగపూర్‌లో నేను ఉద్యోగంలో చేరాను. 24 మంది సిబ్బందిలో ఏకైక మహిళా ఉద్యోగినిగా ఏడు నెలల పాటు విధులు నిర్వహించాను. మొదట్లో సీ సిక్‌నెస్‌తో బాధపడినా నెమ్మదిగా ఆ ఇబ్బంది జయించాను" అని చెప్పుకొచ్చిన సిమ్రన్, పురుష సిబ్బందితో సమానంగా బరువైన టగ్ లైన్స్‌ను లాగడంతో పాటు, పోర్ట్స్‌లో స్వతంత్ర వాచ్‌గా కూడా విధులు నిర్వహించగలుగుతోంది. ఇప్పటివరకూ మూడు ఓడల్లో ప్రయాణించిన సిమ్రన్, థర్డ్ ఆఫీసర్‌గా నాలుగో ఓడలో ప్రయాణించడానికి సిద్ధపడుతోంది. అలాగే సిమ్రన్ తన అన్నతో కలిసి చదువు కోసం అమ్ముకున్న భూమిని తిరిగి కొని, తల్లితండ్రులకు బహూకరించాలనే ప్రయత్నంలో ఉండడం చెప్పుకోదగిన విశేషం.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 23 మే 2024 | 10
cinema@andhrajyothy.com



# కల్కి... నాకు చాలా లక్కీ

ప్రభాస్

"కల్కి 2898 ఏడి' చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మా బక్క డైరెక్టర్ (నాగ్ అశ్విన్) బుజ్జితో నన్ను మూడేళ్లు టార్చర్ పెట్టాడు. బుజ్జి (కారు) బ్రెయిన్ చిన్నదైనా నా బుర్రంతా తినేసింది. ఈ సినిమాలో బుజ్జి, భైరవ, నాగ్ అశ్విన్ ప్రతిభ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది' అని ప్రభాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి అగ్రతారలతో రూపొందుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడి'. దీపికా పదుకొనే కథానాయిక. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. జూన్ 27న ఈ చిత్రం విడుదలవుతోంది. భారీ ఖర్చుతో తెరకెక్కిన ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను కూడా వినూత్నంగా భారీతనం ఉట్టిపడేలా నాగ్ అశ్విన్ నేతృత్వంలో చిత్రబృందం నిర్వహిస్తోంది. బుధవారం 'కల్కి' చిత్రబృందం హైదరాబాద్‌లో 'క్యూట్ స్టార్ బుజ్జి' అనే కారును పరిచయం చేస్తూ బుజ్జి వర్సెస్ భైరవ పేరుతో భారీ ఈవెంట్‌ను నిర్వహించింది. చిత్రబృందంతో పాటు ప్రభాస్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుజ్జి కారును నడుపుతూ ప్రభాస్ సందడి చేశారు. దీనికి సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'నేను చాలా లక్కీ. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి దిగ్గజాలతో నటించే అవకాశాన్ని 'కల్కి' నాకు ఇచ్చింది. కమల్‌సార్‌కి వంద దండాలు. ఇండియా గర్వించే నటుడు అమితాబ్. ఆయన స్ఫూర్తితోనే చాలామంది సినిమాల్లోకి వచ్చారు. 'సాగరసంగమం' చిత్రంలో కమల్‌హాసన్‌ను చూసి ఆయన వేసుకున్న దుస్తులు లాంటివి, కుట్టించుకొని వేసుకున్నాను. ఆ సినిమాలోని ఓ పాటలో ఆయన తలను లయబద్ధంగా ఊపే నాట్య భంగిమ చూసి నేను కూడా అలా చేయాలని ప్రయత్నించాను. దీపిక లాంటి ఇంటర్నేషనల్ స్టార్ ఈ సినిమాలో ఉండడం సంతోషం. దిశా అద్భుతమైన నటి. అశ్వనీదత్ గారు ఈ వయసులోనూ చాలా కష్టపడుతున్నారు. ఆయన ప్యాషన్ చూసి చాలా నేర్చుకోవాలి. సినిమా గ్రాండ్‌గా రావడానికి ఖర్చుకు వెనుకాడ లేదు. నిర్మాతగా 50 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో ఉన్నది బహుశా ఆయనొక్కరే. మొదటి చిత్రాన్నే ఎన్టీఆర్‌తో చేశారంటేనే ఆయన రేంజ్ తెలుస్తుంది. వారి కూతుళ్లు స్వప్న, ప్రియాంక గారికి సైతం అదే ప్యాషన్, తెగింపు వచ్చాయి. వారిని చూసి ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని మా చెల్లెళ్లకు చెబుతుంటాను' అన్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'బుజ్జి... పేరు చిన్నగా అనిపిస్తుంది గానీ, అది చేసే పని మాత్రం మామూలుగా ఉండదు. ఈ సినిమాలో బుజ్జి చాలా స్పెషల్. ఇలాంటి కార్‌ను ఇంజనీరింగ్ చేయడం చాలా కష్టం. ఒక కొత్త తరహా కారు తయారు చేయాలంటే పెద్ద టీమ్ ఉండాలి. ఆనంద్ మహీంద్రా గారు ఆ టీమ్‌ను పంపడం వల్లే బుజ్జి అనే కల సాకారమైంది. దీని తయారీలో మా టీమ్ కూడా చాలా కష్టపడింది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ 'కల్కి' సినిమా గురించి ఒక్కటే మాట చెబుతాను. ఇది రిలీజయ్యేంత వరకూ చిన్న సినిమా. రిలీజయ్యాక చాలా పెద్ద సినిమా' అని అంచనాలు మరింత పెంచారు.

# ఇకపై థియేటర్లకు పర్సంటేజ్ చెల్లించాల్సిందే




ఇతర రాష్ట్రాల తరహాలో నిర్మాతలు పర్సంటేజీ చెల్లించాలనీ, ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించమని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నష్టాలను తట్టుకోలేక . పదేళ్ల కాలంలో దాదాపు రెండు వేల సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూత పడ్డాయని ఆయన వెల్లడించారు.. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లు, ఎగ్జిబిటర్ల సమస్యలపై ఇటీవల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, పలువురు పంపిణీదారులు, నిర్మాతలు, ఎగ్జిబిటర్స్‌తో సమావేశమై ఎగ్జిబిటర్స్‌కు వాటాలపై కొన్ని ప్రతిపాదనలు తయారు చేశాం. దీనిపై నిర్మాతలకు జులై ఒకటి వరకూ గడువు ఇస్తున్నాం. అయితే 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', 'గేమ్ చేంజర్', 'భారతీయుడు 2' చిత్రాలకు మినహాయింపు ఇస్తున్నాం. ఇతర సినిమాలను పర్సంటేజ్ విధానంలోనే ప్రదర్శిస్తాం. కొంతమంది డిస్ట్రిబూటర్స్ సినిమా వ్యాపారాన్ని జూదంలా మార్చారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు ఆటలు ప్రదర్శించం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి బాలగోవింద రాజ్, రవీంద్ర గోపాల తదితర సభ్యులు పాల్గొన్నారు.



# లవ్ మీ.. ఓ డిఫరెంట్ ఫిల్మ్

**టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. విడుదల నేపథ్యంలో హీరో ఆశిష్ బుధవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.**

- నేను ఇదివరకు చేసిన సినిమాలకు భిన్నంగా డార్క్ తరహాలో నా పాత్ర ఉంటుంది. ఎవరైనా ఓ పని చేయవద్దని చెబితే మొండిగా అదే పని చేసే పాత్ర అది. ఇందులో యూ ట్యూబర్‌గా నటించాను. అతని దగ్గరకి ఓ దెయ్యానికి సంబంధించిన కథ వస్తుంది. అప్పుడు అతని జీవితంలో ఏం జరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు అరుణ్‌తో మాట్లాడి హీరో పాత్ర ఎలా కనిపించాలనుకుంటున్నారో తెలుసుకుని ఆ రకంగా నటించా
- ఈ సినిమాలో ఐదారుగురు హీరోయిన్లు ఉంటారు. అయితే సినిమా మొత్తం వారు కనిపించరు. గెస్ట్‌లా అలా వచ్చి వెళుతుంటారు. ఇందులో వైష్ణవిది దెయ్యం పాత్ర కాదు. దివ్యావతి ఆ పాత్ర పోషించారు. వైష్ణవి మరో కీలక పాత్ర పోషించారు.
- ఇందులో నటించడానికి ముందు 'చంద్రముఖి', 'ముని' వంటి సినిమాలు చాలా చూశాను. ఇందులో హారర్ ఒక భాగం మాత్రమే. మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత ఓ డిఫరెంట్ మూవీ చూశామని ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు.
- దర్శకుడు అరుణ్ నవలా రచయిత. ఈ కథను ఆయన చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. దెయ్యంతో మాట్లాడడం, రొమాన్స్ చేయడం.. వంటి అంశాలు కొత్తగా అనిపించాయి. పీసీ శ్రీరామ్, కీరవాణి వంటి లెజెండ్స్ మా సినిమాకు పని చేయడం అంగీకరించడం మాకు ప్లస్ పాయింట్. దర్శకుడు కథ చెప్పిన విధంగా తీస్తాడా అని ఆలోచించి, మొదట పదిహేను రోజులు షూటింగ్ చేసి, బాగా వచ్చిందంటే ముందుకు వెళదాం .. అనుకున్నాం. ఆ సీన్స్ బాగా రావడంతో ప్రొసీడ్ అయ్యాం.
- ఈ సినిమా తర్వాత సెల్ఫిష్ ఉంటుంది. ఆ తర్వాత సితార బేనర్‌లో ఓ సినిమా చేయబోతున్నా.



# మోదీ చిత్రంలో నటించడం లేదు

భారత ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో తను నటించడం లేదని తమిళ నటుడు సత్యరాజ్ స్పష్టం చేశారు. 'ఆ సినిమా గురించి ఇంతవరకూ ఎవరూ నన్ను అడగలేదు. నిరాధారమైన ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో ఆశ్చర్యంగా ఉంది. ఇదంతా సోషల్ మీడియా సృష్టే. ఒకవేళ వారెవరైనా నన్ను అడిగినా ఆ చిత్రం చేయను. నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకోను' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారాయన.

# పారిపోయే పిరికిదాన్ని కాదు



'నేను భయంతో పారిపోయే పిరికిదాన్ని కాదు.. నాకు కొంత బ్రీథింగ్ ప్లేస్ కావాలి. అందుకే రెండు రోజుల్లో మీడియా ముందుకు వస్తా. అందరి పని చెప్తా' అన్నారు నటి హేమ. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను పాల్గొనలేదని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆమె మరోసారి స్పష్టం చేశారు. ఈ రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ కూడా ఉన్నారని బెంగళూరు పోలీస్ కమిషనర్ వెల్లడించిన తర్వాత కూడా తను హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ పేర్కొనడం గమనార్హం. రెండు రోజుల నుంచి కొన్ని వందల ఫోన్ కాల్స్‌కు రిప్లయి ఇస్తున్నాననీ, నిజంగా అంత పెద్ద ఇష్యూలో ఉంటే ఫోన్ తన దగ్గర ఎలా ఉంటుంది అని హేమ ప్రశ్నించారు. తన జీవితంతో ఎవరు ఇలా ఆడుకుంటున్నారో, దీని వెనుక ఏ వెధవలు కుట్ర పన్నుతున్నారో కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాననీ, అన్నీ తెలుసుకుని మీడియాకు చెబుతానని ఆమె అన్నారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో నటి హేమ కూడా పాల్గొన్నారనీ, డ్రగ్స్‌తో దొరికారని నటి కరాటే కల్యాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే పోలీసులకు దొరికిపోయి కూడా హేమ ఇంకా బుకాయిస్తున్నారని 'బిగ్‌బాస్'లో పాల్గొన్న తమన్నా సింహాద్రి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను కూడా ఉన్నానంటూ వచ్చిన వార్తలను యాంకర్ శ్యామల ఖండించారు. ఓ పార్టీకి మద్దతు పలికినందుకే తన గురించి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

# ఫైనల్లో సురేఖ త్రయం

**ఆర్చరీ వరల్డ్‌కప్**



**యెచెయోన్ (దక్షిణకొరియా):** ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-2 కాంపౌండ్ టీమ్ విభాగంలో విజయవాడ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ త్రయం ఫైనల్లో ప్రవేశించింది. బుధవారం జరిగిన సెమీస్ పోరులో సురేఖ, పర్నీ త్ కౌర్, అదితి గోపీచంద్‌లతో కూడిన భారత బృందం 233-229తో అమెరికా త్రయానికి షాకిచ్చింది. శనివారం జరిగే ఫైనల్లో వరల్డ్ నెంబర్. 7 టర్కీ జట్టుతో సురేఖ జట్టు తలపడనుంది. కాగా, పురుషుల కాంపౌండ్ విభాగంలో ప్రియాన్షు, ప్రథమేష్, అభిషేక్ వర్మలతో కూడిన భారత జట్టు కాంస్య పతక పోరులో ఓటమి పాలైంది. ఇక, రికర్వ్ సింగిల్స్ క్వాలిఫయర్స్‌లో దీపిక కుమారి 4వ, తరుణ్‌దీప్ 6వ స్థానాలు సాధించగా, తెలుగు ఆర్చర్ ధీరజ్ టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయాడు.

# సింధు శుభారంభం

**మలేసియా మాస్టర్స్**

**కౌలాలంపూర్:** మలేసియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-17, 21-16తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలుపొందింది. తదుపరి రౌండ్‌లో సిమ్ యు జిన్ (కొరియా)తో సింధు తలపడుతుంది. మరో మొదటి రౌండ్‌లో అస్మిత చలిహా 21-17, 21-6తో లిన్ సి యున్‌పై నెగ్గి ముందంజ వేసింది. అయితే ఆకర్షి కశ్యప్ 24-22, 13-21తో వాంగ్ ఝీ చేతిలో, ఉన్నతీ హుడా 13-21, 18-21తో ఫాంగ్ జీ చేతిలో, కిరణ్ జార్జ్ 16-21, 17-21తో ఒబయాషి చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్/సిక్కిరెడ్డి జోడీ 21-15, 12-21, 21-17తో లీ చున్/పు చి(హాంకాంగ్) జంటపై, పురుషుల డబుల్స్‌లో కృష్ణప్రసాద్/సాయిప్రతీక్ ద్వయం 23-21, 21-11తో మింగ్/టాంగ్‌పై నెగ్గి రెండో రౌండ్‌లో అడుగుపెట్టారు.

# హాకీ ప్రొ లీగ్‌లో భారత్ బోణీ

**ఆంట్వెర్ప్ (బెల్జియం):** ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్‌ను భారత పురుషుల హాకీ జట్టు విజయంతో ప్రారంభించింది. బుధవారం జరిగిన యూరోపియన్ లెగ్ తొలి మ్యాచ్‌లో భారత్ షూటౌట్‌లో 5-4తో అర్జెంటీనాను ఓడించింది. ఇదే వేదికపై జరిగిన మహిళల ప్రొ లీగ్‌లో భారత్ 0-5 గోల్స్‌తో అర్జెంటీనా చేతిలో ఓడింది.

## అర్జున్‌కు ఏడో స్థానం

**షార్జా:** షార్జా మాస్టర్స్ చెస్‌లో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ ఏడో స్థానంతో టోర్నీని ముగించాడు. బుధవారం జరిగిన ఆఖరిదైన తొమ్మిదో రౌండ్‌లో బర్దియా దనేశ్వర్ (ఇరాన్)తో గేమ్‌ను అర్జున్ డ్రా చేసుకున్నాడు. ఇక చివరిరౌండ్‌లో నిహాల్ సరిన్‌తో ప్రణవ్, సఫర్లీ ఎల్తాజ్ (అజర్‌బైజాన్)తో రాజా రిత్విక్ గేమ్‌లను డ్రాగా ముగించారు. మొత్తంగా అర్జున్ 6 పాయింట్లతో ఏడో స్థానంతో సరిపెట్టుకోగా, బర్దియా 6.5 పాయింట్లతో మెరుగైన టైబ్రేక్ స్కోరుతో విజేతగా నిలిచాడు. ప్రణవ్ 5 పాయింట్లతో 23వ, రిత్విక్ 4 పాయింట్లతో 63వ స్థానాల్లో నిలిచారు.




# సచిన్‌కే స్వర్ణం

» వరల్డ్ పారా అథ్లెటిక్స్

**కోబె (జపాన్):** భారత్‌కు చెందిన సచిన్ సర్జేరావు ఖిలారీ ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ షాట్‌పుట్‌లో తన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్నాడు. ఈ క్రమంలో అతడు ఆసియా రికార్డును తిరగ రాశాడు. బుధవారం జరిగిన షాట్‌పుట్ ఎఫ్-46 విభాగంలో ఇనుప గుండును సచిన్ 16.30 మీటర్ల దూరం విసిరి టైటిల్ దక్కించుకున్నాడు. అంతే కాదు గతేడాది పారిస్‌లో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ పోటీలలో తానే నెలకొల్పిన 16.21 మీ. ఆసియా రికార్డును బద్దలుగొట్టాడు. ఈ ప్రదర్శనతో అతడు పారిస్ పారా ఒలింపిక్స్‌కు ఎంపికవడం విశేషం. పురుషుల క్లబ్ త్రో ఎఫ్-51 కేటగిరీలో ధరమ్‌వీర్ కాంస్య పతకం గెలుపొందాడు. ఈ స్వర్ణ, కాంస్యాలతో కలిపి ఈసారి చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల సంఖ్య 12కు చేరింది. ప్రపంచ అథ్లెటిక్స్‌లో పతకాల పరంగా మనోళ్లకిదే అత్యుత్తమ ప్రదర్శన. చైనా, బ్రెజిల్ తర్వాత ఓవరాల్‌గా పతకాల పట్టికలో భారత్ మూడో స్థానంలో ఉంది.

# బెంగళూరు కథ ముగిసె..



## ఎలిమినేటర్‌లో రాజస్థాన్ విజయం
## రేపు క్వాలిఫయర్-2లో హైదరాబాద్‌తో ఢీ



యశస్వీ జైస్వాల్ (45)

**అహ్మదాబాద్:** ఐపీఎల్ టైటిల్ సాధించాలనుకొన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కల మరోసారి భగ్నమైంది. వరుసగా ఆరు విజయాలతో ప్లేఆఫ్స్ చేరుకొన్న బెంగళూరును రాజస్థాన్ రాయల్స్ నాకౌట్ చేసింది. బుధవారం హోరాహోరీగా సాగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ 4 వికెట్ల తేడాతో ఆర్సీబీపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన రాజస్థాన్ ఫైనల్లో చోటుకోసం.. శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. మరోవైపు ఆర్సీబీ టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలుత బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 172/8 స్కోరు చేసింది. రజత్ పటీదార్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34), కోహ్లీ (24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 33), మహిపాల్ లోమ్రోర్ (17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అశ్విన్ (2/19), బౌల్ట్ (1/16) బెంగళూరు బ్యాటర్లను కట్టడి చేయగా.. అవేశ్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రాజస్థాన్ 19 ఓవర్లలో 6 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. యశస్వీ జైస్వాల్ (30 బంతుల్లో 8 ఫోర్లతో 45), రియాన్ పరాగ్ (26 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36), హెట్‌మయెర్ (14 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 26) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. సిరాజ్ 2 వికెట్లు తీశాడు.

**ఆదుకొన్న పరాగ్-హెట్‌మయెర్:** లక్ష్య ఛేదనలో ఓ దశలో ఉత్కంఠ రేగినా.. పరాగ్ బాధ్యతాయుత ఇన్నింగ్స్‌కు హెట్‌మయెర్ ధనాధన్ బ్యాటింగ్ తోడు కావడంతో రాజస్థాన్ విజయం సాధించింది. వీరిద్దరూ 5వ వికెట్‌కు 25 బంతుల్లో 45 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు ముంగిట నిలిపారు. ఓపెనర్లు జైస్వాల్, టామ్ కోహ్లెర్ (20) శుభారంభాన్ని అందించారు. తొలి రెండు ఓవర్లు ఆచి తూచి ఆడినా.. మూడో ఓవర్‌లో యశ్ దయాళ్ బౌలింగ్‌లో జైస్వాల్ నాలుగు బౌండ్రీలతో విరుచుకుపడ్డాడు. మరోవైపు కోహ్లెర్ కూడా ఫోర్లతో బ్యాట్‌కు పని చెప్పడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. అయితే, ఆరో ఓవర్‌లో కోహ్లెర్‌ను ఫెర్గూసన్ బౌల్డ్ చేయడంతో.. పవర్‌ప్లే ముగిసే సమయానికి రాజస్థాన్ 47/1తో మెరుగ్గా కనిపించింది. మధ్య ఓవర్లలో కూడా జైస్వాల్ ఎడాపెడా షాట్లతో జోరు కొనసాగించగా.. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ శాంసన్ (17) అతడికి చక్కని సహకారం అందిస్తూ స్కోరు బోర్డును నడిపించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 35 పరుగులు జోడించారు. అయితే, నాలుగు పరుగుల తేడాతో జైస్వాల్, శాంసన్ వికెట్లు కోల్పోయిన రాజస్థాన్ 86/3తో ఒక్కసారిగా ఇబ్బందుల్లో పడింది. 10వ ఓవర్‌లో జైస్వాల్‌ను గ్రీన్ క్యాచవుట్ చేయగా.. ఆ తర్వాతి ఓవర్‌లో కర్ణ్ బౌలింగ్‌లో శాంసన్ స్టంపౌట్ అయ్యాడు. కోహ్లీ మెరుపు ఫీల్డింగ్‌తో ధ్రువ్ జురెల్ (8) రనౌట్ కావడంతో.. రాయల్స్ శిబిరంలో గుబులు రేగింది. ఈ దశలో పరాగ్‌కు జత కలసిన హెట్‌మయెర్ అటాకింగ్ గేమ్‌తో ఆశలు రేపాడు. చివరి 5 ఓవర్లలో రాయల్స్ గెలుపునకు 47 పరుగులు కావాల్సి ఉండగా.. గ్రీన్ వేసిన 16వ ఓవర్‌లో హెట్‌మయెర్, పరాగ్ చెరో సిక్స్‌తో 17 పరుగులు పిండుకొన్నారు. దీంతో లక్ష్యం 24 బంతుల్లో 30 పరుగులకు దిగివచ్చింది. ఆ తర్వాత హెట్‌మయెర్ మరో రెండు బౌండ్రీలు బాదడంతో మ్యాచ్ రాజస్థాన్ రాయల్స్ వైపు మొగ్గింది. 18వ ఓవర్‌లో పరాగ్, హెట్‌మయర్‌ను సిరాజ్ అవుట్ చేసినా.. పావెల్ (8 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో16 నాటౌట్) 4,4,6తో మరో ఆరు బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు.



అశ్విన్ (2/19)

**తడబడుతూనే..:** బౌల్ట్, అశ్విన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు తడబడింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ.. కీలక భాగస్వామ్యాలు నిర్మించలేక ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. పవర్‌ప్లేలో బౌల్ట్ పదునైన బంతులతో ముప్పుతిప్పలు పెట్టడంతో.. ఓపెనర్లు కోహ్లీ, డుప్లెసి (17) దూకుడుగా ఆడలేకపోయారు. తన తొలి మూడు ఓవర్లలో 6 పరుగులు మాత్రమే ఇచ్చిన బౌల్ట్.. డుప్లెసిని క్యాచవుట్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 37 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బౌండ్రీ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న పావెల్ డైవ్ చేస్తూ అద్భుత క్యాచ్ అందుకోవడంతో డుప్లెసి నిరాశగా వెనుదిరిగాడు. అయితే, సందీప్, అవేశ్ లక్ష్యంగా కోహ్లీ బ్యాట్‌ను ఝుళిపించడంతో.. పవర్‌ప్లేను బెంగళూరు 50/1తో ముగించింది. ఇక, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు అశ్విన్, చాహల్ కూడా పరుగులను కట్టడి చేస్తూ బెంగళూరుపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో దూకుడుగా ఆడే ప్రయత్నం చేస్తున్న కోహ్లీని చాహల్ ఊరించే బంతితో బోల్తా కొట్టించాడు. కానీ, బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వన్‌డౌన్‌లో వచ్చిన గ్రీన్ (27) 6,4తో బ్యాట్‌కు పని చెప్పడంతో 10 ఓవర్లకు జట్టు 76/2తో నిలిచింది. మరోవైపు అవుటయ్యే ప్రమాదం నుంచి బతికిపోయిన రజత్ పటీదార్.. గ్రీన్‌తో కలసి మూడో వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, స్కోరు బోర్డు వేగం పుంజుకొంటున్న సమయంలో 13వ ఓవర్‌లో గ్రీన్‌తోపాటు మ్యాక్స్‌వెల్ (0)ను అవుట్ చేసిన అశ్విన్.. బెంగళూరును కోలుకోలేని దెబ్బకొట్టాడు. పావెల్ అందుకొన్న మరో గ్రేట్ క్యాచ్‌తో గ్రీన్ పెవిలియన్ చేరగా.. భారీ షాట్ ఆడే క్రమంలో మ్యాక్సీ అవుటయ్యాడు. ఈ దశలో పటీదార్, మహిపాల్ లోమ్రోర్ బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ స్కోరు బోర్డులో ఊపు తెచ్చారు. చాహల్ వేసిన 14వ ఓవర్‌లో రజత్ 6,4 కొట్టగా.. లోమ్రోర్ సిక్స్‌తో ఆ ఓవర్‌లో 19 పరుగులు లభించాయి. కానీ, పటీదార్‌తో పాటు దినేష్ కార్తీక్ (11), లోమ్రోర్‌ను అవేశ్ వెనక్కి పంపాడు. ఇక, ఆఖరి ఓవర్‌లో కర్ణ్ శర్మ (5), స్వప్నిల్ (9 నాటౌట్) 4,6తో టీమ్ స్కోరును 170 మార్క్ దాటించారు. రాయల్స్ బౌలర్ల దెబ్బకు డెత్ ఓవర్లలో బెంగళూరు 47 పరుగులు మాత్రమే చేసింది.

**1** ఐపీఎల్‌లో 8 వేల పరుగుల మైలురాయి చేరిన తొలి బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ.

### స్కోరుబోర్డు

**బెంగుళూరు:** కోహ్లీ (సి) (సబ్-ఫెరీరా) (బి) చాహల్ 33, డుప్లెసి (సి) పావెల్ (బి) బౌల్ట్ 17, గ్రీన్ (సి) పావెల్ (బి) అశ్విన్ 27, పటిదార్ (సి) పరాగ్ (బి) అవేశ్ 34, మ్యాక్స్‌వెల్ (సి) జురెల్ (బి) అశ్విన్ 0, లోమ్రోర్ (సి) పావెల్ (బి) అవేశ్ 32, దినేశ్ కార్తీక్ (సి) జైస్వాల్ (బి) అవేశ్ 11, స్వప్నిల్ (నాటౌట్) 9, కర్ణ్ శర్మ (సి) పావెల్ (బి) సందీప్ శర్మ 5, **ఎక్స్‌ట్రాలు: 4, మొత్తం: 20 ఓవర్లలో 172/8; వికెట్ల పతనం:** 1-37, 2-56, 3-97, 4-97, 5-122, 6-154, 7-159, 8-172; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-16-1, సందీప్ 4-0-48-1, అవేశ్ 4-0-44-3, అశ్విన్ 4-0-19-2, చాహల్ 4-0-43-1.

**రాజస్థాన్:** జైస్వాల్ (సి) కార్తీక్ (బి) గ్రీన్ 45, కోహ్లెర్ (బి) ఫెర్గూసన్ 20, శాంసన్ (స్టంప్డ్) కార్తీక్ (బి) కర్ణ్ 17, రియాన్ పరాగ్ (బి) సిరాజ్ 36, జురెల్ (రనౌట్) 8, హెట్‌మయెర్ (సి) డుప్లెసి (బి) సిరాజ్ 26, పావెల్ (నాటౌట్) 16, అశ్విన్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19 ఓవర్లలో 174/6; వికెట్ల పతనం:** 1-46, 2-81, 3-86, 4-112, 5-157, 6-160; **బౌలింగ్:** స్వప్నిల్ 2-0-19-0, సిరాజ్ 4-0-33-2, యశ్ దయాల్ 3-0-37-0, ఫెర్గూసన్ 4-0-37-1, కర్ణ్ శర్మ 2-0-19-1, గ్రీన్ 4-0-28-1.

# బిజినెస్



## బెంజ్ నుంచి రెండు కొత్త కార్లు

» *ప్రారంభ ధర రూ.3.3 కోట్లు*

*న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ బుధవారం భారత మార్కెట్లోకి రెండు కొత్త కార్లను ప్రవేశపెట్టింది. అందులో మేబాక్ జీఎల్ఎస్ 600 4మ్యాటిక్ ఎస్‌యూవీ ధర రూ.3.35 కోట్లు కాగా.. ఏఎంజీ ఎస్ 63 ఈ పెర్‌ఫార్మెన్స్ ఎడిషన్ 1 రేటు రూ.3.3 కోట్లుగా ఉంది. ఎక్స్‌క్లూజివ్ 'ఎడిషన్ 1' ధర రూ.3.8 కోట్లని కంపెనీ తెలిపింది. ఎస్ క్లాస్ సిరీస్‌లో బెంజ్ ఇప్పటివరకు ప్రవేశపెట్టిన మోడళ్లలో ఇదే అత్యంత శక్తిమంతమైనది. గత ఆర్థిక సంవత్సరంలో భారత మార్కెట్లో 18,123 కార్లను విక్రయించిన బెంజ్.. ఈ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం విక్రయాల్లో రెండంకెల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది.*

## పేటీఎం నష్టం రూ.550 కోట్లు

న్యూఢిల్లీ: పేటీఎం పేరుతో ఆర్థిక సేవలందిస్తున్న ఫిన్‌టెక్ కంపెనీ 'వన్97 కమ్యూనికేషన్స్ నష్టం మరింత పెరిగింది. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలో కంపెనీ నష్టం గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే రూ.167.5 కోట్ల నుంచి రూ.550 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం కూడా 3 శాతం తగ్గి రూ.2,26 కోట్లకు పడిపోయింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ యూపీఐ లావాదేవీలపై ఆర్‌బీఐ విధించిన ఆంక్షలు ఇందుకు ప్రధాన కారణం. అయితే మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి పేటీఎం నష్టాలు రూ.1,776.5 కోట్ల నుంచి రూ.1,422.4 కోట్లకు తగ్గాయి. ఇదే సమయంలో ఆదాయం మాత్రం 25 శాతం పెరిగి రూ.9,978 కోట్లకు చేరింది.

## మూడేళ్ల కనిష్ఠానికి యూకే ద్రవ్యోల్బణం

యునైటెడ్ కింగ్‌డమ్‌లో (యూకే) గత నెలకు వినియోగదారుల ధరల సూచీ దాదాపు మూడేళ్ల కనిష్ఠ స్థాయి 2.3 శాతానికి తగ్గింది. అయినప్పటికీ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ) నియంత్రణ లక్ష్యమైన 2 శాతానికి ఎగువనే ఉంది. అలాగే, మార్కెట్ వర్గాల అంచనాల కంటే ఎగువ స్థాయిలోనే నమోదైంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 20న ద్రవ్యపరపతి సమీక్షలో బీఓఈ ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలపై మళ్లీ అనిశ్చితి పెరిగింది.



## సత్య నాదెళ్లకు జరిమానా

**కంపెనీల చట్టం ఉల్లంఘనకు శిక్ష**

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, మైక్రోసాఫ్ట్ అనుబంధ సంస్థ లింక్డ్‌ఇన్ ఇండియా, మరో ఎనిమిది మంది వ్యక్తులపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. వీరు కంపెనీల చట్టం, 2013లోని 90వ సెక్షన్‌ను ఉల్లంఘించినందుకు రూ.27,10,800 జరిమానా విధించింది. ఇందులో లింక్డ్ ఇన్ ఇండియాపై రూ.7 లక్షలు, సత్య నాదెళ్ల, లింక్డ్‌ఇన్ ఇండియా సీఈఓ ర్యాన్ రోస్లాన్‌స్కీలపై చెరో రూ.2 లక్షల చొప్పున జరిమానా విధిస్తున్నట్టు కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. లింక్డ్‌ఇన్ ఇండియా ఈక్విటీలో వీరికి చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రయోజన హక్కులు ఉన్నా, వారు ఆ విషయాన్ని వెల్లడించలేదని, అందుకు ఈ జరిమానా విధిస్తున్నట్టు తెలిపింది. కనీసం కంపెనీల చట్టంలోని నిబంధన 2ఏ (2) కింద కూడా వీరు తమకు ఈ విషయం తెలియజేయకపోవడాన్ని కంపెనీ వ్యవహారాల శాఖ తప్పు పట్టింది.

## గ్రాన్యూల్స్‌లో స్వల్ప వాటా విక్రయించిన ప్రమోటర్

» **3.09 శాతం వాటా రూ.304 కోట్లకు అమ్మకం**

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన గ్రాన్యూల్స్ ఇండియా ప్రమోటర్ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి కంపెనీలో స్వల్ప వాటా విక్రయించారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) డేటా ప్రకారం.. చిగురుపాటి తనకు చెందిన 3.09 శాతం వాటాకు సమానమైన 75 లక్షల షేర్లను బహిరంగ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా రూ.304 కోట్లకు విక్రయించారు. ఒక్కో షేరు సగటున రూ.405.08కు అమ్ముడైంది. వ్యక్తిగత రుణ చెల్లింపులు, కంపెనీలో తన వాటా తనఖాను విడిపించుకోవడంతో పాటు కొంత ద్రవ్య నిల్వను ఏర్పాటు చేసుకునే ఉద్దేశంతోనే ప్రమోటర్ ఈ వాటా విక్రయించారని గ్రాన్యూల్స్ ఇండియా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. అయితే భవిష్యత్‌లో మరింత వాటా విక్రయించే ఉద్దేశం ప్రమోటర్‌కు లేదని స్పష్టం చేసింది. తాజా వాటా విక్రయంతో గ్రాన్యూల్స్ ఇండియాలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ షేర్‌హోల్డింగ్ 41.96 శాతం నుంచి 38.87 శాతానికి తగ్గింది. కృష్ణ ప్రసాద్ చిగురుపాటి వాటా 34.78 శాతం నుంచి 31.69 శాతానికి తగ్గింది. ఎన్ఎస్ఈలో గ్రాన్యూల్స్ షేరు ధర బుధవారం 4.61 శాతం పెరిగి రూ.427.95 వద్ద ముగిసింది.

# ఇక ఇళ్ల ధరల పెరుగుదల అంతంతే

**ఇప్పటికే చుక్కలనంటాయి**
**కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ హెడ్ అన్షుల్ జైన్**



న్యూఢిల్లీ: దేశంలో ఇళ్ల ధరల పెరుగుదల స్వల్పకాలిక, మధ్యకాలిక ధోరణిలో నామమాత్రంగానే ఉంటుందని కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఇండియా హెడ్ అన్షుల్ జైన్ అన్నారు. కొవిడ్ అనంతరం గత రెండేళ్ల కాలంలో ఇళ్ల ధరలు విపరీతంగా పెరిగాయని, ఈ కారణంగా కొంత కాలం పాటు ధరల్లో స్తబ్ధత ఉండవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం ప్రస్తుతం అత్యధిక ఆర్థిక వృద్ధి సాధిస్తూ ఉండడంతో పాటు ప్రజల్లో ప్రత్యేకించి యువతరంలో సొంత ఇల్లు కలిగి ఉండాలనే ఆకాంక్ష బలంగా ఉన్నందు వల్ల భవిష్యత్తులో ఇళ్ల డిమాండు బలంగానే ఉంటుందని ఆయన తెలిపారు. 2013-14 నుంచి 2019 వరకు దేశంలో ఇళ్ల డిమాండు స్తబ్ధంగానే ఉన్నదని, ఆ సమయంలో యువత సొంతంగా ఏదైనా కలిగి ఉండాలని ఆకాంక్షించలేదని ఆయన చెప్పారు. కొవిడ్ మహమ్మారి నుంచి ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చిందంటూ సొంత ఇల్లు కలిగి ఉండడం వల్ల స్థిరత్వం ఉంటుందనే భావం నెలకొన్నట్టు ఆయన తెలిపారు. మారిన పరిస్థితుల కారణంగా ప్రజలు పెద్ద ఇళ్లు కావాలని కోరుకున్నారని, దేశంలో కనిష్ఠంగా ఉన్న వడ్డీరేట్లు కూడా ఇళ్ల కొనుగోలుదారులకు ప్రోత్సాహకమైన అంశమని జైన్ అన్నారు. దీంతో డిమాండు గణనీయంగా పెరిగి ధరలు కూడా దూసుకుపోయాయని తెలిపారు. ధరల పెరుగుదల తీరును చూసి ఇన్వెస్టర్లు కూడా గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ముందుకు రావడం మార్కెట్‌ను ఉత్తేజితం చేసిందని వివరించారు. ఆ తీరులో గత రెండేళ్లుగా ఇళ్ల ధరలు దూసుకుపోయిన కారణంగా ఒకటి, రెండు సంవత్సరాల కాలం పాటు ధరల్లో స్థిరీకరణ ఏర్పడవచ్చునన్నది తన అభిప్రాయమని స్పష్టం చేశారు. వచ్చే రెండేళ్లలో ధరల్లో రెండంకెల వృద్ధి ఉండకపోవచ్చునని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దేశంలో ఇళ్ల మార్కెట్ ధోరణులను పరిశీలించే వివిధ కన్సల్టెన్సీ సంస్థల అధ్యయనం ప్రకారం ఎనిమిది ప్రధాన నగరాల్లో కొవిడ్ అనంతరం ధరలు సగటున 10 శాతం పెరిగాయి. అయితే కొన్ని చిన్న మార్కెట్లలో మాత్రం ధరలు 40 నుంచి 70 శాతం వరకు కూడా పెరిగాయి. పైగా మంచి పేరు ప్రఖ్యాతులున్న బిల్డర్ల ప్రాజెక్టులకే ప్రజలు మొగ్గు చూపడం ప్రారంభించారు.

## గ్లాండ్ ఫార్మా లాభం రెండింతలు

» రూ.20 తుది డివిడెండ్

న్యూఢిల్లీ : హైదరాబాద్ కేంద్రంగా పని చేసే గ్లాండ్ ఫార్మా నాలుగో త్రైమాసికంలో రూ.192 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే లాభం దాదాపు రెండింతలు పెరిగింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.785 కోట్ల నుంచి రూ.1,537 కోట్లకు చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ నికర లాభం రూ.781 కోట్ల నుంచి రూ.772 కోట్లకు పడిపోయింది. ఆదాయం మాత్రం రూ.3,625 కోట్ల నుంచి రూ.5,665 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరమే యూరప్ కేంద్రంగా పని చేసే సినెక్సీ అనే ఫార్మా కంపెనీని కొనుగోలు చేసినట్టు గ్లాండ్ ఫార్మా ఎండీ, సీఈఓ శ్రీనివాస్ సాదు తెలిపారు. వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.20 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

## కావేరి సీడ్స్ లాభం 2.79 కోట్లు

హైదరాబాద్: స్థానిక కావేరి సీడ్స్ కంపెనీ మార్చి త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి అనుబంధ కంపెనీలను మినహాయిస్తే (స్టాండ్ అలోన్) కంపెనీ రూ.80.54 కోట్ల ఆదాయంపై రూ.2.79 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే క్యూ4లో కంపెనీ ఆదాయం 32.82 శాతం, నికర లాభం 1.2 రెట్లు పెరిగాయి. స్థూల లాభం 3.3 రెట్లు పెరిగి రూ.15.5 కోట్లకు చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణలోకి తీసుకుంటే ఆదాయం 6.18 శాతం పెరిగి రూ.1,062.43 కోట్లకు, నికర లాభం 9.72 శాతం వృద్ధితో రూ.293 కోట్లకు చేరాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో షేరు రూ.725 చొప్పున రూ.325 కోట్లతో వాటాదారుల నుంచి 44.83 లక్షల షేర్లను బైబ్యాక్ చేసినట్టు కావేరి సీడ్స్ సీఎండీ జీవీ భాస్కర రావు ఒక ప్రకటనలో తెలిపారు.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 74,550 ▲ | 68,350 ▲ | 1,00,300 ▲ |
| ముంబై | 74,080 ▼ | 67,860 ▼ | 92,890 ▲ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

23వ తేదీ

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 550 | విజయవాడ | 540 |
| వరంగల్ | 552 | గోదావరి | 540 |
| చిత్తూరు | 628 | విశాఖపట్నం | 550 |
| | | డజను గుడ్లు రూ.72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 145 | గోదావరి | 149 |
| వరంగల్ | 145 | విజయవాడ | 149 |
| కరీంనగర్ | 145 | గుంటూరు | 149 |
| మహబూబ్‌నగర్ | 147 | ఒంగోలు | 149 |
| కర్నూలు | 147 | చిత్తూరు | 160 |
| విశాఖపట్నం | 141 | | |

## రిలయన్స్, ఇన్ఫీ షేర్లలో కొనుగోళ్లు

» సెన్సెక్స్ 267 పాయింట్లు అప్
» 5 లక్షల కోట్ల డాలర్లు దాటిన మార్కెట్ సంపద

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలు మిశ్రమంగా ఉన్నప్పటికీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు దేశీయ ఈక్విటీ సూచీలను ముందుకు నడిపించాయి. బుధవారం ట్రేడింగ్ నిలిచేసరికి, సెన్సెక్స్ 267.75 పాయింట్ల లాభంతో 74,221.06 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 68.75 పాయింట్ల వృద్ధితో 22,597.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ లాభపడటం వరుసగా ఇది ఐదో రోజు. కాగా బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద తొలిసారిగా 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.415.94 లక్షల కోట్లు) వద్ద ముగిసింది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్‌కు ఇది సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి.

**బీకన్ ట్రస్టీషిప్ లిమిటెడ్ షేరు ధర శ్రేణి రూ.57-60**

ప్రముఖ డిబెంచర్ ట్రస్టీ 'బీకన్ ట్రస్టీషిప్ లిమిటెడ్' ఐపీఓ ఈనెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.57-60గా నిర్ణయించింది. తద్వారా రూ.32 కోట్లకు పైగా సమీకరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

## అయోధ్యలో కరూర్ వైశ్యా బ్యాంక్

హైదరాబాద్: పాత ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) అయోధ్యలో కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేసింది. బ్యాంకుకు ఇది 840వ బ్రాంచ్. బ్యాంక్ చైర్‌పర్సన్ డాక్టర్ మీనా హేమచంద్ర బుధవారం ఈ బ్రాంచ్‌ను ప్రారంభించారు. కేవీబీకి ఉత్తరప్రదేశ్‌లో ఇది ఏడవ బ్రాంచ్. ఈ బ్రాంచ్‌లో ఏటీఎం, నగదు డిపాజిట్ మెషిన్, పాస్‌బుక్ ప్రింటర్ వంటి సదుపాయాలు కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపింది. కేవీబీ ఎండీ, సీఈఓ బీ రమేశ్ బాబుతో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 100 కొత్త బ్రాంచిలు ప్రారంభించనున్నట్టు బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది.

# రైతులను సీఎం బెదిరిస్తున్నారు

## ప్రతి గింజను కొనుగోలు చేస్తామని కేంద్రం చెబుతున్నా సేకరణలో జాప్యం ఎందుకు

- ఓటేసిన అన్నదాతలకు చెయ్యిస్తారా
- నెరవేర్చే సత్తా లేనప్పుడు హామీలెందుకు
- రాష్ట్ర ప్రభుత్వంపై కిషన్ రెడ్డి ధ్వజం

హైదరాబాద్, మే22 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను బెదిరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. వరి వేస్తే ఉరే అని గతంలో కేసీఆర్ ప్రచారం చేయగా దొడ్డు బియ్యం సాగు చేస్తే గడ్డుకాలమే అనేలా ఇప్పుడు రేవంత్ చేస్తున్నారని విమర్శించారు. కల్లాల్లోకి పంట వచ్చిన వంద రోజుల్లోగా బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దొడ్డు, సన్నరకాలు అని కాకుండా ప్రతి రైతుకు బోనస్ ఇవ్వాలని కోరారు .సన్న బియ్యం రైతులను ప్రోత్సహించాలనుకుంటే వారికి రూ.1000 బోనస్ ఇచ్చి, దొడ్డు బియ్యం రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం పండించే ప్రతీ రైతుకు బోనస్ ఇస్తామని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఊరురా ప్రచారం చేశారని, ఇప్పుడు సన్నరకం సాగు చేసిన వారికే బోనస్ అని సన్నాయినొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసిన రైతులకు కాంగ్రెస్ అధికారం చేపట్టాక చెయ్యి ఇచ్చిందని ఎద్దేవా చేశారు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్నట్లు రాష్ట్ర పాలకుల తీరు ఉందని ఎద్దేవా



చేశారు. బాయిల్డ్ రైస్ విషయంలో బీఆర్ఎస్ నాయకులు గతంలో ఢిల్లీ వచ్చి లొల్లి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో కేంద్రంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సరఫరా చేయడం లేదన్నారు. ఇప్పటికీ 22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరా చేయాల్సి ఉందన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి 75 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉందన్నారు. ధాన్యం సేకరణలో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం కొనుగోలు చేసిన ధాన్యం కేవలం 75 వేల టన్నులని, ఇదే తీరు కొనసాగితే ధాన్యం కొనుగోళ్ల పూర్తికి రెండు నెలలు కూడా చాలవని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ జాప్యం వల్ల ధాన్యం తడిచి రైతులు నష్టపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇక, ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రుణ మాఫీ చేయకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చిందని కిషన్ రెడ్డి అన్నారు. నెరవేర్చే సత్తా లేనప్పుడు హామీలు ఎందుకు ఇచ్చారని కాంగ్రెస్ నేతలను కిషన్ రెడ్డి నిలదీశారు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు త్వరలో తాను క్షేత్రస్థాయి పర్యటనకు వెళతానని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

### ఏ హోదాలో సోనియాను ఆహ్వానిస్తారు?

జూన్ 2న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించబోయే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి సోనియా గాంధీని ఏ హోదాలో ఆ ఆహ్వానిస్తున్నారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమానికి రాజకీయ నాయకులను ఎలా ఆహ్వానిస్తారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక వేళ జూన్ 2న నిర్వహించేది పార్టీ కార్యక్రమమైతే కేబినెట్‌లో ఎందుకు చర్చించారో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని స్పష్టం చేశారు.

# 3వేల కోట్లతో పంటల బీమా

- సన్నాలను ప్రోత్సహించేందుకే బోనస్
- రేషన్‌గా సన్న బియ్యం మా లక్ష్యం
- భవిష్యత్తులో దొడ్డు రకం వడ్లకూ ఇస్తాం
- కేసీఆర్ పాలనలో రైతులను కాల్చుకుతిన్నారు: తుమ్మల

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పాలనలో పంటల బీమా పథకం అమలుకు నోచుకోలేదని, తాము రూ.3వేల కోట్లతో ఆ పథకాన్ని అమలు చేయబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చిన ఘనత తమదేనని చెప్పారు. రాష్ట్రంలో సన్న రకాల సాగును పెంచేందుకే రూ.500 బోనస్ ప్రకటించామని తెలిపారు. గత ప్రభుత్వం సన్న బియ్యం పేరుతో దొడ్డు వడ్లకే పాలీష్ వేసి అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించిందని గుర్తు చేశారు. పేదలకు మేలు చేయాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అవసరాలకు సరిపడా సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు స్పష్టం చేశారు. భవిష్యత్తులో దొడ్డు రకం వడ్లకు కూడా ఈ పథకాన్ని అమలుచేస్తామని ప్రకటించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రకటనలు మానుకోవాలని సూచించారు. రైతులు కూడా గత ప్రభుత్వం ఎలా పనిచేసింది? ప్రస్తు ప్రభుత్వం ఎలా పనిచేస్తున్నదో? ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను కాల్చుకుతిన్నది కేసీఆరేనని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడగొట్టి ఇంట్లో కూర్చోబెట్టారని తుమ్మల పేర్కొన్నారు. 2020లోనే రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించిన కేసీఆర్.. ఆ తర్వాత మూడేళ్లు అధికారంలో ఉండీ నయా పైసా ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు తాము సన్న రకం ధాన్యానికి బోనస్ ఇస్తామంటే... బీఆర్ఎస్ నేతలు కొత్త నాటకాలకు తెరలేపారని దుయ్యబట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి హామీలన్నీ పూర్తి చేస్తామని,



లేకపోతే ప్రజలను ఓట్లు అడగబోమని స్పష్టం చేశారు. కేసీఆర్ నిర్వాకం కారణంగా అస్తవ్యస్తమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీల అమలు ప్రక్రియను ప్రారంభించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో ధాన్యం సేకరణ వెయ్యి పాళ్లు నయమనే అభిప్రాయంతో తెలంగాణ రైతులు ఉన్నారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకో ఐఏఎస్ అధికారిని నియవించామని, ఈ సారి 4 లక్షల టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేస్తామని తెలిపారు. గతంలో క్వింటాల్‌కు 7-10 కిలోల వరకు తరుగు తీసి మిల్లర్లు దోపిడీ చేసే వారని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. గతంలో ధాన్యం డబ్బు చెల్లించడానికి 45రోజులు పట్టేదని, ఇప్పుడు 5 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని పేర్కొన్నారు.

### వానాకాలం నుంచే పంటల బీమా

వానాకాలం సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని ప్రారంభించాలని యోచిస్తున్న సర్కారు.. ఎన్నికల కోడ్ ముగియగానే సంబంధిత నిధులు విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభం కావడానికి మరో మూడు వారాల నుంచి నెల రోజుల సమయం ఉంది. ఆలోపు పంటల బీమా పథకాన్ని పట్టాలెక్కించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి రూ. 3 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రీమియం పోగా, మిగిలిన ప్రీమియం చెల్లించేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఈ మేరకు బీమా కంపెనీలతో ఒప్పందాలు, ప్రీమియం నిర్ధారణకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టే క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదైతే చాలు... ఆ పంటలకు బీమా వర్తిస్తుంది. సుమారు 1.35-1.45 కోట్ల ఎకరాల్లో వానాకాలం పంటలు సాగయ్యే అవకాశాలున్నాయి. ఈ మొత్తం విస్తీర్ణానికి పంటల బీమా పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. పంటల బీమా పథకాన్ని మెరుగ్గా అమలు చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా అధికారులకు సదస్సులు నిర్వహిస్తున్నారు. ఏఈవోలు, ఏవోలు, ఏడీఏలు, డీఏవోలు, సీపీవోలు ఇతర అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ల ఆధ్వర్యంలో సదస్సులు కొనసాగుతున్నాయి. పంటల నమోదు ఎలా చేయాలి? గ్రామాల వారీగా వివరాల సేకరణ, క్రోడీకరణ, పంటల విస్తీర్ణం లెక్కలు ఎలా తీయాలి? తదితర అంశాలపై కసరత్తు చేస్తున్నారు. పంటలను ధ్రువీకరించుకోవడానికి.. రైతుల నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

# కేసీ వేణుగోపాల్‌కు వందకోట్లు వెళ్లాయి

- ట్యాక్స్‌ల పేరుతో వసూళ్లు.. సూట్‌కేసుల్లో ఢిల్లీకి
- ఉత్తమ్, చౌహాన్ కలిసి వెయ్యి కోట్ల కుంభకోణం
- పూర్తి ఆధారాలతో ఆ స్కాంను బయటపెడతా
- మీడియాతో చిట్‌చాట్‌లో బీజేపీఎల్పీ నేత మహేశ్వరరెడ్డి



హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్‌కు రాష్ట్రం నుంచి వంద కోట్ల రూపాయలు అందాయని, ట్యాక్స్‌ల పేరుతో వసూలు చేసిన దంతా సూట్‌కేసుల్లో ఢిల్లీకి వెళ్తోందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాఖ కమిషనర్ చౌహాన్ కలిసి రూ.వెయ్యి కోట్ల మేర స్కాం చేశారని, ఆ స్కాంను ఆధారాలతో సహా బయట పెడతానన్నారు. పౌరసరఫరాల విషయంలో మంత్రి లెక్కలు, కమిషనర్ లెక్కలు వేర్వేరుగా ఉంటాయని, తాను ఆధారాలు లేకుండా మాట్లాడడంలేదన్నారు. ఈ విషయంలో ఉత్తమ్ కౌంటర్ కోసం ఎదురుచూస్తున్నానని, ఆయన బహిరంగ చర్చకు వస్తే, తాను కూడా పక్కా ఆధారాలతో సిద్ధంగా ఉన్నానని స్పష్టంచేశారు. ఆర్ ట్యాక్స్ బీ ట్యాక్స్ ఆర్‌ఆర్‌ఆర్ ట్యాక్స్‌ల గురించి మాట్లాడినప్పుడు స్పందించని ఉత్తమ్.. యూ ట్యాక్స్ గురించి మాట్లాడితే బయటకు వస్తున్నారన్నారు. ధనిక తెలంగాణను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సర్వనాశనం చేశారని విమర్శించారు. కొడుకు(కేటీఆర్) హీరోయిన్ల వైపు, కూతురు(కవిత) లిక్కర్ వైపు వెళ్లారని దుయ్యబట్టారు.

## నర్సాపూర్ చెరువు సమీపంలో...

# కుళ్లిన మృతదేహాలు

- ఒకటి మహిళదిగా, మరొకటి పురుషుడిదిగా గుర్తింపు
- ఎవరో చంపి పడేసినట్లు అనుమానం

నర్సాపూర్, మే 22: మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని రాయరావు చెరువు వద్ద కాగజ్‌మద్దూర్ వెళ్లే మార్గంలో నిర్మానుష ప్రదేశంలో ఓ మహిళ, ఓ పురుషుడి మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. వారిని అత్యంత దారుణంగా హత్య చేసి తగులబెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం... నర్సాపూర్-కాగజ్‌మద్దూర్ రోడ్డులో రాయరావు చెరువు సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో రెండు మృతదేహాలు ఉన్నట్లు అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ పుష్పరాజ్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెండు శవాల్లో ఒకటి పురుషుడిదిగా, మరొకటి మహిళదిగా గుర్తించారు. మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోయి, దుర్వాసన వస్తుండటంతో ఘటన జరిగి రెండు మూడు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. వారిద్దరిని ఎవరో చంపి, గుర్తుపట్టకుండా ఉండేందుకు పెట్రోల్ పోసి తగులపెట్టినట్లు మృతదేహాల తీరును బట్టి తెలుస్తోంది. అయితే, ఈ మృతదేహాలు ఎవరివి.. ఎందుకు హత్య చేశారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

### మహిళలకు బీజేపీ ఇచ్చే గౌరవం ఇదేనా?:అద్దంకి

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): "ఏ హోదాలో సోనియాగాంధీ తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నిస్తున్నడు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీపై ఆయన వ్యాఖ్యలు హాస్యాస్పదం. తెలంగాణ ఇచ్చిన దేవతగా రాష్ట్ర ప్రజలు ఆమెను చూస్తున్నారు. ఆమెపై కిషన్‌రెడ్డి విమర్శలు చేయడం సిగ్గుచేట"ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. తెలంగాణలో అస్తిత్వంకోసం, రాజకీయం కోసం సోనియాగాంధీని కించపరిచేలా కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారని, మహిళలకు బీజేపీ ఇచ్చే గౌరవానికిది నిదర్శనమన్నారు.

## ఒకేరోజు ఇద్దరు మునిసిపల్

# కమిషనర్ల సస్పెన్షన్

- నిర్మల్ ఉద్యోగాల వ్యవహారంలో తుర్కయాంజల్ కమిషనర్‌పై వేటు
- ఉత్తర్వుల్లో ఆంధ్రజ్యోతి కథనం ప్రస్తావన
- బాన్సువాడ కమిషనర్‌పై కూడా వేటు

నిర్మల్/ హయత్‌నగర్/ బాన్సువాడ, మే 22 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడిన ఇద్దరు మునిసిపల్ కమిషనర్లను సస్పెండ్ చేస్తూ బుధవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ పురపాలక సంఘంలో జరిగిన పబ్లిక్ హెల్త్ వర్కర్ల నియామకాలకు సంబంధించి అప్పటి నిర్మల్ మునిసిపల్ కమిషనర్, ప్రస్తుత తుర్కయాంజల్ మునిసిపల్ కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డిని అధికారులు తొలగించారు. 2022లో పారిశుద్య కార్మికుల నియామకాలకు సంబంధించి నిర్మల్ మునిసిపాలిటీలో 44 పోస్టులను భర్తీ చేశారు. ఈ వ్యవహారంపై 2022 ఫిబ్రవరి 26వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'అడ్డదారిలో ఊడ్చేశారు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. అలాగే ఈ పోస్టుల భర్తీ అనధికారికంగా జరిగినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులూ అందడంతో స్పందించి విచారణ జరిపారు. విచారణలో అనధికారికంగా ఉద్యోగాల నియామకం చేపట్టిన విషయం వాస్తవం అని తేల్చి సత్యనారాయణ రెడ్డిని సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వుల్లో ఆంధ్రజ్యోతి కథనాన్ని అధికారులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. అలాగే కామారెడ్డి జిల్లా బాన్సువాడ మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న హలీం గతంలో నిర్మల్ జిల్లా భైంసా మునిసిపాలిటీ కమిషనర్‌గా పనిచేశారు. అక్రమ నియామకాలకు తెర లేపడమే కాకుండా మున్సిపాలిటీ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ అక్రమ స్థలాలకు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వాస్తవమేనని తేల్చి హలీంను సస్పెండ్ చేశారు.

## నిషేధిత పత్తి విత్తనాలు

# తరలిస్తున్న ముఠాల పట్టివేత

- రూ.36 లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం

శంకర్‌పల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): నిషేధిత బీజీ 3, హెచ్‌టీ పత్తి విత్తనాలను తరలిస్తున్న రెండు ముఠాలను సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.36 లక్షల విలువైన 1440 కిలోల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జినోమ్‌వ్యాలీ ప్రాంతంలో నిషేధిత పత్తి విత్తనాలు వాహనంలో తరలిస్తున్నట్లు మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారమందడంతో తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో మంచిర్యాలకు చెందిన పులికొండ యశ్వంత్ కుమార్(32) బొలేరో వాహనంలో కర్ణాటకకు తరలిస్తున్న 1200 కిలోల బీటీ నిషేధిత విత్తనాలను గుర్తించారు. వాటి విలువ రూ.30 లక్షలు. విత్తనాల లోడు మంచిర్యాలకు చెందిన సురేష్ యాదవ్‌ది అని, లోడ్ తరలిస్తున్నందుకు తనకు రూ.40 వేలు ఇస్తున్నాడని యశ్వంత్ తెలిపాడు. మరోవైపు సంగారెడ్డి జిల్లాలో ట్రాలీ ఆటోలో తరలిస్తున్న రూ.6 లక్షల విలువైన 240 కిలోల నిషేధిత పత్తి విత్తనాలను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ, శంకర్‌పల్లి పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఎల్వర్తి వద్ద పట్టుకున్నారు. కర్నూలుకు చెందిన శ్రీనివాసరావు వద్ద నుంచి నిందితులు ఆ విత్తనాలు కొనుగోలు చేసి తరలిస్తూ పట్టుబడ్డారు. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, సప్లయర్ శ్రీనివాస్‌తో పాటు మరో నిందితుడు పరారీలో ఉన్నారు.

## రామగుండం- మణుగూర్ రైల్వేలైన్

# భూసేకరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

పెద్దపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఐదేళ్ల క్రితం ప్రతిపాదించిన రామగుండం-మణుగూర్ బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. అందుకు సంబంధించి పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో భూసేకరణ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. రామగుండం, రాఘవాపూర్, మంథని, కాటారం, భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం మీదుగా మణుగూర్ వరకు 207.8 కిలోమీటర్ల మేర ఈ రైల్వే లైన్‌ను నిర్మించనున్నారు. సింగరేణి మణుగూర్, ఇల్లందు, కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మంచిర్యాల జిల్లాలో గల మందమర్రి, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో విస్తరించి ఉన్న కోల్ కారిడార్‌ను కలిపేందుకు 1999లో ఈ రైల్వే లైన్‌ను ప్రతిపాదించారు. ప్రతి బడ్జెట్‌లో దీని ప్రస్తావన వస్తున్నప్పటికీ కేటాయింపులు ఏమీ లేకపోవడం గమనార్హం. ఈ లైన్ నిర్మాణం జరగదు అనుకుని నిరాశకు గురవుతున్నప్పుడల్లా సర్వే కోసం కొన్ని నిధులు కేటాయిస్తూ వచ్చారు. రైల్వే లైన్ సర్వే పూర్తి కాగా ఎట్టకేలకు భూసేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేయడంతో దీని నిర్మాణానికి ఒక అడుగు ముందుకు పడినట్లయ్యింది.

## మధ్యప్రదేశ్ నర్సింగ్ కాలేజీల స్కామ్‌లో

# సీబీఐ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌రాజ్ టెర్మినేషన్

న్యూఢిల్లీ, మే 22: మధ్యప్రదేశ్‌లో ఓ నర్సింగ్ కాలేజీ చైర్మన్ నుంచి రూ.10లక్షలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఇన్‌స్పెక్టర్ రాహుల్ రాజ్‌ను సీబీఐ సర్వీసు నుంచి తొలగించింది(టెర్మినేట్ చేసింది). అవినీతికి పాల్పడిన అధికారిని సర్వీసు నుంచి తొలగించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 311 అవకాశం కల్పిస్తోందని తెలిపింది. రాహుల్ రాజ్‌ను ఆదివారమే సీబీఐ విజిలెన్స్ విభాగం అధికారులు అరెస్టు చేశారు. రాహుల్‌రాజ్‌కు లంచం ఇచ్చిన మలయ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ అనిల్ భాస్కరన్, ఆయన భార్య సుమను కూడా అదుపులోకి తీసుకున్నారు. మధ్యప్రదేశ్‌లో పలు నర్సింగ్ కాలేజీలు కనీస సదుపాయాలు లేకపోయినా నడుస్తున్నాయని దాఖలైన ఓ పిటిషన్‌పై 2022 డిసెంబరులో ఆ రాష్ట్ర హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. అయితే, సీబీఐ అధికారులు లంచం తీసుకొని పలు నర్సింగ్ కాలేజీలకు అనుకూలంగా సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సీబీఐ విజిలెన్స్ విభాగం అధికారులు.. ఆదివారం సీబీఐ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌రాజ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే వ్యవహారంలో మొత్తం 13మందిని అరెస్టు చేశారు.



కిర్గిస్థాన్‌లో భారతీయులపై దాడి చేస్తున్న స్థానికులు

# మమ్మల్ని కాపాడండి

- కిర్గిస్థాన్‌లో భయంగుప్పిట్లో వైద్య విద్యార్థులు
- రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు

ఒంగోలు కార్పొరేషన్, మే 22: వైద్య విద్యను అభ్యసించేందుకు కిర్గిస్థాన్ వెళ్లిన భారతీయ విద్యార్థులు భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఈ నెల 13న ఆ దేశ రాజధాని బిష్కెక్‌లో స్థానిక, ఈజిప్టు విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న గొడవ.. ప్రాంతీయ విద్వేషాలు, భౌతిక దాడులకు దారితీసింది. ఘర్షణ జరిగిన బిష్కెక్‌కు 20కిలోమీటర్ల దూరంలోని ఏషియన్ మెడికల్ యూనివర్సిటీలో సుమారు 3,500 మంది భారతీయ విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వారిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు 1500మంది ఉన్నారు. ప్రాంతీయ విద్వేషాలతో విదేశీ విద్యార్థులపై స్థానికులు దాడులు చేస్తున్నారు. దీంతో మన విద్యార్థులు దాడుల భయంతో రూముల్లోనే గడుపుతున్నారు. తిండి కోసం తెచ్చుకున్న వస్తువులు అయిపోయినా బయటకు వెళ్లలేని పరిస్థితి. ఏ సమయంలో దాడులు చేస్తారోనని భయంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అక్కడే ఉండలేక, స్వదేశానికి రాలేక ఇబ్బందిపడుతున్నారు. బుధవారం ప్రకాశం జిల్లా విద్యార్థులు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ చేసి తమ పరిస్థితిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# మేడిగడ్డకు నిపుణుల బృందం

- గంటన్నరపాటు బ్యారేజీ వద్ద పరిశీలన
- అన్నారం సరస్వతి బ్యారేజీ వద్ద కూడా
- డిజైన్లు, లీకేజీలపై వివరాల సేకరణ
- నేడు సుందిళ్ల బ్యారేజీ పరిశీలనకు!

హైదరాబాద్, మహాదేవపూర్ రూరల్, భూపాలపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ, అన్నారం సరస్వతి బ్యారేజీలను పుణేకు చెందిన కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణులు బుధవారం పరిశీలించారు. ఆ సంస్థలోని భూభౌతిక, భూసాంకేతిక, నాన్ డిస్ట్రక్టివ్ విభాగాలకు చెందిన ముగ్గురు నిపుణులు.. జె.ఎస్.ఎడ్లబాడ్కర్, డాక్టర్ ధనుంజయ్ నాయుడు, డాక్టర్ ప్రకాష్ పాలె మధ్యాహ్నం మూడున్నర గంటలకు మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకుని.. ప్రాజెక్టు ఇంజనీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో అరగంటపాటు భేటీ అయ్యారు. మధ్యాహ్న భోజనం తర్వాత.. దెబ్బతిన్న బ్యారేజ్‌లోని ఏడవ బ్లాకులో 19, 20, 21 పియర్లను, ఆ ప్రాంతంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. ముఖ్యంగా ఏడో బ్లాక్‌లో పియర్లు కుంగిపోవడానికి కారణాలపై అధ్యయనం చేశారు. తొలుత పైభాగంలో పిల్లర్లను, తర్వాత డ్యామ్ అంతర్భాగంలోని ఎగువ భాగాన కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ తర్వాత దిగువన జల ప్రవాహం వెళ్లే మార్గాలను, భూ భౌతిక స్థితిగతులను సాంకేతికంగా అధ్యయనం చేయడంతో పాటు... ఏడో బ్లాక్ మొత్తాన్నీ ఫొటోలు తీసి సమాచారాన్ని సేకరించారు. బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించి మరిన్ని వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు గంటన్నరపాటు బ్యారేజీని పరిశీలించిన అనంతరం.. అన్నారం సరస్వతీ బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. అక్కడ కూడా అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లలో దెబ్బతిన్న అప్రాన్లు, సీసీ బ్లాకులు చూశారు. ఏయే బ్లాకుల వద్ద సీపేజీలు ఏర్పడ్డాయి? వాటి పరిణామాలు ఏమిటనే వివరాలు సేకరించారు. లీకేజీల సమస్యకు సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలపై రామగుండం చీఫ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి ద్వారా వివరాలు తెలుసుకున్నారు. గురువారం ఈ బృందం సుందిళ్ల బ్యారేజీని పరిశీలించే అవకాశం ఉంది. కాగా, లీకేజీలను సరిచేయడానికి చేపట్టాల్సిన పనులకు సంబంధించి ఇసుక, మట్టి తొలగించిన తర్వాత జియో టెక్నికల్ పరీక్షలను నిర్వహించి.. మూడు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని వారు వెల్లడించినట్టు సమాచారం. కాగా, బ్యారేజీ పరిశీలనకు శనివారం లేదా సోమవారం వస్తామని ఎన్‌జీఆర్ఐ ప్రతినిధులు సమాచారం ఇచ్చారు. ఢిల్లీకి చెందిన సీఎస్ఎంఆర్ఎస్ మాత్రం బ్యారేజీల మట్టి నమూనాలు పంపిస్తే.. పరీక్షలు చేసి, నివేదిక ఇస్తామని స్పష్టం చేసింది.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణుల బృందం

### మేడిగడ్డకు షీట్ పైల్స్

మేడిగడ్డలో ఏడో బ్లాకులోని 11 గేట్లకుగాను ఇప్పటికే మూడు గేట్లను ఎత్తగా.. తాజాగా మరో గేటును ఎత్తారు. త్వరలో మిగిలిన గేట్లనూఎత్తనున్నారు. అంతకన్నా ముందు.. ఆ బ్లాకు కింద ఉన్న రంధ్రాలను గ్రౌటింగ్ చేయనున్నారు. సిమెంట్/కాంక్రీట్/ఇసుక విశ్రమంతో పునాది కింద ఉన్న రంధ్రాలను పూడ్చి.. ఆ తర్వాతే మిగిలిన గేట్లను ఎత్తాలని నిర్ణయించారు. మరోవైపు.. ఏడో బ్లాకుకు దిగువ, ఎగువ భాగంలో షీట్‌పైల్స్‌ను పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ల ఆర్డర్ ఇచ్చారు.

### జియో ట్యూబ్‌పై రేపు బీవోసీఈ భేటీ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో దానికి ఎగువ భాగంలో జియోట్యూబ్‌టెక్నాలజీతో నిర్మించతలపెట్టిన కట్టపై బోర్డ్ ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్(బీవోసీఈ) చర్చించి, నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు.. శుక్రవారం(24న) ఈఎన్‌సీ(అడ్మిన్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలో జరిగే బీవోసీఈ భేటీలో దీనిపై చర్చించనున్నారు. జియోట్యూబ్ నిర్మాణం కోసం రూ.10 కోట్ల దాకా ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్ల కమిటీలో సభ్యులుగా ఉన్న చీఫ్ ఇంజనీర్లందరి అభిప్రాయాలను తీసుకున్నాక దీనిపై ముందుకు వెళ్లనున్నారు. ఈ సమావేశానికి జియో ట్యూబ్ సంస్థల ప్రతినిధులను కూడా ఆహ్వానించారు. ఈ భేటీలో చర్చించిన అనంతరం ఆర్నెల్లలోగా బీవోసీఈ నిర్ణయం వెలువరించే అవకాశాలున్నాయి.

# పట్టభద్రులారా.. మీరూ మోసపోతారా?

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచార సభల్లో కేటీఆర్ ప్రసంగించారు. అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, 50 వేల ఖాళీలతో మెగా డీఎస్సీ వేస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పటి వరకూ అమలు చేయలేదని కేటీఆర్ పేర్కొన్నారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని కాంగ్రెస్ వాళ్లు చెప్పుకొంటున్నారని, కానీ అవి కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలేనని, నాడు లీగల్ సమస్యల వల్ల ఆగిపోయిన వాటికి ఇప్పుడు కేవలం కాగితాలు ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామని ఊదరగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీగా పోటీ పడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశొరెడ్డి.. పేద ఇంట్లో పుట్టి బిట్స్ పిలానీలో చదివి గోల్డ్ మెడల్ సాధించారని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తెల్లారి లేచింది మొదలు బూతులు తిట్టుడుతోపాటు వెకిలి పనులు చేస్తుంటారని, ఆయన మీద 56 కేసులున్నాయన్నారు. వీరిలో ఎవరికి ఓటేయాలో పట్టభద్రులు ఆలోచించుకోవాలని కోరారు. 'మండలిలో వైట్ కాలర్ వర్కర్ ఉండాల్నా.. బ్లాక్ మెయిలర్ ఉండాల్నా ఆలోచించాలి. ఈ ఒక్క సీటుతో మా ప్రభుత్వం రాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోదు. కానీ, బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే యువత తరఫున మండలిలో ప్రశ్నించే గొంతుక ఉంటుంది' అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు టెట్ ఫీజు రూ.400 ఉండేదని, ఇప్పుడది రూ.2 వేలు అయిందని, మళ్లీ వాళ్లకే ఓటేస్తే టెట్ ఫీజును రూ.20 వేలు చేస్తారని హెచ్చరించారు. ఉత్తర తెలంగాణలోనే అతి పెద్ద ఆస్పత్రి అయిన ఎంజీఎంకు సైతం సక్రమంగా కరెంటు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. ఈ సమావేశాల్లో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వరంగల్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

### మళ్లీ కన్నీటి దృశ్యాలు!

గడిచిన ఆరు దశాబ్దాల్లో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న కన్నీటి దృశ్యాలు.. ఆరునెలల కాంగ్రెస్ పాలనలో మళ్లీ ఆవిష్కృతం అవుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. జోగిపేటలో విత్తనాల కోసం క్యూలైన్‌లో రైతులు తమ పాస్‌బుక్‌లు, కవర్లను పెట్టడం దీనికి ఉదాహరణ అని తెలిపారు. పదేళ్లు కనిపించని కరెంట్ కోతలు, కాలిన మోటర్లు వంటి వాటిని తిరిగి చూస్తున్నామని బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

# గొర్రెల పథకం డీడీలు వాపస్

పెద్ద అడిశర్లపల్లి, మే 22: గొర్రెల యూనిట్ల కోసం కట్టిన డబ్బుల్ని గొల్లకురుమలకు తిరిగి ఇచ్చేందుకు చర్యలు మొదలయ్యాయి. డబ్బులు కట్టి గొర్రెల యూనిట్ రాని వారి నుంచి డీడీల విత్‌డ్రా కోసం దరఖాస్తులు తీసుకోవాలని మండల పశువైద్యాధికారులకు జిల్లా అధికారులు వాట్సాప్‌లో సమాచారమిచ్చారు. వారు ఆ సమాచారాన్ని ఎంపీపీలు, జడ్పీటీసీలకు పంపి వారి పరిధిలోని లబ్ధిదారులకు చేరవేస్తున్నారు. మొదటి విడత రూ.31,750, రెండో విడత గొర్రెల పంపిణీకి రూ. 43,750 డీడీ చెల్లించారు. డబ్బులు కట్టి గొర్రెల యూనిట్ రాని వారి నుంచి డీడీ విత్‌డ్రా కోసం దరఖాస్తులను తీసుకుని కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని పెద్దఅడిశర్లపల్లి మండల పశువైద్యాధికారి మహేందర్‌రెడ్డి తెలిపారు. విత్‌డ్రా కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రెండు వారాల్లోపు వారి బ్యాంకు ఖాతాల్లో నగదు పడుతుందన్నారు. ఇందుకోసం దరఖాస్తు ఫారం నింపి దానికి ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం జత చేసి పశువైద్యశాలలో అందజేయాలని తెలిపారు. ఇప్పుడు డీడీలు వెనక్కి తీసుకుంటే మళ్లీ గొర్రెలు వస్తాయో లేదోనన్న ఆందోళన గొల్లకురుమల్లో వ్యక్తమవుతోంది. దీనిపై వెటర్నరీ డాక్టర్ మహేందర్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రభుత్వం గొర్రెల పంపిణీని మళ్లీ ప్రారంభిస్తే డీడీలు వెనక్కి తీసుకున్నవాళ్లకు కూడా గొర్రెలు వస్తాయని చెప్పారు. అయితే వారు మరోసారి డీడీలు తీయాల్సి ఉంటుందని తెలిపారు.

## నోటీసులకు 25 మంది అధికారుల వివరణ

» యాదాద్రి, భద్రాద్రి, ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌పై నోటీసులు

» మిగిలింది ముగ్గురే... 26 తర్వాత కమిషన్ విచారణ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందంలో భాగస్వాములైన మొత్తం 28 మంది ప్రస్తుత, మాజీ అధికారులకు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ నోటీసులివ్వగా.. వారిలో 25 మంది దాకా అధికారులు లిఖిత పూర్వకంగా సమాధానలిచ్చారు. ఆయా నిర్ణయాల్లో వారి వారి పాత్ర ఏంటి..? అనే అంశంపై వివరణ, అభిప్రాయాలను కోరుతూ ఇంధనశాఖ మాజీ ముఖ్య కార్యదర్శులు సురేశ్ చందా, ఎస్‌కే జోషి, అర్వింద్‌కుమార్, అజయ్ మిశ్రా, ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ జి.రఘుమారెడ్డి, టీఎస్ఎన్పీడీసీఎల్ మాజీ సీఎండీలు కె.వెంకటనారాయణ, ఎ.గోపాల్‌రావు, విద్యుత్తు సంస్థల మాజీ, ప్రస్తుత డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు, ఇతర అధికారులకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. వారిలో అర్వింద్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు మినహా విగిలిన వారంతా లిఖితపూర్వకంగా కమిషన్‌కు వివరణ ఇచ్చారు. ఈనెల 26వ తేదీ తర్వాత ఫిర్యాదులతో పాటు నోటీసులకు జవాబులన్నీ పరిశీలించాక.. కమిషన్ ప్రత్యక్ష విచారణ చేపట్టనుంది. జూలై లేదా ఆగస్టులో కమిషన్ నివేదికను ప్రభుత్వానికి అందించే అవకాశాలున్నాయి.

## 'ఫరీద్‌కోట్' ప్రత్యేక పరిశీలకుడిగా భట్టి

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పరిశీలకునిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఏఐసీసీ నియమించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన పంజాబ్‌కు బయలుదేరి వెళ్లారు. మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థి తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

## సెలవుల్లో పోలీస్ బాస్‌లు!

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కీలక విభాగాల్లో సేవలందిస్తున్న పోలీస్ బాస్‌లు సెలవుల్లో వెళ్లారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు అవిశ్రాంతంగా పనిచేసిన అధికారులు.. ఇప్పుడు సెలవుల్లో వెళ్లడంతో.. ఇతర సీనియర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సెలవుల్లో వెళ్లడంతో.. ఆయన బాధ్యతలను అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్‌కు అప్పగించారు. ఇప్పటికే ఆయన హైదరాబాద్ ట్రాఫిక్, క్రైమ్స్ విభాగాలకు అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. సంచలనం సృష్టించిన ఫోన్‌ట్యాపింగ్ కేసును కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పుడు ఆయన సెలవులపై వెళ్లడంతో.. ఆ కేసు దర్యాప్తునకు విరామం వచ్చింది. సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు చీఫ్‌గా ఉన్న శిఖాగోయల్ కూడా సెలవుపై వెళ్లారు. ఆమె బాధ్యతలను అదనపు డీజీపీ మహేశ్ భగవత్‌కు అప్పగించారు. ప్రొవిజన్ అండ్ లాజిస్టిక్స్ ఐజీగా, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి రమేశ్ కూడా సెలవులో ఉన్నారు. కాగా.. అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి ప్రస్తుతం ఒడిసా ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా ఉన్నారు. కీలక విభాగాల అధికారులు అందుబాటులో లేకపోవడంతో.. ముఖ్యమైన నిర్ణయాలు వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది.

## మంత్రి దుద్దిళ్ల సలహాదారుడిగా శ్రీసాయికృష్ణ

» టీవర్క్స్, వీ-హబ్ సీఈవోలుగా జోగిందర్, సీత

హైదరాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సలహాదారుడిగా శ్రీసాయికృష్ణ నియమితులయ్యారు. ఈయన గత 25 ఏళ్లుగా ఐటీ రంగంలో కొనసాగుతున్నారు. విప్రో, టాటా, రిలయన్స్ కంపెనీల్లో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు. సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ, టెలికాం రంగాల్లో నిపుణుడు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 22వేల మంది ఐటీ నిపుణులతో కూడిన గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ ఫోరం చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈయన ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. కాగా, టీవర్క్స్ సీఈవోగా జోగిందర్ తనికెళ్ల, విమెన్ ఆంత్రప్రెన్యూర్ హబ్(వీ-హబ్) సీఈవోగా ఏంజెల్‌హబ్ వ్యవస్థాపకురాలు సీత పల్లచోల్లను నియమించారు. వీరు మూడేళ్ల వరకు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సీత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఏంజెల్‌హబ్ మహిళా ఆంత్రప్రెన్యూర్లకు గ్రోత్ ప్లాట్‌ఫామ్స్, మెంటార్‌షిప్, నిధులకు సంబంధించిన అవకాశాల కల్పనపై దృష్టిసారిస్తోంది.

## జూన్ 2 నుంచి టోల్ ఫీజు పెంపు

» పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు టోల్ ప్లాజాల వద్ద ఆ రోజు నుంచి పెంచిన ఫీజు వసూలు

చౌటుప్పల్ రూరల్/ కేతేపల్లి, మే 22: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా నిలిచిన టోల్ ఫీజు పెంపు జూన్ 2 నుంచి అమలు కానుంది. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి టోల్ ఫీజు 5 శాతం పెంచుతారు. అయితే ఈసారి ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) వాయిదా వేసింది. జూన్ 1న చివరి విడత ఎన్నికలు జరుగుతాయి. ఆ రోజు అర్ధరాత్రి నుంచి టోల్ ఫీజులు పెరగనున్నాయి. 65వ నంబర్ జాతీయ రహదారిపై పంతంగి, కొర్లపహాడ్ (తెలంగాణ), చిల్లకల్లు (ఏపీ) వద్ద ఉన్న మూడు జీఎమ్మార్ టోల్ ప్లాజాల్లో జూన్ 2వ తేదీ ఉదయం నుంచి పెంచనున్నారు. టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు చెందిన స్థానిక వాహనాల నెలవారీ పాసు చార్జీలను రూ.330 నుంచి రూ.340కి పెంచారు. నిత్యం ఈ రహదారి మీదుగా 30నుంచి 40 వేల వరకు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పండుగలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య 10 వేలు ఎక్కువ ఉంటుంది.

## రేవ్ పార్టీ ఎంట్రీ ఫీజు 2 లక్షలు!

» పాల్గొన్నది 100 కాదు 200 మంది

» శనివారం నుంచి ఆదివారం అర్ధరాత్రి దాకా కొనసాగింపు

» సెక్స్ రాకెట్ కోణంలోనూ పోలీసుల దర్యాప్తు

బెంగళూరు, మే 22: రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు బెంగళూరు నగరాన్నీ కుదిపేసిన రేవ్ పార్టీ కేసులో కర్ణాటక పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బెంగళూరు ఎలక్ట్రానిక్స్ సిటీ పరిధిలోని ఫాంహౌస్‌లో ఆదివారం రాత్రి 'సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ' పేరిట నిర్వహించిన ఈ పార్టీలో మొత్తం 200 మంది పాల్గొన్నట్టు గుర్తించారు. పార్టీలో మాదకద్రవ్యాల సరఫరాతోపాటు సెక్స్ రాకెట్ కూడా నిర్వహించి ఉంటారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ పార్టీకి ఎంట్రీ ఫీజుగా ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షలు వసూలు చేసినట్టు తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేయడంతోపాటు కొన్ని డ్రగ్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. పోలీస్ శాఖ కేసు దర్యాప్తును ఎలక్ట్రానిక్స్ సిటీ పోలీస్ స్టేషన్ నుంచి సిటీ సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) నార్కోటిక్స్ విభాగానికి బదిలీ చేసింది. దర్యాప్తులో భాగంగా రేవ్ పార్టీ శనివారం సాయంత్రమే ప్రారంభమై ఆదివారం అర్ధరాత్రి వరకూ కొనసాగినట్టు సీసీబీ పోలీసులు గుర్తించారు. ఈ పార్టీకి 200 మంది వరకు హాజరయ్యారని, శనివారం రాత్రి పార్టీలో పాల్గొన్న కొందరు ఆదివారం తెల్లవారుజామున ఫాంహౌస్ నుంచి వెళ్లిపోగా.. మరికొందరు ఆదివారం జాయిన్ అయ్యారని గుర్తించారు. రేవ్ పార్టీ నిర్వాహకులు సెక్స్ రాకెట్ కూడా నడుపుతున్నారని తాము బలంగా అనుమానిస్తున్నట్టు పోలీసులు వర్గాలు వెల్లడించాయి. పార్టీలో పాల్గొన్న వారి డిమాండ్లను నెరవేర్చేందుకు నిర్వాహకులు ప్రతీది పక్కా ప్లాన్ ప్రకారం చేసినట్టు అర్థమవుతోందని తెలిపాయి. కాగా, రేవ్ పార్టీల్లో పాల్గొన్న ఒక్కోవ్యక్తి నుంచి ఎంట్రీ ఫీజుగా రూ.2 లక్షలు వసూలు చేశారని, తామంతా బర్త్‌డే పార్టీకి హాజరవుతున్నట్టు చెప్పాలని నిర్వాహకులు వారికి సూచించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బర్త్‌డే పార్టీ పేరిట నిర్వహించిన ఈ పార్టీకి టెకీలు, తెలుగు సినీ, సీరియల్ నటులు సహా 100 మందికిపైగా హాజరయ్యారని పోలీసులు తొలుత ప్రకటించారు. పార్టీలో పాల్గొన్నవారు ఎండీఎంఏ, కొకైన్, హైడ్రో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకున్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. అయితే దర్యాప్తులో భాగంగా పాల్గొన్నవారి సంఖ్య 200 ఉంటుందని పోలీసులు గుర్తించారు.

### సినీ నటి హేమ ఉన్నారన్న కమిషనర్

బెంగళూరు రేవ్ పార్టీ కేసును హెబ్బగూడి పోలీస్ స్టేషన్ నుంచి సీసీబీకి అప్పగించారు. ఆదివారం రాత్రి జరిగిన రేవ్ పార్టీలో తెలుగు సినీ నటి హేమ ఉన్నారని బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ పరోక్షంగా తెలిపారు. తాను పార్టీలో లేనంటూ హేమ విడుదల చేసిన వీడియోపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. ఆమె ఉన్నారని, రక్త నమూనాలు సేకరించారని స్పష్టం చేశారు.

# సంక్షోభంలో పంచాయతీలు!

## నిధుల లేమితో నిర్వహణకు ఇబ్బందులు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాని నిధులు

● అది.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని రాంరెడ్డిబావి గ్రామ పంచాయతీ. ఈ పంచాయతీని నిర్వహించాలంటే ప్రతి నెలా రూ.51 వేలు అవసరం. ఈ గ్రామంలోని జనాభా (496 మంది) ప్రకారం పంచాయతీకి ప్రతినెలా రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నిధులు రూ.26,040, కేంద్ర 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.41,335 రావాల్సి ఉంటుంది. అయితే.. ఎస్ఎఫ్‌సీ నిధులు 18 నెలలుగా, కేంద్రం నిధులు 4 నెలలుగా రావడం లేదు. దీంతో ఈ గ్రామంలో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి నెలల తరబడి వేతనాలు రావడంలేదు.

● వికారాబాద్ జిల్లా టేకులపల్లి గ్రామ పంచాయతీ కార్మికులకు 4 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో రోజువారీ పనులు చేయడానికి వారు ముందుకు రావడంలేదు. ఈ గ్రామానికి ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.1,61,150, కేంద్రం నిధులు ప్రతినెలా రూ.2,55,593 రావాల్సి ఉంది. ఏడాదిన్నరగా ఎస్ఎఫ్‌సీ నిధులు, 5 నెలలుగా కేంద్ర నిధులు రావడం లేదు. దీంతో పంచాయతీ నిర్వహణకు అవస్థ పడాల్సివస్తోంది. ఈ గ్రామంలో ప్రతి నెలా రూ.60 వేలు విద్యుత్తు చార్జీలు, సిబ్బంది వేతనాలు రూ.24 వేలు, ట్రాక్టర్ డీజిల్ కోసం రూ.14 వేలు, ఇతరాల కోసం రూ.28వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఈ సమస్య కేవలం ఈ మూడు గ్రామ పంచాయతీలది మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా 12,769 పంచాయతీలూ ఎదుర్కొంటున్నాయి. నాలుగు నెలలుగా కేంద్రం నిధులు రావడం లేదు. ఎస్ఎఫ్‌సీ నిధులు రెండేళ్లలో అప్పుడప్పుడు ఇచ్చినప్పటికీ.. 16 నెలలకు పైగా రావాల్సి ఉందని తెలుస్తోంది. వాస్తవానికి సకాలంలో నిధులు విడుదలైతేనే.. చిన్న పంచాయతీల నిర్వహణ భారంగా ఉంటుంది. అలాంటిది నెలల తరబడి నిధులు పెండింగ్‌లో ఉండడంతో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలన్నీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పలు రకాల పన్నుల రాబడి ఉన్న మేజర్ పంచాయతీల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. ఏమాత్రం ఆదాయ వనరుల్లేని 5,500కు పైగా చిన్న పంచాయతీల్లో చిల్లి గవ్వలేక సంక్షోభంలో ఉన్నాయి. గత ప్రభుత్వం హయాం నుంచి ఇప్పటివరకు రెండేళ్లుగా ఎస్ఎఫ్‌సీ నిధులు సక్రమంగా రాకపోవడంతో పంచాయతీల్లో అన్ని కార్యక్రమాలకూ ఇబ్బందిగా మారింది. 2011 జనాభా ప్రాతిపదికన రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలకు కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రతినెలా దాదాపు రూ.180 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ కింద ప్రతి నెలా రూ.120 కోట్లకు పైగా విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన రాష్ట్రంలోని పంచాయతీలకు కేంద్రం నిధులు నాలుగు నెలలకు సంబంధించి రూ.720కోట్లు ఎస్ఎఫ్ నిధులు 16నెలలకు సంబంధించి రూ.1,920కోట్లు రావాల్సి ఉంటుందని అంచనా! పెండింగ్‌లో ఉన్న ఈ నిధులు విడుదలైతేనే.. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు ముందుకెళ్లే అవకాశం ఉంటుంది.

### ట్రాక్టర్ డీజిల్‌కూ కష్టమవుతోంది..!

గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను సేకరించి.. డంపింగ్ యార్డుకు తరలించాలంటే ట్రాక్టర్‌ను ఉపయోగించాలి. కానీ, ట్రాక్టర్ కోసం డీజిల్ కొనడమే కష్టమవుతోంది. దీనికితోడు వేసవికాలంలో తాగునీటి సరఫరాకు ఉపయోగించే విద్యుత్తు మోటార్లు రిపేరుకు వచ్చినా బాగుచేయించలేని పరిస్థితి. నెల నెలా విద్యుత్తు బిల్లులు చెల్లించలేని దుస్థితి. పల్లెల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నా, అపరిశుభ్ర ప్రాంతాల్లో ప్రతిరోజూ బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నా.. కొనలేని పరిస్థితుల్లో ఉన్నామని పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉన్న సమయంలో పంచాయతీలకు నిధులు విడుదల కాకపోయినా.. వారు ఏదోవిధంగా డబ్బులు సర్దుబాటు చేసేవారు. సర్పంచుల పదవీకాలం పూర్తికావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన ప్రారంభమైంది. కొన్నిచోట్ల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పనులు నిలిచిపోకుండా ఉండేందుకు డబ్బులు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. గ్రామ పంచాయతీలో తాత్కాలిక పనుల కోసం జీతం డబ్బులు ఖర్చు చేస్తుండటంతో కుటుంబాల్లో సమస్యలు ఎదుర్కొంటున్నామని కొందరు అధికారులు వాపోతున్నారు. అప్పులు చేసి మరీ పంచాయతీలను నిర్వహించాల్సి వస్తోందని. ఉన్నతాధికారులకు భయపడి ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక పోతున్నామని అంటున్నారు. ఈ నేపథ్యంలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఎప్పుడొస్తాయా? అని స్థానిక విభాగాలు ఎదురుచూస్తున్నాయి. ఆదాయ వనరులుండే మేజర్ గ్రామ పంచాయతీలు తప్ప.. ఇతర చోట్ల ఆర్థిక సమస్య పట్టిపీడిస్తోంది. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడం, ఇతర ఆదాయ వనరులు లేకపోవడంతో గ్రామాల్లో ప్రజల కనీస సమస్యలు కూడా పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయిందని సంబంధిత విభాగాలు చెబుతున్నాయి.




### ఎన్నికల కోడ్ వల్లే..!

గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచుల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో మన రాష్ట్రంలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్ పడే అవకాశం ఉంటుందని పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. అయితే ఇందుకు సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముందుగా సమాచారం ఇస్తుందని, ప్రస్తుతం కేంద్రం నిధులు ఆగిపోవడానికి ఎన్నికల కోడ్ కారణమని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

### పనిచేసేందుకు కార్మికుల నిరాసక్తి

గ్రామ పంచాయతీలకు నిధుల లేమి కారణంగా చాలా చోట్ల సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. దీంతో రోజువారీ పనులు చేసేందుకు కార్మికులు ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లోని 500 జనాభాకు ఒక మల్టీపర్పస్ కార్మికుడిని నియమించుకునే అవకాశం కల్పించింది. వీరు విద్యుత్ లైట్లు, పారిశుధ్యం, మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు, చెత్త ట్రాక్టర్ నడిపించడం, మంచినీటి సరఫరా వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అయితే అసలే చాలీచాలని వేతనాలతో (రూ.8,500) పనిచేస్తున్న వీరికి ప్రస్తుతం మూడు నెలలుగా బకాయిలున్నాయి. దీంతో చాలా పంచాయతీల్లో కార్మికులు విధులకు రావడం లేదని తెలుస్తోంది. మేజర్ పంచాయతీల్లో తగినంత మంది పారిశుధ్య సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పనులు నిలిచిపోకుండా ఉండేందుకు ప్రత్యేకంగా కూలీలను నియమించుకుంటే.. వారికి డబ్బులు చెల్లించడం కూడా కష్టంగా ఉంటోందని, ఇప్పటికే బకాయి వేతనాలకోసం కార్మికులు రోజూ తమపై ఒత్తిడి తెస్తున్నారని పలువురు ప్రత్యేకాధికారులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

## పెండింగ్ బిల్లులు చెల్లించాకే పంచాయతీ ఎన్నికలు జరపాలి

» రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సర్పంచుల సంఘం వినతి

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి మరీ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాకే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని సర్పంచుల సంఘం కోరింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథిని సర్పంచుల సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. 'గత ప్రభుత్వంలోనే అధిక మొత్తంలో బిల్లులు బకాయి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ పెండింగ్ బిల్లులపై స్పందించడం లేదు. మా పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని సర్పంచులకు రావాల్సిన బకాయి బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించే విధంగా ప్రభుత్వానికి సూచన చేయాలి' అని కోరారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ కమిటీ అధ్యక్షుడు సుర్వియాదయ్యగౌడ్ మీడియాతో మాట్లాడారు. తమ తమ గ్రామాల్లో అభివృద్ధి జరగాలన్న ఆకాంక్షతో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు గత ప్రభుత్వం హయాంలో అప్పులు చేసి మరీ పనులు చేయించారన్నారు. మూడున్నరేళ్లుగా బిల్లులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

## ప్రభుత్వేతర వైద్య సిబ్బంది వేతనాలకు గ్రీన్ చానల్

» వైద్య విభాగాధిపతులకే నిధుల కేటాయింపు

» వారి ద్వారానే స్టైపెండ్, వేతనాల చెల్లింపు

» ఆర్థిక శాఖకు ప్రతిపాదించిన వైద్య శాఖ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రభుత్వేతర సిబ్బంది(జూనియర్ డాక్టర్లు, పీజీ వైద్య విద్యార్థులు, సీనియర్ రెసిడెంట్లు)కి వేతన కష్టాలు తీరనున్నాయి. ప్రతినెలా మొదటి వారంలోనే వారికి జీతాలు, స్టైపెండ్ చెల్లించేలా 'గ్రీన్ చానల్' ఏర్పాటుకు ప్రభుత్వం సమాయత్తమైంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను వైద్య ఆరోగ్యశాఖ బుధవారం ఆర్థికశాఖకు పంపింది. ఈ విషయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకున్నారు. గ్రీన్ చానల్ ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలని ఇటీవలే ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కతో కూడా ఆయన ప్రత్యేకంగా మాట్లాడినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. గ్రీన్ చానల్ ఏర్పాటుకు ఆర్థికశాఖ అనుమతిస్తే.. పీజీ వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్లకు ప్రతి నెలా మొదటి వారంలోనే స్టైపెండ్, గౌరవ వేతనాలు అందుతాయి. వీటితో పాటు జూనియర్ డాక్టర్ల హాజరు పట్టికను కూడా ప్రతి నెలా 20వ తేదీ వరకు డీఎంఈ కార్యాలయానికి పంపించేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని కాలేజీలు, బోధనాస్పత్రుల నుంచి అటెండెన్స్ సకాలంలో వస్తేనే వేతనాలను సకాలంలో విడుదల చేయడానికి వీలుంటుంది. అందుకే విధిగా అన్ని కాలేజీలు సకాలంలో హాజరు వివరాలను పంపాలని డీఎంఈ కార్యాలయం సర్క్యులర్ జారీ చేసే అవకాశం ఉందని వైద్యవర్గాలు వెల్లడించాయి. వైద్యవిద్య సంచాలకుడి పరిధిలోని ప్రభుత్వ వైద్య కాలేజీలు, బోధనాస్పత్రుల్లో పనిజేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వేతనాల విషయంలో జాప్యం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తే ఇక నుంచి మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రుల్లోని విభాగాధిపతులే ఈ స్టైపెండ్, గౌరవ వేతనాలను చెల్లిస్తారు. ఆ తర్వాతనే వేతనాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఆర్థికశాఖకు పంపుతారు. ఇందుకోసం ముందుగానే విభాగాధిపతులకు నిధులను కేటాయిస్తారు. చెల్లింపులు ఆలస్యమయ్యే ప్రతీ సారీ జూనియర్ డాక్టర్లు తదితరులు వైద్య సేవలను నిలిపివేస్తామని హెచ్చరించడం పరిపాటిగా మారింది. తాజాగా బుధవారం నుంచి కూడా వైద్య సేవలు నిలిపివేస్తామని డీఎంఈ డాక్టర్ వాణికి నోటీసులిచ్చారు. అయితే డీఎంఈ వారితో చర్చలు జరిపిన అనంతరం విధుల బహిష్కరణ నిర్ణయాన్ని విరమించుకున్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో వారి కష్టాలు తీరిన ట్లేనని భావిస్తున్నారు.

### ఎన్‌హెచ్ఎమ్ ఉద్యోగులకు సైతం

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద దాదాపు 45 వేల మంది పనిజేస్తున్నారు. ఇందులో వైద్యులు, ఎఎన్ఎమ్, ఇతర పారామెడికల్ సిబ్బందితో పాటు ఆశాలు కూడా ఉన్నారు. వీరికి కూడా ప్రతీనెలా సకాలంలో జీతాలందడం లేదు. వీరందరికీ కలిపి ప్రతీనెలా సుమారు రూ.105 కోట్లు జీతాల రూపంలో చెల్లిస్తున్నారు. వాస్తవానికి ఈ జీతభత్యాల్లో 60% కేంద్రం ఎన్‌హెచ్ఎమ్ కింద పంపుతుంది. అయితే గత రెండేళ్లుగా రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం పూర్తిస్థాయిలో విడుదల చేయడం లేదు. దాంతో ఎన్‌హెచ్ఎమ్ స్కీమ్ కింద పనిజేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలివ్వలేకపోతున్నారు. గత ఆరు మాసాలుగా రాష్ట్ర ప్రభుత్వమే జీతాలకు సంబంధించిన నిధులను విడుదల చేస్తుంది. ప్రస్తుతం ఇంకా రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వీరికి కూడా సకాలంలో జీతాలు గ్రీన్ ఛానెల్ ద్వారా అందేలా వైద్యశాఖ ప్రతిపాదనలు పంపింది. మరో వారం పది రోజుల్లోపు పెండింగ్‌లో ఉన్న పాత జీతాలను చెల్లించే అవకాశం ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

## 2 రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి

### ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడే కొత్త ప్రభుత్వం, ముఖ్యమంత్రితో కలిసి ముందుకు సాగుతాం

» తిరుమలలో భక్తుల కోసం సత్రం, కల్యాణ మండపం నిర్మిస్తాం: రేవంత్

» కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ సీఎం

» మనవడి పుట్టెంట్రుకల మొక్కు చెల్లింపు

తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడబోయే ప్రభుత్వం, ముఖ్యమంత్రితో తెలంగాణ సీఎంగా సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యలన్నిటినీ పరిష్కరించుకుని ఇరు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. బుధవారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న అనంతరం రేవంత్.. ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక స్వామి దర్శనం చేసుకోవాలని ప్రయత్నించినా.. సమయం దొరకలేదని, ఇన్నాళ్లకు స్వామి దర్శన భాగ్యం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం తరఫున తిరుమలలో ఓ సత్రం, కల్యాణ మండపం నిర్మించి భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఏపీలో ఎన్నికల ప్రక్రియ ముగిశాక సీఎంను కలిసి తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వామి సేవలో భాగస్వాములవుతామని చెప్పారు. వాతావరణం అనుకూలిస్తోందని, గత ఏడాది కరువు వచ్చి తాగునీటి సమస్య ఉన్నప్పటికీ సమస్యలను అధిగమించేలా మంచి రుతుపవనాలు వస్తున్నాయని వెల్లడించారు. రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి కూడా అలానే సహకరిస్తోందన్నారు. ఆయా ప్రాంతాల్లోని రైతులకు సహాయం చేసేలా పాలకుల మనసు మార్చాలని స్వామి వారిని కోరుకున్నానని చెప్పారు. రైతాంగాన్ని ఆదుకుని.. దేశ సంపదను పెంచాలని తమ ప్రభుత్వం కూడా యోచిస్తోందన్నారు.


మనవడిని భుజంపైకి ఎత్తుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

### మనవడి పుట్టెంట్రుకల మొక్కు కోసం..

మంగళవారం రాత్రే కుటుంబ సభ్యులతో కలసి తిరుమలకు చేరుకున్న సీఎం రేవంత్.. బుధవారం ఉదయం మనవడి పుట్టెంట్రుకల మొక్కుని చెల్లించారు. అనంతరం సతీమణి, కుమార్తె, అల్లుడు కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆయన ఆలయంలోకి వెళ్లారు. ధ్వజస్తంభాన్ని తాకుతూ గర్భాలయానికి చేరుకున్నారు. అక్కడ మూలమూర్తిని దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు రేవంత్ కుటుంబానికి ఆశీర్వచనం చేశారు. ఈవో ధర్మారెడ్డి వారికి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన రేవంత్ మనవడిని భుజంపైకి ఎత్తుకుని సంబరపడ్డారు. ఆలయం ముందున్న అభిమానులను పలకరిస్తూ తిరిగి అతిథి గృహానికి చేరుకున్నారు. కొంత సమయం విశ్రాంతి తర్వాత తిరుమల నుంచి తిరుగుపయనమయ్యారు.

### తీన్మార్ మల్లన్న భారీ మెజారిటీతో గెలవాలి

» మూడు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం దిశానిర్దేశం

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో బుధవారం సీఎం మూడు ఉమ్మడి జిల్లాల నాయకులతో జూమ్ ద్వారా సమావేశమయ్యారు. మూడు ఉమ్మడి జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జులు ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఎమ్మెల్యే తమ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లను సందర్శించాలని సూచించారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తీన్మార్ మల్లన్న ప్రభుత్వానికి వారధిగా పని చేస్తారని, ఆయన గెలుపు.. సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందన్నారు. 27న పోలింగ్ నేపథ్యంలో క్షేత్ర స్థాయి కార్యకర్తలను సన్నద్ధం చేయాలన్నారు.

# గృహేతర విద్యుత్తు చార్జీల పెంపు!

» సర్కార్ అనుమతిస్తే చార్జీలు సవరించాలని యోచన

» కోడ్ తర్వాత ఏఆర్ఆర్ దాఖలుకు డిస్కమ్‌ల నిర్ణయం

» రూ.50వేల కోట్లకుపైగా నష్టాలతో డిస్కమ్‌ల ఎదురీత

» ఉపశమనం పొందాలంటే చార్జీలు పెంచాల్సిన పరిస్థితి

» గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో కోలుకోలేని దెబ్బ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గృహేతర విద్యుత్తు చార్జీలను పెంచేందుకు డిస్కమ్‌లు కసరత్తు చేస్తున్నాయి. ఈ మేరకు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత 2024-25ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్) నివేదికను విద్యుత్తు నియంత్రణ మండలికి సమర్పించాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగా డిస్కమ్‌లు కోలుకోని విధంగా దెబ్బతిన్నాయి. లోపభూయిష్ట విధానాలకు తోడు, ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే క్రమంలో డిస్కమ్‌లు నిండా మునిగాయి. 2022-23 వరకు లెక్కలను పరిశీలిస్తే రూ.50,275కోట్ల మేర నష్టాలను డిస్కమ్‌లు మూటగట్టుకున్నాయి. దీనికితోడు 2016-17 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 ఆర్థిక సంవత్సర ం దాకా ట్రూ-అప్ చార్జీలు రూ.12,550కోట్ల మేర ఉండగా... ఆ మొత్తాన్ని తామే చెల్లిస్తామని గత ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. కానీ, చివరకు చిల్లిగవ్వ కూడా విడుదల చేయలేదు. ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో ఇవ్వాల్సిన రూ.2,378 కోట్లను ఎగ్గొట్టింది. ఇవి కాక 2023 అక్టోబరు 31వ తేదీ నాటికి ఎత్తిపోతల పథకాలతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలన్నింటి నుంచి డిస్కమ్‌లకు రూ.28,842.72కోట్లు రావాల్సి ఉంది. మరోవైపు.. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి సింగరేణికి రూ.19,431కోట్ల దాకా డిస్కమ్‌లు బాకీ పడ్డాయి. ప్రతి నెలా రూ.1300కోట్లకుపైగా లోటుతో డిస్కమ్‌లు నడుస్తున్నాయి. వీటన్నింటి నుంచి ఉపశమనం పొందాలంటే చార్జీల పెంపు తప్ప.. మరో మార్గం లేకుండా పోయిందని డిస్కమ్‌లు చెబుతున్నాయి. కోడ్ ముగియగానే ప్రభుత్వానికి నివేదించి, అనుమతి లభించగానే గృహేతర విద్యుత్తు చార్జీలను సవరించాలని యోచిస్తున్నాయి.



**డిస్కమ్‌ల నష్టాలు (రూ.కోట్లలో)**

| సంవత్సరం | నష్టాలు |
|---|---|
| 2014-15 | 2,513 |
| 2015-16 | 3,380 |
| 2016-17 | 6,202 |
| 2017-18 | 5,485 |
| 2018-19 | 8,019 |
| 2019-20 | 6,056 |
| 2020-21 | 6,686 |
| 2021-22 | 831 |
| 2022-23 | 18,728 |
| మొత్తం | 50,275 |

**డిస్కమ్‌లకు రావాల్సిన బకాయిలు (రూ.కోట్లలో)**

| శాఖలు | 2014 జూన్2 నాటికి | ప్రస్తుతం |
|---|---|---|
| ఎత్తిపోతల పథకాలు | 150 | 14,193 |
| మిషన్ భగీరథ | 35 | 3,558 |
| పంచాయతీరాజ్ | 769 | 4,393 |
| వాటర్‌బోర్డు | 362 | 3,932 |
| మున్సిపాల్టీలు | 131 | 1,657 |
| కేంద్రప్రభుత్వ | 82 | 720 |
| ఇతర అన్నిశాఖలు | 1,595 | 28,842 |
| 2016-23 మధ్య ట్రూఅప్ | | 12,550 |
| ఇంధన సర్దుబాటు చార్జీలు | | 2,378 |
| మొత్తం | | 43,770 |

## చంచల్‌గూడ జైలుకు సీసీఎస్ ఏసీపీ

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన సీసీఎస్(ఈవోడబ్ల్యూ) ఏసీపీ ఉమామహేశ్వరరావును ఏసీబీ అధికారులు బుధవారం ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతనికి 14 రిమాండ్ విధించించారు. అధికారులు అతణ్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. అతణ్ని కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని, మరింత సమాచారం రాబట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఏసీబీ దాడుల్లో ఉమామహేశ్వరరావు ఆస్తుల విలువను రూ.3.95 కోట్లుగా(బహిరంగ మార్కెట్‌లో రూ.25 కోట్లకు పైనే) లెక్కగట్టిన అధికారులు బ్యాంకు లాకర్లను తెరిచేందుకు సిద్ధమవుతున్నారు.

## కొమురవెల్లి ఎస్సైపై సస్పెన్షన్ వేటు

- ముస్తాబాద్‌లో కానిస్టేబుల్‌పై కూడా
- వివాహేతర సంబంధమే కారణం

హైదరాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొమురవెల్లి ఎస్సై నాగరాజును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. నాగరాజు పరాయి స్త్రీతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని, తనకు తన పిల్లలకు న్యాయం చేయాలని అతని భార్య ఇటీవల పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టింది. ప్రాథమిక విచారణ అనంతరం ఎస్సైను సస్పెండ్ చేస్తున్నట్లు మల్టీజోన్ -1 ఐజీ ఏవీ రంగనాథ్ బుధవారం తెలిపారు. మరో కేసులో కరీంనగర్ జిల్లా ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ వివాహేతర సంబంధంపై ఫిర్యాదు రావడంతో విచారణ జరిపి సస్పెండ్ చేసినట్లు ఐజీ వెల్లడించారు.

## టీ- సేవా కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా టీ- సేవా ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీ-సేవా సంస్థ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఓ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీ-సేవా కేంద్రాల ద్వారా వివిధ రకాల బిల్లుల చెల్లింపులు, పాన్‌కార్డు, బస్సు, రైలు, విమాన టికెట్ల బుకింగ్, వివిధ రకాల ఇన్సూరెన్స్‌లు తదితర ఆన్‌లైన్ సేవలను వినియోగదారులకు అందించి స్వయం ఉపాధి పొందవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 8179955744 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలన్నారు.

## కేవైసీ లేదు.. మీ ఫోన్‌ను బ్లాక్ చేస్తాం

- సైబర్ నేరగాళ్ల నయా మోసాలు..

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): "మీ మొబైల్ నంబర్‌కు సంబంధించిన నో యువర్ కస్టమర్(కేవైసీ)ని అప్‌డేట్ చేయలేదు. మరో రెండు గంటల్లో మీ ఫోన్‌ను బ్లాక్ చేసేస్తాం" అంటూ భారత టెలికం నియంత్రణ సంస్థ(ట్రాయ్) పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్తరకం మోసాలకు తెరతీశారని అదనపు డీజీపీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌చార్జి డైరెక్టర్ మహేశ్ భగవత్ ప్రజలను హెచ్చరించారు. ఫోన్‌ను బ్లాక్ చేస్తామంటూ ఆధార్ నంబర్, ఇతర వివరాలను సేకరించి, మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. "కేవైసీ వివరాలు తీసుకున్నాక.. సైబర్ కేటుగాళ్లు స్కైప్ ద్వారా వీడియో కాల్‌కు కనెక్ట్ అవ్వాలని సూచిస్తారు. పోలీసు యూనిఫాం ధరించి.. ఎఫ్ఐఆర్‌గా పేర్కొనే పేపర్లను చూపుతూ.. డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరిస్తారు. కేసు నుంచి తప్పించాలంటే డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తారు. ఈ తరహా ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్ వస్తే.. టోల్‌ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేసి గానీ, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో గానీ ఫిర్యాదు చేయాలని కోరారు.

## మహేశ్వర్‌రెడ్డికి పిచ్చిపట్టింది: చనగాని దయాకర్

బీజేపీ శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డికి పిచ్చి పట్టిందని, ఆ పార్టీలో పెద్ద లీడర్ కావడం కోసం యూ ట్యాక్స్ అంటూ అసత్య ప్రచారాలు చేస్తున్నాడని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ధ్వజమెత్తారు. ఆర్ఆర్ ట్యాక్స్, యూ ట్యాక్స్ అంటూ మరోమారు అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పట్టభద్రులకు ద్రోహం చేసిన బీఆర్ఎస్, బీజేపీలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదన్నారు..

### చిత్రపురి కాలనీ సొసైటీ ప్లాట్లలో అక్రమాలు...

## ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ అరెస్టు

రాయదుర్గం, మే 22 (ఆంధ్రజ్యోతి): చిత్రపురి కాలనీలో సినీ కార్మికులకు కేటాయించిన ప్లాట్లను వారికి రిజిస్ట్రేషన్ చేయకుండా డబ్బులు వసూలు చేసి బయటి వ్యక్తులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్‌ను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. తెలుగు చలనచిత్ర కార్మికుల సమాఖ్య సంఘం అధ్యక్షుడిగా వల్లభనేని అనిల్‌కుమార్ కొనసాగుతున్నారు. ఈ సొసైటీలో సినీ పరిశ్రమలో పనిచేసే 150 మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి మణికొండ చిత్రపురి కాలనీలోని అపార్ట్‌మెంట్ ప్లాట్లు అలాట్ అయ్యాయి. అలాట్ అయిన సభ్యుల వద్ద నుంచి రూ.5 లక్షల నుంచి 30 లక్షల వరకు అనిల్‌కుమార్ వసూలు చేశాడు. అయితే వారికి రిజిస్ట్రేషన్ చేయ్యలేదు. సొసైటీతో సంబంధం లేని బయటి వ్యక్తులకు, అలాట్‌మెంట్ కానీ సొసైటీలోని సభ్యులకు ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి కేటాయించాడు. దీంతో డబ్బులు కట్టి రిజిస్ట్రేషన్ కానీ సొసైటీ సభ్యులు రాయదుర్గం పోలీసులను ఆశ్రయించారు. రాయదుర్గం పోలీసులు అనిల్‌కుమార్‌తో పాటు ఆరుగురు కమిటీ సభ్యులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో అనిల్‌కుమార్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఆరుగురు సభ్యులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### కేంద్ర సౌజన్య పథకాల అమలుకు..

## 'ఎస్ఎన్ఏ-స్పర్శ్' విధానం

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేసే 'కేంద్ర సౌజన్య పథకాల(సీఎస్ఎస్)'ల కోసం కొత్త విధానం అమల్లోకి వచ్చింది. ఈ సీఎస్ఎస్‌ల కింద కేంద్రం విడుదల చేసే నిధులు ఇదివరకు రాష్ట్ర ప్రభుత్వంలోని ఆయా శాఖల ఖాతాలకు నేరుగా చేరేవి. ఇప్పుడలా కాకుండా 'ఎస్ఎన్ఏ- ఎస్‌పీఏఆర్ఎస్‌హెచ్' అనే ప్రత్యేక విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాను కలిపి 'సింగిల్ నోడల్ ఏజెన్సీ- స్పర్శ్(రియల్ టైమ్ సిస్టం ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్విక్ ట్రాన్స్‌ఫర్)' ద్వారా అమలు చేయనున్నారు. దీని కోసం రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీలో ఒక 'అకౌంట్ రెండరింగ్ యూనిట్(ఏఆర్‌యూ)'ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఎస్ఎన్ఏ- స్పర్శ్ కింద భారత రిజర్వ్ బ్యాంక్‌లోని ఈ-కుబేర్‌లో ఒక అకౌంట్‌ను తెరిచి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సీఎస్ఎస్‌ల వాటా ధనాన్ని డిపాజిట్ చేయాలి. ఇందులోంచి ఆయా శాఖల నిధులను డ్రా చేసి, ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం మార్గదర్శకాల ఉత్తర్వులను జారీ చేశారు.

## సీసీఎస్‌కు జమ చేసే ఎంఆర్‌డీఎఫ్ 4.5 శాతమే

- ఆర్టీసీ నిర్ణయం

టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల నుంచి మినహాయించి సీసీఎస్ ఖాతాకు జమ చేసే మెంబర్ రిటైర్‌మెంట్ డిపెండెంట్ ఫండ్ (ఎంఆర్‌డీఎఫ్)ను 7 శాతం నుంచి 4.5శాతానికి తగ్గించినట్టు సంస్థ అధికారులు తెలిపారు. సీసీఎస్ ఖాతాకు మళ్లించే నిధులను సర్దుబాటు చేయాలన్న అభ్యర్థన మేరకు మే నెల వేతనంలో ఎంఆర్‌డీఎఫ్‌ను 4.5 శాతానికి సవరించాలని యాజమాన్యం నిర్ణయించిందన్నారు.

# పిన్నెల్లి పరార్!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. ఈ బృందాలు హైదరాబాద్, దాని చుట్టుపక్కల తెలంగాణ జిల్లాల్లో విస్తృతంగా గాలిస్తున్నాయి. పిన్నెల్లి సోదరులు విదేశాలకు పారిపోయేందుకు చూస్తున్నారని అనుమానించిన పోలీసులు.. అన్ని ఎయిర్‌పోర్టులను అప్రమత్తం చేశారు. వారికి వ్యతిరేకంగా లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విదేశాలకు పరారయినట్టు కూడా వార్తలు హల్‌చల్ చేశాయి. నిజానికి... ఈనెల 16వ తేదీనే పిన్నెల్లి బ్రదర్స్ హౌస్ అరెస్టు నుంచి తప్పించుకుని మాచర్ల వదిలి పరారయ్యారు. అయినా... పోలీసులు పట్టించుకోలేదు. ఇప్పుడు... ఈవీఎం ధ్వంసం కేసు నమోదు, ఈసీ కన్నెర్ర నేపథ్యంలో ఆయనకోసం వేట మొదలుపెట్టారు.



సంగారెడ్డి జిల్లా సీసీఎస్ పోలీసుల అదుపులో పిన్నెల్లి డ్రైవరు, గన్‌మెన్

### అదిగో... అక్కడ... ఇక్కడ...

బుధవారం పిన్నెల్లితో 'ఎలుకా - పిల్లి'లాగా పోలీసుల చేజింగ్ కొనసాగింది. మొదట్నుంచీ పిన్నెల్లి సోదరులకు తెలంగాణలో కొందరు బీఆర్ఎస్ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. వారికి సంబంధించిన ఫామ్‌హౌస్‌లో తలదాచుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఏపీ పోలీసులు ఆ కోణంలోనూ విచారణ చేపట్టారు. పిన్నెల్లి సోదరులు హైదరాబాద్ నుంచి వాహనంలో వెళ్తున్నారన్న సమాచారంతో అప్రమత్తమైన ఏపీ పోలీసులు... సంగారెడ్డి జిల్లా పోలీసుల సహకారంతో పటాన్‌చెరు మండలం రుద్రారం సమీపంలో తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో పిన్నెల్లి వాహనం అటు వైపు వచ్చింది. పోలీసులను గమనించిన వెంటనే పిన్నెల్లి సోదరులు వాహనం దిగి మరో వాహనంలో పారిపోయినట్లు తెలుస్తున్నది. ఆ సమయంలో పిన్నెల్లి తన సెల్‌ఫోన్ కూడా వాహనంలోనే వదిలేసినట్లు సమాచారం. అక్కడ ఉన్న పోలీసులు వాహనంతో పాటు డ్రైవర్‌ను, పిన్నెల్లి గన్‌మెన్‌ను, అతని అనుచరులను అదుపులోకి తీసుకొని సంగారెడ్డి సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిని విచారించిన అనంతరం అక్కడికి వచ్చిన మాచర్ల పోలీసులకు వారిని అప్పగించారు. అయితే, సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లో బాత్‌రూమ్ సింక్‌లు తయారుచేసే ఫ్యాక్టరీ ఆవరణలో పోలీసులకు దొరికిపోయినట్టు ప్రచారం జరిగింది. కానీ... దీనిపై తెలంగాణ పోలీసులు స్పష్టత ఇవ్వలేదు. తమ పరిధిలో అలాంటి ఘటనలేవీ జరగలేదని, దీనిపై మాచర్ల పోలీసులనే అడగాలని చెప్పారు.

### మహబూబ్‌నగర్‌లోనూ తనిఖీలు...

బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన ఓ వ్యాపారికి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు, జడ్చర్ల పరిసరాల్లో పత్తి విత్తనాల మిల్లు ఉండేది. ఏడాది క్రితమే ఆ మిల్లును మూసివేశారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీచేయడానికి సదరు వ్యాపారి టికెట్ ఆశించారు. అయితే ఆయనకు ఆ నియోజకవర్గం (పర్చూరు) నుంచి టికెట్ దక్కలేదు. అయినప్పటికీ వైసీపీతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి. మాచర్ల నుంచి పరారు కాగానే.. పిన్నెల్లి సోదరులు తొలుత ఆ వ్యాపారి వద్దకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భూత్పూరు, జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అయితే, అప్పటికే ఇక్కడి నుంచి పిన్నెల్లి సోదరులు పారిపోయారు. పిన్నెల్లికి ఆశ్రయం ఇచ్చినవారినీ అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తునట్టు తెలుస్తోంది.

### కీలక అధికారి సహకారం..

పిన్నెల్లిని భద్రంగా తప్పించేందుకు కీలక పోలీసు అధికారి సహకరిస్తున్నట్లు సమాచారం! పోలీసుల కదలికలను ఎప్పటికప్పుడు పిన్నెల్లికి చేరవేస్తూ... 'సేఫ్'గా తప్పించుకునే మార్గాలను సూచిస్తున్నట్లు తెలుస్తోంది. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం... జగన్ విదేశాలకు వెళ్లేరోజునే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు తాడేపల్లి ప్యాలెస్‌లో ఆయనను కలుసుకున్నారు. ఈవీఎం ధ్వంసం చేసిన సంగతిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ విషయంలో ఎన్నికల కమిషన్ సీరియస్ యాక్షన్ తీసుకుంటే పిన్నెల్లి సోదరులకు సహకరించాలని సదరు కీలక అధికారిని జగన్ ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంలోని ఆ కీలక అధికారి పోలీసుల కదలికలను పిన్నెల్లికి చేరవేస్తున్నట్లు తెలుస్తుంది.

### దుబాయ్ విమానం ఎక్కాలని...

రామకృష్ణారెడ్డి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ వేసుకున్నారని, పోలీసుల అప్రమత్తతతో ఆయన వ్యూహం బెడిసికొట్టిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వర్గాల కథనం ప్రకారం, బుధవారం మధ్యాహ్నం 1.20 గంటలకు హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు పిన్నెల్లి సోదరులు ప్లాన్ చేసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వారు చేరుకోవాల్సి ఉంది. అయితే, అప్పటికే ఎయిర్‌పోర్ట్‌లో ఏపీ పోలీస్ టీమ్ మాటు వేసి ఉంది. ఈ విషయం తెలుసుకొని వారు ఎయిర్‌పోర్టు వద్దకు వెళ్లలేదు. పోలీసులను తప్పించుకునేందుకు అప్పటికప్పుడు రూట్ మార్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు అరెస్ట్ అయితే చాలాకాలం వరకు బయటకు రాలేమన్నా భయంతోనే విదేశాలకు పారిపోయే ఆలోచనలో వారు ఉన్నట్లు తెలుస్తుంది. పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. అన్ని విమానాశ్రయాలను అప్రమత్తం చేశారు. విదేశాలకు పరారయ్యేందుకు పిన్నెల్లి సోదరులు ఒక ప్రముఖ టీవీ చానల్ కు చెందిన వ్యక్తుల సహకారం తీసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి ఆంధ్ర సరిహద్దులు దాటే సమయంలో కూడా ఆ టీవీ చానల్‌కు చెందిన ప్రతినిధి పిన్నెల్లి సోదరులతో పాటు ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఆ టీవీ చానల్ కు చెందిన వాహనాల్లోనే పిన్నెల్లి సోదరులు తిరుగుతున్నారని ప్రచారం జరుగుతోంది.

## ఏడేళ్లు శిక్ష పడే అవకాశం

- ఈవీఎం ధ్వంసంపై 10సెక్షన్లతో కేసు
- సీసీ ఫుటేజ్ వల్లే సాక్ష్యాలు దొరికాయి:మీనా

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ధ్వంసం చేసినందుకు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశముందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా వెల్లడించారు. పల్నాడులోని పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం కేసులో పిన్నెల్లికి కోర్టు రెండేళ్ల పైబడి శిక్ష విధిస్తే.. ఆయనపై అనర్హత వేటు కూడా పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పాల్వాయిగేట్‌లో ఈవీఎంల ధ్వంసంపై ఐపీసీ, పీడీపీపీ, ఆర్పీ చట్టాల్లోని 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై ఈ నెల 20నే కేసు నమోదు చేసినట్లు తెలిపారు. "మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేట్‌లోని 202 పోలింగ్ బూత్‌లో ఈవీఎంను గుర్తు తెలియని వ్యక్తి పగలగొట్టినట్టు మొదట కేసు నమోదు చేసినా.. తర్వాత సీసీ కెమెరాల్లోని ఫుటేజ్ ఆధారంగా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసినట్లు గుర్తించాం. ఇలాగే మిగతా ఘటనలకు కారకులైన వ్యక్తులను కూడా గుర్తించాం. వారందరిపైనా కేసులు నమోదయ్యాయి. ఈ కేసును సీరియస్‌గా తీసుకుని ఎమ్మెల్యే పిన్నెల్లిని వెంటనే అరెస్ట్ చేయాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యే ఈవీఎంను ధ్వంసం చేయడం సిగ్గుమాలిన చర్య అని ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆయన కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈవీఎంని ధ్వంసం చేసిన వారికి రెండేళ్ల నుంచి గరిష్ఠంగా ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉంది' అని మీనా వివరించారు.

### పోలింగ్ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు..?

పాల్వాయిగేట్ గ్రామంలోని 202 పోలింగ్ బూత్‌లో చోటు చేసుకున్న ఘర్షణ, విధ్వంసం పరిణామాలను ఈసీ సీరియస్‌గా తీసుకున్నట్టు జిల్లాకు చెందిన ఓ రెవెన్యూ అధికారి తెలిపారు. ఈవీఎం విధ్వంసానికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీ సంచలనం కలిగించడంతో ఎన్నికల కమిషన్, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఆ రోజు పీవోగా విధుల్లో ఉన్న సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ సుబ్బారావు, షెహనాజ్ బేగం, వీఆర్వో జానయ్య వాస్తవ విషయాలను ఫిర్యాదు చేయడంలో విఫలమయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు హంగామా చేసి ఈవీఎంను ధ్వంసం చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని తెలిసింది.

## వెంటనే పిన్నెల్లిని అరెస్ట్ చేయండి

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఈసీ ఆదేశం
- ఈవీఎం ధ్వంసం ఘటనపై ఆగ్రహం

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన్ను అరెస్ట్ చేయకుండా జాప్యం చేసినందుకు రాష్ట్ర ఎన్నికల సంఘంపై మండిపడింది. వెంటనే పిన్నెల్లిని అరెస్టు చేయాలని ఆదేశించింది. ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించింది. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పోస్టు చేసిన వీడియో లింక్‌ను జతచేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి పలు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనపై బుధవారం సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర నివేదిక సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్ ఆదేశించారు. ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేట్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వంసం చేశారు. టీడీపీ ఏజెంట్ ప్రతిఘటించగా, ఆయనపై పిన్నెల్లితో పాటు అనుచరులు దాడికి ప్రయత్నించారు. దీనికి సంబంధించిన వీడియోను జత చేస్తూ నారా లోకేశ్ మంగళవారం రాత్రి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిని సీరియస్‌గా పరిగణించిన ఈసీ.. పిన్నెల్లిపై చర్యలకు ఆదేశించింది. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఇతర నిందితులను వీలైనంత త్వరలో అరెస్టు చేస్తామని ఎన్నికల కమిషన్‌కు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా నివేదించారు. ఎఫ్ఐఆర్‌లో ఏ1గా ఎమ్మెల్యేను చేర్చి నిందితులను అరెస్టు చేసేందుకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నేతృత్వంలో 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనలో ప్రధాన నిందితుడైన పిన్నెల్లిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్టు వివరించారు.

## వైసీపీ అభ్యర్థుల ఒత్తిళ్లు తట్టుకోలేం

- భయభ్రాంతులకు గురిచేస్తున్నారు
- సెలవుల కోసం ఆర్వోల మొర

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు, అనంతపురం, తిరుపతి సహా సమస్యాత్మక జిల్లాల్లోని పలు నియోజకవర్గాల వైసీపీ అభ్యర్థులు.. రిటర్నింగ్ అధికారు(ఆర్వో)లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వారి ఒత్తిళ్లను తట్టుకోలేమని, తమకు సెలవులివ్వాలని ఎన్నికల కమిషన్‌ను అభ్యర్థిస్తున్నారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ రోజు తమకు సహకరించలేదని కొందరు ఆర్వోలపై వైసీపీ నేతలు కత్తిగట్టినట్లు తెలుస్తోంది. దీంతో వారు తమపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారని.. కౌంటింగ్ నాడైనా తాము చెప్పినట్లు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారిని తట్టుకోవాలంటే ఐఏఎస్ అధికారుల వల్లే అవుతుందని.. తమను బాధ్యతల నుంచి తప్పించి వారికి బాధ్యతలు ఇవ్వాలని ఆర్వోలు వేడుకుంటున్నట్లు సమాచారం.

# 'గుర్తుతెలియని' పిన్నెల్లి!

**సిట్ రాకతోనే గుట్టు బయటపడింది.. బూత్‌లోకి జొరబడి ఈవీఎం బద్దలు.. లేచి నిలబడి దండం పెట్టిన పీవో**

- ఆయన పేరు లేకుండానే ఫిర్యాదు
- 'గుర్తు తెలియని' నిందితులపై కేసు
- సిట్ విచారణతో కదిలిన డొంక

(అమరావతి/నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ఎప్పుడో 13వ తేదీ పోలింగ్ రోజున జరిగిన ఈవీఎం ధ్వంసం ఘటన! 9 రోజుల తర్వాత, మంగళవారం వెలుగులోకి వచ్చింది! స్వయంగా ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణా రెడ్డే ఈవీఎంను బద్దలు కొట్టినా... అంతా గప్‌చుప్! జగన్ పాలనలో రాజ్యమేలిన భయానికి... యంత్రాంగం సలాం కొట్టిన తీరుకు ఇదే నిదర్శనం! పోలింగ్ రోజున మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పోలింగ్ బూత్‌లోకి పిన్నెల్లి తన అనుచరులతో సహా జొరబడ్డారు. నేరుగా ఓటింగ్ కంపార్ట్‌మెంట్ దగ్గరికి వెళ్లి... ఈవీఎంను బద్దలు కొట్టారు. వీవీప్యాట్ మెషీన్‌నూ విసిరికొట్టారు. దీనిపై సంబంధిత బూత్ ప్రిసైడింగ్ ఆఫీసర్ అదే రోజున సెక్టోరల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ... ఫిర్యాదులో పిన్నెల్లి పేరు ప్రస్తావించలేదు. 'గుర్తు తెలియని వ్యక్తులు' అని రాశారు. సెక్టోరల్ ఆఫీసర్ కూడా పోలీసులకు అదే విధంగా ఫిర్యాదు చేశారు. చివరికి... వీఆర్వో కూడా 'గుర్తు తెలియని' వాంగ్మూలమే ఇచ్చారు. పోలీసులూ 'గుర్తు తెలియని వ్యక్తుల'పైనే కేసు నమోదు చేశారు. 15వ తేదీన ఇదే కేసులో మరికొన్ని సెక్షన్లు జత చేశారు. కానీ, ఎమ్మెల్యే పేరు మాత్రం చేర్చలేదు. అసలు విషయం ఏమిటంటే... పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి 20 ఏళ్లుగా మాచర్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన బూత్‌లోకి రాగానే పోలింగ్ సిబ్బంది లేచి నిలబడి, దండాలు పెట్టారు. అయినా సరే... 'గుర్తు తెలియని వ్యక్తులు' అని ప్రిసైడింగ్ ఆఫీసర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కనీస విచారణ జరిపినా, పోలింగ్ సిబ్బంది, బూత్‌లోని ఏజెంట్లను ప్రశ్నించినా... ఈ విధ్వంసం చేసింది అందరూ బాగా గుర్తుపట్టగలిగే ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డే అని తెలిసిపోయేది. కానీ... వారికి అన్నీ తెలిసినా 'గుర్తుపట్టకుండా' వదిలేశారు.



### సిట్ రాకతో కదిలిన తీగ...

నిజానికి... పాల్వాయిగేటులో ఈవీఎం విధ్వంసం కేసు 'గుర్తు తెలియకుండా' గల్లంతయ్యేదే! కానీ... పోలింగ్ జరిగిన మరుసటి రోజు మాచర్ల, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. మొత్తం ఘటనలపై 'సిట్' విచారణకు ఆదేశించింది. దీంతో... పిన్నెల్లి బండారం బయటపడింది. హింసాత్మక ఘటనకు సంబంధించి నమోదు చేసిన సెక్షన్లు, నిందితులు, అరెస్టులపై 'సిట్' ఒక్కో కేసును నిశితంగా పరిశీలించింది. ఇదే క్రమంలో... పాల్వాయి గేటులో పోలింగ్ బూత్‌లో విధ్వంసం కేసులో 'గుర్తు తెలియని వ్యక్తుల'ను చూసి ఆశ్చర్యపోయారు. ఇంకా ఎందుకు గుర్తుపట్టలేదని పోలీసులను ప్రశ్నించారు. వెబ్ క్యాస్టింగ్ (సీసీ కెమెరా)ను పరిశీలించి నిందితులను ఎందుకు గుర్తించలేదని నిలదీశారు. దీంతో.. పోలీసులు నీళ్లు నమిలారు. 'వెబ్ క్యామ్‌ల దృశ్యాలు కలెక్టరేట్‌లో రికార్డు అవుతాయి. ఫుటేజ్ సీఈవో దగ్గర ఉంటుంది' అని తెలిపారు. సంబంధిత ఫుటేజ్ కోసం సీఈవోకు లేఖ రాశారు. ఈనెల 20వ తేదీన ఆ దృశ్యాలను సీఈవో కార్యాలయం పోలీసులకు అందించింది. దీంతో పిన్నెల్లి బండారం బయటపడింది. అదే రోజున ఈ కేసులో ఆయనను ఏ1గా చేర్చారు. ఈవీఎం విధ్వంసం దృశ్యాలు మంగళవారం బయటికి వచ్చాయి. ఎమ్మెల్యేకు భయపడి ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ సిబ్బంది నోరు మెదపలేదు. సెక్టోరల్ ఆఫీసర్ కూడా గమ్మునుండి పోయారు. పోలీసుల సంగతి చెప్పనక్కర్లేదు. 'సిట్' రంగంలోకి దిగాకగానీ అసలు విషయం బయటపడలేదు.


### నివేదిక ఎందుకు ఇవ్వలేదు?

పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఒక్కొక్క నియోజకవర్గానికి పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించారు. మాచర్ల నియోజకవర్గానికి డీపీవో విజయభాస్కరరెడ్డిని ప్రత్యేక అధికారిగా నియమించారు. పోలింగ్ బూత్‌లలో ఈవీఎంల ధ్వంసంపై వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. అయినప్పటికీ.. ఇందుకు సంబంధించిన నివేదికను సదరు అధికారి ఇవ్వలేదని తెలిసింది. ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేయడాన్ని కూడా కంట్రోల్ రూం నుంచి పరిశీలించిన అధికారులు ఏమీ తెలియనట్టు మిన్నకున్నారు. దీనిపైనా విచారిస్తున్నట్టు తెలిసింది.

'ఎమ్మెల్యేనే అడ్డుకునేంత మగాడివా..

# నువ్వెలా బతికుంటావో చూస్తా!'

- ఇప్పటికీ నన్ను ఫోన్‌లో బెదిరిస్తున్నారు
- ఎమ్మెల్యేనే ఈవీఎంను ఎత్తిపడేశారు
- ఏంటని ప్రశ్నించిన నాపై ఆగ్రహించారు
- భయపడి పొలాల్లో తలదాచుకున్నా
- పిన్నెల్లి సోదరుల నుంచి నాకు ప్రాణహాని
- బాధితుడు నంబూరు శేషగిరిరావు వేదన



బాధితుడు శేషగిరిరావు

గుంటూరు, అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని బాధితుడు, టీడీపీ నేత నంబూరు శేషగిరిరావు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యం నిమిత్తం గుంటూరు వచ్చిన శేషగిరిరావు బుధవారం ఉదయం మాచర్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాల్వాయి గేట్ వద్ద ఉన్న పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంటుగా కూర్చున్న శేషగిరిరావుపై ఎమ్మెల్యే పిన్నెల్లి సమక్షంలో అమానుష దాడి జరిగిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన మీడియా వద్ద స్పందించారు. "పోలింగ్ కేంద్రంలోకి స్వయంగా ఎమ్మెల్యేనే వచ్చి ఈవీఎంలు రెండుసార్లు ఎత్తిపడేశారు. 'ఏంటి సార్! అలా పడేస్తున్నార'ని అడిగితే జాగ్రత్త అంటూ నాకు వేలు చూపించారు. పీవోలు గది తలుపులు వేశారు. నన్ను బయటికి పంపించారు. నేను ఇంటికి వెళుతుంటే కారులో వచ్చి కర్రలతో నాపై దాడి చేశారు. తల, చెయ్యి, కాళ్లమీద, తొడల మీద కొట్టారు. నేను చచ్చిపోతానేమోనని భయపడిన మా పిల్లలు....వారిని అడ్డుకుని నన్ను కాపాడి తీసుకెళ్లారు. నేను ఫిర్యాదు చేయడానికి భయపడ్డాను. మమ్మల్ని చంపేస్తారని భయపడి మేం మా పొలాల్లోనే దాక్కున్నాం. పోలింగ్ జరిగిన మరునాడు కారంపూడి మీద దాడి చేసిన రోజు మామీద కూడా దాడి చేస్తారని భయపడ్డాం. నాకు తగిలిన దెబ్బలకు ప్రైవేటు ఆర్ఎంపీతో కుట్లు వేయించుకున్నా. ఇప్పటికీ నాకు బెదిరింపులు వస్తున్నాయి. 'ఎమ్మెల్యేనే అడ్డుకునేంత మగాడివా.. నువ్వెలా బతికుంటావో చూస్తా'నని ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. నన్ను, నా కుటుంబాన్ని పోలీసులే కాపాడాలి. మాకు రక్షణ కల్పించాలి. నాకు ఏమైనా జరిగితే పిన్నెల్లి సోదరులదే బాధ్యత" అని శేషగిరిరావు వాపోయారు. కాగా, నంబూరి శేషగిరిరావును టీడీపీ అధినేత చంద్రబాబు పరామర్శించారు. బుధవారం శేషగిరిరావును చంద్రబాబు ఫోన్ చేసి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,*
*RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
# దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 23 మే 2024
diksuchi@andhrajyothy.com

## యూఓహెచ్‌లో ఎంటెక్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ-యూఓహెచ్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం 115 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, గేట్ వ్యాలిడ్ స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

**స్పెషలైజేషన్‌లు-సీట్లు**

- బయోఇన్ఫర్మాటిక్స్ 25, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 18, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ 18, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 18, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ 18, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్ 18 సీట్లు ఉన్నాయి.

**అర్హత**

- స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

## శస్త్ర యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ

శస్త్ర యూనివర్సిటీ(డీమ్డ్ యూనివర్సిటీ)- డిగ్రీ, పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. తంజావూరు, కుంభకోణం, చెన్నై క్యాంపస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

**డిగ్రీ ప్రోగ్రామ్‌లు**

బీటెక్, బీఎస్సీ, బీఎస్సీ ఎలక్ట్రానిక్స్, బీకాం, బీఏ, బీఏ బీఈడీ, బీఎస్సీ బీఈడీ, బీకాం బీఈడీ, బీసీఏ, బీబీఏ, బీబీఏ-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీఏ-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీకాం-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీ ఆప్టమ్, బీఎస్సీ విజువల్ కమ్యూనికేషన్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ తదితరాలు

**పీజీ ప్రోగ్రామ్‌లు**

ఎంటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎం ఆప్టమ్, ఎంఎఫ్ఏ, ఎంఏ సంస్కృతం, ఎమ్మెస్సీ డేటా సైన్స్ తదితరాలు

**ఎంపిక**

- బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ఇంటర్ మార్కులు+జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లను; ఇంటర్ మార్కుల ద్వారా మిగిలిన సీట్లను భర్తీ చేస్తారు.
- ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లలో ఇంటర్ స్కోర్+క్లాట్ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.
- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ అర్హత ఉన్నవారికి స్కాలర్‌షిప్, స్టయిపెండ్ ఇస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. క్యాట్/జీమ్యాట్/ఎక్స్‌ఏటీ/ఏఐమ్యాట్ స్కోర్ ఉన్నవారు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు.

**ముఖ్య సమాచారం**

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లకు జూన్ 15; ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లకు జూన్ 8
- **వెబ్‌సైట్:** www.sastra.edu



## డా.వైఎస్సార్ హెచ్‌యూ హార్టిసెట్

**పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డా.వైఎస్సార్‌హెచ్‌యూ)- బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(హార్టిసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డిప్లొమా కేటగిరీ కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొత్తం 101 సీట్లు ఉన్నాయి. వీటిలో ఈడబ్ల్యూఎస్ కోటా కింద 9 సీట్లు ఉన్నాయి. యూనివర్సిటీ కళాశాలలకు 61 సీట్లు, అనుబంధ కళాశాలలకు 40 సీట్లు కేటాయించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.**



**అర్హత**

డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు కౌన్సెలింగ్ నాటికి మార్కుల పత్రం, సర్టిఫికెట్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వుడ్ వర్గాల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

**హార్టిసెట్ 2024 వివరాలు**

దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డా.వైఎస్సార్‌హెచ్‌యూ నిర్దేశించిన డిప్లొమా(హార్టికల్చర్) సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 15
- **హార్టిసెట్ 2024 తేదీ:** జూలై 26
- **పరీక్ష కేంద్రాలు:** కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్ (వెంకటరామన్నగూడెం-పశ్చిమగోదావరి జిల్లా, అనంతరాజులుపేట-అన్నమయ్య జిల్లా, పార్వతీపురం-మన్యం జిల్లా, చినలతరిపి-నెల్లూరు జిల్లా) క్యాంపస్‌లు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, వెంకటరామన్నగూడెం-534101, పశ్చిమగోదావరి జిల్లా.
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

## ఆర్‌జీఎన్‌ఏయూలో డిగ్రీ, పీజీ డిప్లొమా

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని రాజీవ్ గాంధీ నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ (సెంట్రల్ యూనివర్సిటీ, అమేథీ)- డిగ్రీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(బీఎంఎస్) ఇన్ ఏవియేషన్ సర్వీసెస్ అండ్ ఎయిర్ కార్గో, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్(పీజీడీఏఓ) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్, ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ రిటెన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

**బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (బీఎంఎస్) ఇన్ ఏవియేషన్ సర్వీసెస్ అండ్ ఎయిర్ కార్గో**

లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. దీని వ్యవధి మూడేళ్లు. ఇది అప్రెంటిస్‌షిప్-ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్. మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి 21 ఏళ్లు మించకూడదు.



**పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ (పీజీడీఏఓ)**

జీఎంఆర్ ఏవియేషన్ అకాడమీ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. దీని వ్యవధి 18 నెలలు. ప్రోగ్రామ్‌లో భాగంగా 12 నెలలు క్లాస్ రూం ట్రెయినింగ్ ఉంటుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్‌లలో ఆర్నెల్లు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు 2024 ఆగస్టు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు దరఖాస్తు నాటికి నాటికి 25 ఏళ్లు మించకూడదు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.rgnau.ac.in

## ఎన్‌హెచ్‌పీసీలో అప్రెంటిస్‌లు

చంపావత్(ఉత్తరాఖండ్)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ప్రయివేట్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌పీసీ)...కింద పేర్కొన్న ట్రేడ్‌లలో 64 అప్రెంటిస్ ఖాళీలున్నాయి.

**ట్రేడులు:** సీఓపీఏ, వెల్డర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్, ప్లంబర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్, వైర్‌మన్, టర్నర్, మెషినిస్ట్.

**అర్హత:** 10వ తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ 2019, 2020, 2021, 2022, 2023, 2024 ఏడాదిలో ఉత్తీర్ణులై ఉండాలి.

**వయోపరిమితి:** 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** మే 30

**దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూన్ 6

**వెబ్‌సైట్:** https://www.nhpcindia.com/welcome/job.htm

## సిఫ్‌నెట్‌లో వీఎన్‌సీ/ఎంఎఫ్‌సీ

కొచ్చిన్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ (సిఫ్‌నెట్)- వెసల్ నేవిగేటర్ కోర్సు(వీఎన్‌సీ)/మెరైన్ ఫిట్టర్ కోర్సు(ఎంఎఫ్‌సీ)ల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వీటిలో కూడా ప్రాక్టికల్, ఆన్ బోర్డ్ ట్రెయినింగ్ ఉంటాయి. ఈ కోర్సులను ఎన్‌సీవీటీ క్రాఫ్ట్‌మన్ ట్రెయినింగ్ స్కీం కింద డీజీఈటీ-న్యూఢిల్లీ నిర్వహిస్తోంది. కొచ్చి, చెన్నై, విశాఖపట్నం క్యాంపస్‌లలో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో క్యాంపస్‌లో ఒక్కో కోర్సులో 20 సీట్లు ఉన్నాయి. ప్రతి క్యాంపస్‌లో కోర్సుకు నాలుగు సీట్లను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్ చేస్తాయి. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

**అర్హత**

గుర్తింపు పొందిన పాఠశాలనుంచి పదో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. మేథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో 40 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.175
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ కేంద్రాలు:** కొచ్చి, చెన్నై, విశాఖపట్నం, కోల్‌కతా
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 29

**వెబ్‌సైట్:** www. cifnet.gov.in

## ఎన్‌యూజేఎస్‌లో ఎమ్మెస్సీ, ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ

కోల్‌కతాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిడికల్ సైన్సెస్(ఎన్‌యూజేఎస్)-ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్), ఎల్ఎల్ఎం(డేటా సైన్స్ అండ్ డేటా ప్రొటెక్షన్ లా), పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

**ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్**

ఈ ప్రోగ్రామ్‌నకు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ(సీఎఫ్ఎస్ఎల్-కోల్‌కతా), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్-కోల్‌కతా) సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయవచ్చు. ఇందులో మొత్తం 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన ప్రాక్టికల్ కోర్సును సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో నిర్వహిస్తారు. రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

**అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో (బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్) (ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/మైక్రో బయాలజీ/కంప్యూటర్ సైన్స్/బోటనీ/జువాలజీ/అంత్రోపాలజీ/మేథమెటిక్స్/ఫోరెన్సిక్ సైన్స్) లేదా బీఎస్సీ ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులందరికీ ఆంగ్లభాషలో ప్రావీణ్యం తప్పనిసరి.

**రిటెన్ టెస్ట్:** రాత పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్, కరెంట్ అఫైర్స్, ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, ఫోరెన్సిక్ సైన్సెస్, లైఫ్ సైన్స్, డేటా సైన్స్ కాన్సెప్ట్స్ ఆఫ్ జస్టిస్ ప్రొసీజర్ ఇన్ ఇండియా త్రూ ఫోరెన్సిక్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత పొందినవారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకి 50 మార్కులు నిర్దేశించారు.

**ఎల్ఎల్ఎం(డేటా సైన్స్ అండ్ డేటా ప్రొటెక్షన్ లా)**

ఈ ప్రోగ్రామ్‌నకు ఐఐఎస్ఈఆర్-కోల్‌కతా, ఐఐటీ-కల్యాణి, ఎన్ఐటీటీటీఆర్-కోల్‌కతా, కాగ్నిజెంట్ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణులు లేదా ఏదేని డిగ్రీ పూర్తిచేసి లా&టెక్నాలజీ విభాగాల్లో అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. లీగల్ ప్రాక్టీస్, టెక్నాలజీ, డేటా సైన్స్, పాలసీ మేకింగ్ విభాగాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూలు:** జూలై 6న
- **వెబ్‌సైట్:** www.nujs.edu

**పీహెచ్‌డీ**

**విభాగాలు-సీట్లు:** కార్పొరేట్ లా 2, క్రిమినల్ లా 3, లా అండ్ టెక్నాలజీ 2, ఐపీఆర్ 4, బిజినెస్ లాస్ 2, ఎయిర్ అండ్ స్పేస్ లా/ఇంటర్నేషనల్ ట్రేడ్ లా 1, ఎన్విరాన్‌మెంటల్ లా 3, హ్యూమన్ రైట్స్ 1, ఇంటర్నేషనల్ లా 1, కాన్‌స్టిట్యూషనల్ లా 2, క్రిమినాలజీ 1, హిస్టరీ 2, పొలిటికల్ సైన్స్ 1, ఎకనామిక్స్ 1, ఫోరెన్సిక్ సైన్స్ 4 సీట్లు చొప్పున మొత్తం 30 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను పార్ట్ టైమ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎల్ఎల్ఎం డిగ్రీ లేదా సంబంధిత లా విభాగంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులందరూ దరఖాస్తుతోపాటు 3000 పదాలతో కూడిన రీసెర్చ్ ప్రపోజల్‌ను జతచేయాలి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ నెట్/జేఆర్ఎఫ్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు.

**ఎంట్రెన్స్ ఎగ్జామ్:** ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది రీసెర్చ్ మెథడాలజీ కాగా రెండోది లా సబ్జెక్ట్/సోషల్ సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 70 మార్కులు, రెండు గంటల పరీక్ష సమయం నిర్దేశించారు.

**లా సబ్జెక్టులు:** లా ఆఫ్ కాంట్రాక్ట్, కాన్‌స్టిట్యూషనల్ లా, లా ఆఫ్ క్రైమ్స్, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, జ్యూరీస్ప్రుడెన్స్, కంపెనీ లా, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లా.

**సోషల్ సైన్స్ సబ్జెక్టులు:** పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్, ఫోరెన్సిక్ సైన్స్





## మీకు తెలుసా?

- చూడానికి చిన్న ఎలుగుబంటులా.. బూడిద రంగులో భయపడుతూ కనపడే ఈ జంతువును 'కోలా' అని పిలుస్తారు.
- కోలా అంటే అర్థం 'నీళ్లు లేవు' అని అర్థం. ఇవి నీళ్లు తాగవు. అయితే ఆకుల్లోని, పండ్లల్లోని నీళ్లను గ్రహిస్తాయి. ఇవి కేవలం ఆస్ట్రేలియాలో మాత్రమే ఉంటాయి.
- ఇవి చెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసిస్తాయి. రోజుకు కేజీ ఆకుల్ని తింటాయి.
- తల్లి కోలాలు బాధ్యతగా ఉంటాయి. వాటి పిల్లలు పెద్దయ్యేదాకా



భుజాల మీద ఎత్తుకుని ఉంటాయి.
- ఇవి పాలిచ్చే జంతువులు. గుంపులుగా ఉండటానికి ఇష్టపడవు. అందుకే ఒంటరిగా మాత్రమే ఉంటాయి.
- వీటి ముక్కు నల్లగా ఉంటుంది. ఎలాంటి ఆహారం అయినా దూరం నుంచే వాసన పడతాయి.
- ఇవి దాదాపు రోజులో ఇరవై గంటలు నిద్రపోతాయి.
- వీటి ముక్కు కింద నిర్మాణం వల్ల బురదలో ముద్రలు పడతాయి. అంటే ఫింగర్ ప్రింట్‌లా జీవ శాస్త్రవేత్తలకు అవసరం అవుతాయి.
- వీటి నాలుగు కాళ్ల పాదాలు గట్టిగా ఉంటాయి. అందువల్లనే కిందపడకుండా చెట్లమీదనే నిద్రపోతాయి.
- ఇవి లక్షకంటే తక్కువ ఉన్నాయి. బెల్లో అంటూ గట్టిగా అరుస్తాయి. ఈ సౌండ్ ద్వారా ఇతర జంతువులతో కమ్యూనికేట్ అవుతాయి.
- వీటి జీవనకాలం గరిష్టంగా 15 ఏళ్లు మాత్రమే.

**సరైన నీడ ఏది?**




**10 తేడాలు గుర్తించండి**



**దారి కనుక్కోండి**



**ఎన్ని డ్రాగన్లు ఉన్నాయి?**



**డైలీ సుడోకు - 314**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | | 1 | | | 6 | | | |
| | | | 5 | 9 | | | | 3 |
| | | | 4 | | | | | 6 |
| | | 9 | 7 | | | 3 | | 8 |
| | 4 | 5 | | | | 1 | 7 | |
| 2 | | 7 | | | 3 | 5 | | |
| 9 | | | | | 5 | | | |
| 5 | | | | 3 | 7 | | | |
| | | | 8 | | | 2 | | 5 |

**సుడోకు - 313 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 1 | 7 | 3 | 9 | 5 | 4 | 8 | 2 |
| 3 | 5 | 2 | 6 | 4 | 8 | 7 | 9 | 1 |
| 4 | 8 | 9 | 1 | 7 | 2 | 5 | 6 | 3 |
| 5 | 9 | 4 | 2 | 3 | 6 | 8 | 1 | 7 |
| 8 | 7 | 3 | 4 | 1 | 9 | 2 | 5 | 6 |
| 1 | 2 | 6 | 8 | 5 | 7 | 9 | 3 | 4 |
| 7 | 3 | 8 | 9 | 6 | 4 | 1 | 2 | 5 |
| 9 | 4 | 1 | 5 | 2 | 3 | 6 | 7 | 8 |
| 2 | 6 | 5 | 7 | 8 | 1 | 3 | 4 | 9 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.